బుధవారం
19-2-2025
హైదరాబాద్ ప్రచురణ
సంపుటి : 09, సంచిక : 149
పేజీలు : 8, వెల: రూ.5.00
Simultaneously published from
Hyderabad, Vijayawada, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam
www.visalaandhra.com
స్థాపితం : 1952
విశాలాంధ్ర
VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

## అణ్వస్త్రాలపై తగ్గేదేలేదు: కిమ్

ప్యాంగ్యాంగ్: ఉత్తర కొరియా అణు నిరాయుధీకరణ కోసం అమెరికా, ఆసియాలోని పొరుగు దేశాలు చేస్తున్నవి అసంబద్ధ ప్రయత్నాలని అధ్యక్షుడు కిమ్ జొంగ్ ఉన్ అన్నారు. అమెరికా ఆలోచనలు, ప్రణాళికలు కాలం చెల్లిపోయాయని ఉత్తర కొరియా విదేశాంగ శాఖ మంగళవారం ఒక ప్రకటనలో ఎద్దేవా చేసింది. తమ జోలికి వస్తే వ్యూహాత్మక ప్రతిఘటన తప్పబోదని హెచ్చరించింది. 'ఉత్తర కొరియా అణునిరాయుధీకరణ కోసం అమెరికా, ఆసియా పొరుగుదేశాలు పెట్టుకున్న లక్ష్యం అసంబద్ధమైనది. అణు దళాల విస్తరణపై వెనక్కి తగ్గే ప్రసక్తే లేదు' అని పేర్కొంది. జర్మనీలో అమెరికా, దక్షిణ కొరియా, జపాన్ దౌత్య చర్చల నేపథ్యంలో ఉత్తర కొరియా విదేశాంగ శాఖ ఈ మేరకు ప్రకటన వెలువరించింది.

## సాక్షి సత్యవర్ధన్‌పై పోలీస్ కేసు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: వైసీపీ నేత, మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీ కేసులో మరో కీలక పరిణామం చోటు చేసుకుంది. గన్నవరం టీడీపీ కార్యాలయంపై దాడి ఘటనలో సాక్షిగా ఉన్న సత్యవర్ధన్‌పై పోలీసులు కేసు నమోదు చేసిన విషయం మంగళవారం వెలుగులోకి వచ్చింది. ఈనెల 11వ తేదీన వల్లభనేని వంశీ, సత్యవర్ధన్‌తోపాటు ఐదుగురిపై పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. అందులో సత్యవర్ధన్‌ను ఏ5గా ఉన్నాడు. గన్నవరం టీడీపీ నేత మేడేపల్లి రమ ఇచ్చిన ఫిర్యాదుపై వంశీ,

- మిగతా 2 లో

## రాజస్థాన్‌లో 'ఉర్దూ' వివాదం

జైపూర్: బీజేపీ పాలిత రాజస్థాన్‌లో 'ఉర్దూ' వివాదం తెరపైకొచ్చింది. అక్కడి ప్రభుత్వ పాఠశాలల్లో ఊర్దూకు బదులు సంస్కృతాన్ని మూడో భాషగా చేర్చాలంటూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. నకిలీ పట్టాలతో ఉద్యోగ భద్రత పొందారంటూ ఉర్దూ టీచర్లనుద్దేశించి ఓ మంత్రి చేసిన వ్యాఖ్యలు దుమారం రేపాయి. థర్డ్ లాంగ్వేజ్‌గా ఊర్దూకు బదులు సంస్కృతం బోధించాలని, ఊర్దును ఆప్షనల్‌గా ఉంచాలని జైపూర్‌లోని మహాత్మా గాంధీ ప్రభుత్వ పాఠశాల (ఆర్ఏసీ బెటాలియన్)ను రాజస్థాన్ విద్యాశాఖ

- మిగతా 2 లో

సీఈసీ, ఈసీ నియామక చట్టంపై

## సుప్రీంలో నేడు విచారణ

న్యూదిల్లీ: ప్రధాన ఎన్నికల కమిషనర్, ఎన్నికల కమిషనర్ల నియామక చట్టానికి వ్యతిరేకంగా దాఖలైన పిటిషన్లపై సుప్రీంకోర్టు బుధవారం విచారణ చేపట్టనుంది. న్యాయమూర్తులు జస్టిస్ సూర్యకాంత్, ఎన్ కోటీశ్వర్ సింగ్‌తో కూడిన ధర్మాసనం ఈ అంశంపై విచారణ చేయనుంది. నూతన ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్‌కుమార్ నియామక ప్రక్రియపై కాంగ్రెస్ పార్టీ అసంతృప్తి వ్యక్తం చేసింది. సీఈసీగా జ్ఞానేష్‌కుమార్ నియామక నిర్ణయం తొందరపడి

- మిగతా 2 లో

# సైబర్ సేఫ్టీలో నంబర్ 1 లక్ష్యం

- సెక్యూర్ బిజినెస్ హబ్‌గా తెలంగాణ
- తప్పుడు వార్తలతో సమాజానికి ముప్పు
- షీల్డ్ ప్రారంభోత్సవంలో సీఎం రేవంత్‌రెడ్డి

విశాలాంధ్ర - హైదరాబాద్: సైబర్ సేఫ్టీలో తెలంగాణను దేశంలోనే నంబర్ వన్‌గా నిలపడమే తమ ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. హెచ్ఐసీసీలో మంగళవారం సైబర్ సెక్యూరిటీ కాన్ క్లేవ్-2025 (షీల్డ్) ప్రారంభోత్సవ కార్యక్రమం జరిగింది. ముఖ్యఅతిథిగా విచ్చేసిన సీఎం మాట్లాడుతూ తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో, సైబరాబాద్ పోలీస్, సొసైటీ ఫర్ సైబరాబాద్ సెక్యూరిటీ కౌన్సిల్ సంయుక్తంగా తెంగాణను నంబర్ వన్ సైబర్ సేఫ్ స్టేట్‌గా మార్చడానికి పనిచేస్తున్న మీ అందరినీ కలుసుకోవడం సంతోషంగా ఉందన్నారు. దేశంలో సైబర్ నేరగాళ్లు గత ఏడాది రూ. 22,812 కోట్లు దోచుకున్నారని పేర్కొన్నారు. ఇది మన ఆర్థిక వ్యవస్థకు, పౌరులకు ముప్పు అని, ఫేక్ న్యూస్ అనేది మరో ప్రధానమైన ముప్పుగా అభివర్ణించారు. సోషల్ మీడియాలో తప్పుడు సమాచారం వల్ల సమాజంలో గందరగోళం ఏర్పడుతుందన్నారు. సైబర్ సెక్యూరిటీ సొల్యూషన్స్ కోసం ఎకో సిస్టమ్ వ్యవస్థను ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం నిపుణులు, ఐటీ సంస్థలతో కలిసి పనిచేయడానికి అన్ని రకాల వనరులు సమకూరుస్తోందన్నారు. తెలంగాణను సెక్యూర్ బిజినెస్ హబ్ గా మార్చాలని పిలుపునిచ్చారు. 1930 నంబర్ ను అందరికీ షేర్ చేయాలని, ఇది 24/7 సైబర్ హెల్ప్‌లైన్ అని వివరించారు. సైబర్ సెక్యూరిటీ బ్యూరో, పౌరులను రక్షించడానికి సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్ ఉన్న అతికొద్ది రాష్ట్రాల్లో తెలంగాణ ఒకటి అని తెలిపారు. గత ఏడాది ఏడు కొత్త ప్రత్యేక సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్‌లను ప్రారంభించామన్నారు. సైబర్ క్రైమ్‌ను నియంత్రించడంలో దేశంలోనే తెలంగాణ ముందు వరుసలో ఉందని, ఆ విభాగాన్ని మరింత బలోపేతం చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. నేరం జరిగిన తరువాత పట్టుకోవడం కాదు, నేరం

- మిగతా 2 లో

# అందని ఊపిరి

## 500 కోట్ల మంది రోగులకు కష్టాలు

- పేద దేశాల్లో పరిస్థితి దయనీయం
- ఆసియా-ఆఫ్రికాలో ప్రాణవాయువు అవసరం అధికం
- మెడికల్ ఆక్సిజన్ లభ్యతపై లాన్సెట్ నివేదిక

న్యూదిల్లీ: ప్రపంచ జనాభాలో మూడింట రెండు వంతులు అంటే దాదాపు 500 కోట్ల మందికి మెడికల్ ఆక్సిజన్ (ప్రాణ వాయువు) అందడం లేదు. దీర్ఘకాల రోగ బాధితులకు శస్త్రచికిత్స సమయంలో మెడికల్ ఆక్సిజన్ అవసరం ఉంటుంది. కోవిడ్-19 తరహా మహమ్మారుల వేళ దీనికి డిమాండ్ మరింత అధికం. భారత్‌లో కోవిడ్ విజృంభణ వేళ మెడికల్ ఆక్సిజన్ కొరత అనేక మంది ప్రాణాలను హరించిన విషయం తెలిసిందే. మెడికల్ ఆక్సిజన్ కొరత ప్రభావం పేద దేశాల రోగులపైనే అధికంగా ఉన్నట్లు లాన్సెట్ అధ్యయనం తేల్చింది. ప్రపంచవ్యాప్తంగా మెడికల్ ఆక్సిజన్ అవసరమైన రోగుల్లో 82 శాతం మంది పేద-మధ్య ఆదాయ దేశాలు (ఎల్ఎంఐసీలు)లో ఉండగా... దక్షిణ-తూర్పు ఆసియాతో పాటు పసిఫిక్, సబ్ సహారన్ ఆఫ్రికాలో 70 శాతం మంది ఉన్నట్లు తెలిపింది. క్రానిక్ అబ్‌స్ట్రక్టివ్ పల్మనరీ డిసీజ్ (సీఓపీడీ) రోగులకు ఆక్సిజన్ అవసరం దీర్ఘకాలం ఉంటుందని నివేదిక పేర్కొంది. పేద-మధ్య ఆదాయ దేశాలకు మధ్య వ్యత్యాసం ఎక్కువగా ఉందని తెలిపింది. ప్రపంచ జనాభాకు మెడికల్ ఆక్సిజన్ లభ్యతపై లాన్సెట్ గ్లోబల్ హెల్త్ కమిషన్ అధ్యయనం జరిపింది. పేద, మధ్యస్థాయి ఆదాయ దేశాల మధ్య అసమానతలు... సరఫరాలో తేడాలు... డిమాండ్-లభ్యతతో పాటు ఖర్చుల్లో వ్యత్యాసాలు గుర్తించినట్లు నివేదిక తెలిపింది. శస్త్రచికిత్సలతో పాటు ఆస్తమా, ట్రామా రోగులకు, మాతృ-శిశు సంరక్షణకు మెడికల్ ఆక్సిజన్ అవసరం ఎక్కువ. కాగా మెడికల్ ఆక్సిజన్ లభ్యతపై మెల్బోర్న్ యూనివర్సిటీ సహా పరిశోధకుల అంతర్జాతీయ బృందం కొన్ని సిఫార్సులు చేసింది. ప్రాణవాయువు బ్లాక్ మార్కెటింగ్ పెరగడంతో సమస్య మరింత జటిలమైంది. కోవిడ్-19 రాక ముందు మెడికల్ ఆక్సిజన్ డిమాండ్ తీర్చేందుకు థర్డ్ పార్టీ విక్రేతలపైనే ఆసుపత్రులు ఎక్కువగా ఆధారపడ్డాయి. మహమ్మారి విజృంభణతో డిమాండ్ పెరిగి బ్లాక్-మార్కెటింగ్ జరిగింది. పరిమితికి మించి నిల్వలు చేశారు. సామాజిక మాధ్యమాల వేదికగా మెడికల్ ఆక్సిజన్ కోసం వినతులు విపరీతంగా వచ్చాయి. కొన్ని అసాధారణ సందర్భాల్లో కోర్టులు జోక్యం చేసుకున్నాయి. ఆక్సిజన్ సరఫరా కోసం సంబంధిత సంస్థలకు, ప్రభుత్వానికి ఆదేశాలిచ్చాయి. ఇలాంటి పరిస్థితులు రాకుండా ఉండాలంటే సముచిత రీతిలో మెడికల్ ఆక్సిజన్ సరఫరా ఉండాలని అధ్యయనకర్తలు సూచించారు. ప్రభుత్వాలకు, పరిశ్రమలకు, అంతర్జాతీయ ఆరోగ్య సంస్థలకు, విద్యాసంస్థలకు, పౌర సమాజానికి కొన్ని సిఫార్సులు చేశారు. మెడికల్ ఆక్సిజన్‌ను అందుబాటులో ఉంచుకునేలా ఆరోగ్య వ్యవస్థలను బలోపేతం చేసుకోవాలని, ఇందుకోసం ఐక్య కృషి అవశ్యమని సూచించారు. అంతర్జాతీయ ప్రజారోగ్య సంరక్షణకు దోహదపడేలా మెడికల్ ఆక్సిజన్ వనరులు ఉండాలన్నారు. అయితే మెడికల్ ఆక్సిజన్‌తో వైద్యం వ్యయంతో కూడుకున్నదని గుర్తుచేశారు. 2030 నాటికి ఆరోగ్యపరంగా సుస్థిరాభివృద్ధి లక్ష్యాల సాధన దిశగా ప్రపంచం పురోగమించడంలో మెడికల్ ఆక్సిజన్ పాత్ర ప్రధానమన్నారు. తదుపరి మహమ్మారికి ప్రపంచ దేశాలు సంసిద్ధంగా

- మిగతా 2 లో

### అర్ధరాత్రి నిర్ణయం

# అవమానకర చర్య

- సుప్రీం ఆదేశాలను ఉల్లంఘించారు
- సీఈసీ ఎంపికపై రాహుల్ తీవ్ర విమర్శలు

న్యూఢిల్లీ: భారత ప్రధాన ఎన్నికల కమిషన్‌గా (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్ ఎంపికైన కొద్ది గంటలకే ఎంపిక కమిటీలో సభ్యుడైన ప్రతిపక్షనేత రాహుల్ గాంధీ తీవ్ర విమర్శలు చేశారు. సీఈసీ ఎంపికపై అభ్యంతరాలు వ్యక్తం చేస్తూ సుప్రీంకోర్టులో దాఖలైన పిటీషన్‌పై విచారణ జరుగుతుండగానే ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, హెూం మంత్రి అమిత్‌షా అర్ధరాత్రి వేళ నిర్ణయం తీసుకోవడం అగౌరవ చర్య

- మిగతా 2 లో

# వైద్యారోగ్యానికి ప్రాధాన్యం

- రాజీవ్ ఆరోగ్యశ్రీకి సమృద్ధిగా నిధులు
- జిల్లా కేంద్రాల్లో సైన్స్ అండ్ టెక్నాలజీ ప్లానిటోరియంలు
- ప్రీ బడ్జెట్ సమావేశంలో భట్టి, రాజనర్సింహ

విశాలాంధ్ర - హైదరాబాద్: వైద్య ఆరోగ్య శాఖకు నిధుల కేటాయింపులో అత్యంత ప్రాధాన్యత ఇస్తామని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. అంబేద్కర్ సచివాలయంలో మంగళవారం వైద్యారోగ్యశాఖ, సైన్స్ అండ్ టెక్నాలజీ ప్రీ బడ్జెట్ సమావేశం జరిగింది. భట్టి, వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అధికారులకు పలు సూచనలు చేశారు. దశాబ్ద కాలంగా డ్రగ్స్, ఫుడ్ సేఫ్టీ, మెడికల్ ఎడ్యుకేషన్ నిర్లక్ష్యానికి గురయ్యాయని అభిప్రాయపడ్డారు. వీటిని ఆధునికీకరణ చేస్తాం అన్నారు. రాజీవ్ ఆరోగ్యశ్రీ కి బడ్జెట్లో సమృద్ధిగా నిధులు కేటాయించి, పేద, మధ్యతరగతి వర్గాలకు మెరుగైన వైద్య సేవలు అందుబాటులోకి తీసుకొస్తామన్నారు. ఏడాది కాలంలో రాష్ట్రంలో వైద్య కళాశాల భవనాలు, ఆసుపత్రుల నిర్మాణం పనులు పూర్తవుతాయని మంత్రులు తెలిపారు. జిల్లా కేంద్రాల్లో సైన్స్ అండ్ టెక్నాలజీ ప్లానిటోరియంలు నిర్మిస్తామన్నారు. స్పెషల్ చీఫ్ సెక్రటరీ రామకృష్ణారావు, వైద్య ఆరోగ్య శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ క్రిస్టియాన చొంగతా, సైన్స్ అండ్ టెక్నాలజీ ప్రిన్సిపల్ సెక్రటరీ అహ్మద్ నదీమ్, ఆర్థిక శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సందీప్ కుమార్ సుల్తానియా, ఆర్థిక శాఖ జాయింట్ సెక్రటరీ హరిత పాల్గొన్నారు.

## ఏడు వర్సిటీలకు కొత్త వీసీలు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రాష్ట్రంలోని ఏడు యూనివర్సిటీలకు వైస్ ఛాన్సలర్లు నియమితులయ్యారు. ఆంధ్రా వర్సిటీ వీసీగా ప్రొఫెసర్ జీపీ రాజశేఖర్, ప్రొఫెసర్ ప్రసన్న శ్రీ (ఆదికవి నన్నయ యూనివర్సిటీ), ప్రొఫెసర్ కె.రామ్‌జీ (కృష్ణ యూనివర్సిటీ) ప్రొఫెసర్ ఉమ (పద్మావతి మహిళా విశ్వవిద్యా లయం), ప్రొఫెసర్ హెచ్ సుదర్శన రావు (అనంతపురం జేఎన్టీయూ), డాక్టర్ వెంకట బసవరావు (రాయలసీమ యూనివర్సిటీ), ప్రొఫెసర్ అల్లం శ్రీనివాసరావు (విక్రమ సింహపురి యూనివర్సిటీ)ను నియమిస్తూ గవర్నర్ అబ్దుల్ నజీర్ నోటిఫికేషన్ జారీచేశారు. వీరు మూడేళ్ల పాటు పదవిలో కొనసాగనున్నారు. కాగా, జీపీ రాజశేఖర్ ఐఐటీ ఖరగ్‌పూర్‌లో గణితశాస్త్ర ఆచార్యునిగా పనిచేస్తున్నారు. అలాగే ప్రొఫెసర్ ప్రసన్న శ్రీ ఆంధ్ర యూనివర్సిటీ ఇంగ్లీష్ ప్రొఫెసర్. మచిలీపట్నంలోని

- మిగతా 2 లో

## కుంభమేళాలో మృతుల వివరాలు వెల్లడించాలి: చాడ

విశాలాంధ్ర- హైదరాబాద్ : కుంభమేళలో మృతి చెందిన వారి వివరాలు స్పష్టంగా వెల్లడించాలని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మహా కుంభమేళ ప్రచారం జోరుగా ఉన్నా సౌకర్యాలు మాత్రం శూన్యమని విమర్శించారు. ప్రయాగ్ రాజ్‌లో జరిగిన తొక్కిసలాటలో 30 మంది, దిల్లీ రైల్వేస్టేషన్లో 18 మంది, చత్తీస్‌గఢ్, హైదరాబాద్‌కు చెందిన పదిమంది రోడ్డు ప్రమాదంలో మరణించినట్టు అధికార లెక్కలు చెబుతున్నా, కోట్లాది మంది పాల్గొనే కుంభమేళాలో మృతుల సంఖ్య ఎక్కువగానే ఉన్నట్లు మేధావులు అంచనా వేస్తున్నారని, ఆ లెక్కలను కేంద్రం, ఉత్తరప్రదేశ్ ప్రభుత్వాలు కప్పిపుచ్చుతున్నట్లు కనబడుతోందని ఆరోపించారు. భక్తుల మనోభావాలను దెబ్బతీసే విధంగా ఉన్నాయని, దీనికి ప్రధాని మోదీ సమాధానం చెప్పాలని అన్నారు. సమగ్రమైన విచారణ జరిపించాలని, మృతి చెందిన కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.50 లక్షల పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు.

### క్రమబద్ధీకరణకు కృషి

పర్యాటకశాఖలో ఔట్‌సోర్సింగ్

- మిగతా 2 లో

# రైతు ప్రయోజనార్థమే 'భూ భారతి'

### త్వరలో అమల్లోకి చట్టం: పొంగులేటి

విశాలాంధ్ర - హైదరాబాద్: ప్రజాస్వామ్యయుతంగా అసెంబ్లీలో డ్రాఫ్ట్ బిల్లు ప్రవేశపెట్టి ... మేధావులు, రాజకీయ పార్టీల ప్రతినిధుల సలహాలు సూచనలతో దేశానికి ఆదర్శంగా ఉండేలా భూ భారతి ఆర్వోఆర్-2025 చట్టాన్ని తీసుకువచ్చామని, అదే స్ఫూర్తితో చట్టానికి విధివిధానాలను రూపొందిస్తున్నామని రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. తెలంగాణ ప్రజల ఆశలు ఆకాంక్షలకు అనుగుణంగా ప్రజానీకానికి మెరుగైన, సమగ్రమైన రెవెన్యూ సేవలను

- మిగతా 2 లో

## ఇదీ లోకం!




బాబు గారూ, మా ఊర్లో ఒక చిన్న గ్రంథాలయం నిర్మించండి సార్! చాలు.

## కాంగ్రెస్‌ను గద్దె దింపుతాం

- ప్రతి రైతుకు రూ.17,500 ప్రభుత్వం బాకీ
- రైతుబంధూ లేదు... తులం బంగారమూ లేదు
- బకాయిలు అందక మాజీ సర్పంచ్‌ల ఆత్మహత్యలు
- రైతుదీక్షలో సీఎంపై కేటీఆర్ ధ్వజం

2లో

# మహాయుతిలో ముదిరిన వివాదం

### షిండే వర్గం ఎమ్మెల్యేల భద్రత కుదింపు

ముంబై: మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్‌కు, ఆయన డిప్యూటీ ఏక్‌నాథ్ షిండేకు మధ్య 'ప్రచ్ఛన్న యుద్ధం' జరుగుతోందా? 20 మంది శివసేన వర్గం ఎమ్మెల్యేల భద్రతను 'వై ప్లస్' కేటగిరి భద్రత తగ్గించడం, రాయ్‌గఢ్, నాసిక్‌లకు ఇంచార్జుల నియామకంపై షిండే శివసేన అభ్యంతరం తెలపడం వంటి వరుస పరిణామాల నేపథ్యంలో ఇద్దరి మధ్యా వ్యవహారం చెడిందనే ఊహాగానాలు ఉపందుకుంటున్నాయి. మహాయుతి కూటమిలో చీలికలు వస్తున్నట్లు కొంతకాలంగా ప్రచారం జరుగుతోంది. కూటమిలోని ప్రధాన పార్టీ అయిన షిండే వర్గానికి, బీజేపీకి మధ్య విభేదాలు తలెత్తినట్లు రాజకీయ వర్గాలు సైతం చెబుతున్నాయి. దేవేంద్ర ఫడ్నవీస్ నేతృత్వంలోని హోంశాఖ తాజా నిర్ణయంతో మహాయుతి కూటమిలోని లుకలుకలు మరోసారి బయటపడ్డాయి. 20 మంది అధికార ఎమ్మెల్యేల వై కేటగిరీ భద్రతను కుదించేందుకు ప్రభుత్వం సిద్ధమైనట్లు తెలుస్తుంది. ఈ మేరకు ఆంగ్లమీడియాలో కథనాలు వెల్లడిస్తున్నాయి. ఉప ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే నేతృత్వంలోని శివసేనకు చెందిన 20 మంది ఎమ్మెల్యేలకు వై సెక్యూరిటీ కవర్‌ను రాష్ట్ర ప్రభుత్వం ఉపసంహరించుకుంది. బీజేపీ, అజిత్ పవార్ వర్గం ఎమ్మెల్యేలకు కూడా భద్రతను తగ్గించనున్నారు. అయితే, షిండే వర్గంతో పోలిస్తే ఆ సంఖ్య చాలా తక్కువగా ఉన్నట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. రాష్ట్ర వనరుల దుర్వినియోగాన్ని అరికట్టడం పేరుతో ప్రభుత్వం ఈ చర్య తీసుకుంటున్నట్లు ప్రచారం జరుగుతోంది. గతంలో మహావికాస్ అఘాడి

- మిగతా 2 లో

## మార్క్సిజాన్ని అభిమానించిన నరేంద్ర దేవ్

అఖిలభారత కిసాన్ సభ ఏర్పడినప్పుడు ఆచార్య నరేంద్ర దేవ్ అందులో కీలక పాత్రధారి. అఖిలభారత కిసాన్ సభ (ఏఐకేఎస్) అధ్యక్షుడిగా కూడా ఉన్నారు. బాల గంగాధర్ తిలక్, అరవిందో ఘోష్ స్ఫూర్తితో నరేంద్ర దేవ్ జాతీయోద్యమంలో భాగస్వామి అయ్యారు. ఆయనకు బౌద్ధం మీద ఎంత విశ్వాసం ఉండేదో మార్క్సిజం మీద కూడా అంతే అనురక్తి ఉండేది. హిందీ భాషోద్యమంలోనూ ఆయన కీలక పాత్ర పోషించారు.

ప్రత్యేక వ్యాసం 4వ పేజీలో

# ఆ ఐదు జోన్లలో ఐడీఎఫ్ కొనసాగింపు

## లెబనాన్ నుంచి సైనిక ఉపసంహరణపై ఇజ్రాయిల్

**బీరుట్/టెల్ అవీవ్:** దక్షిణ లెబనాన్ నుంచి ఇజ్రాయిల్ బలగాల ఉపసంహరణకు విధించిన గడువు మంగళవారంతో ముగిసింది. ఐదు వ్యూహాత్మక క్షేత్రాల్లో తమ సైన్యాన్ని మోహరించి ఉంచుతామని ఇజ్రాయిల్ వెల్లడించింది. లెబనాన్‌లోని ఐదు బఫర్ జోన్లలో ఇజ్రాయిల్ రక్షణ దళాలు (ఐడీఎఫ్) ఉంటాయని ఆ దేశ రక్షణ మంత్రి ఇజ్రాయిల్ కట్జ్ వెల్లడించారు. ఉపసంహరణ గడువు ముగిసినప్పటికీ ఆ ఐదు ప్రాంతాల నుంచి దళాలను వెనక్కి పంపేది లేదని స్పష్టంచేశారు. హెజ్బుల్లాతో కాల్పుల విరమణ ఒప్పందం ప్రకారం ఈ మేరకు అంగీకారం కుదిరింది. నవంబరు 27న అమెరికా మధ్యవర్తిత్వంతో కాల్పుల విరమణ ఒప్పందం జరిగింది. వాస్తవానికి సోమవారం నుంచి ఇజ్రాయిల్ దళాల ఉపసంహరణ ప్రక్రియ మొదలైంది. కొన్ని సరిహద్దు గ్రామాల నుంచి బలగాలు వెనక్కి వెళుతున్నట్లు లెబనాన్ భద్రతాధికారి తొలుత చెప్పారు. కానీ ఐదు కంట్రోల్ పోస్టుల వద్ద లెబనాన్ బఫర్ జోన్లలో ఐడీఎఫ్ రక్షణ కొనసాగుతుందని, ఇజ్రాయిల్ గ్రామాలకు, లెబనాన్ నుంచి బెదిరింపులు ఉన్న నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు సైనిక ఉపసంహరణకు గడువు ముగిసిన కొన్ని గంటల్లోనే కీలక ప్రకటన చేశారు. సరిహద్దు వద్ద ఇజ్రాయిల్ వైపు కొత్త అవుట్‌పోస్టులను తమ సైన్యం ఏర్పాటు చేసుకున్నట్లు వెల్లడించారు. లిటానీ నది ఆపై ప్రాంతాల నుంచి హెజ్బుల్లా పూర్తిస్థాయిలో వెనక్కి తగ్గాలన్నారు. ఆ సాయుధ దళాన్ని పూర్తిగా నిరాయుధీకరించాలని లెబనాన్ సైన్యంపై కట్జ్ ఒత్తిడి తెచ్చారు. హెజ్బుల తరపున ఎలాంటి అతిక్రమణలు జరిగినా దీటుగా బదులిస్తామని హెచ్చరించారు. అన్ని ఉత్తరాది ప్రాంతాలను రక్షిస్తామన్నారు. కాగా, హెజ్బుల్లాకు పట్టున్న తూర్పు-దక్షిణ లెబనాన్, దక్షిణ బీరుట్‌లో గత రెండు నెలలుగా సాగిన యుద్ధం కారణంగా జరిగిన నష్టం భారీగా ఉన్నట్లు అధికారులు తెలిపారు. పున:నిర్మాణానికి 10 బిలియన్ డాలర్లకుపై ఖర్చు కావచ్చన్న అంచనాకు వచ్చారు. లక్ష మందికిపైగా నిరాశ్రయులు అయినట్లు ఐరాస గణాంకాలు చెబుతున్నాయి.

**దురాక్రమణగానే భావిస్తాం: లెబనాన్**

సైనిక ఉపసంహరణ పూర్తి స్థాయిలో జరగబోదని ఇజ్రాయిల్ ప్రకటించడాన్ని లెబనాన్ ఆక్షేపించింది. తమ భూభాగంలో ఇజ్రాయిల్ దళాలు ఉండటాన్ని దురాక్రమణగానే భావిస్తామని ప్రకటించింది. దీనికి వ్యతిరేకంగా చర్యలు తీసుకునే అధికారం తమకున్నట్లు వెల్లడించింది. ఇజ్రాయిల్ సైన్యం పూర్తిస్థాయిలో తమ భూభాగం నుంచి వెళ్లిపోయేందుకు అవసరమైన అన్ని చర్యలను తీసుకునే హక్కు లెబనాన్‌కు ఉన్నదని లెబనాన్ అధ్యక్షుడి తరపున ఓ అధికారి ప్రకటించారు.

**హమాస్ సైన్యాధికారి హతం**

లెబనాన్‌లో జరిపిన వైమానిక దాడిలో హమాస్ సైన్యాధికారి హతమైనట్లు ఇజ్రాయిల్ భద్రతాధికారులు ప్రకటించారు. ఈ మేరకు ఇజ్రాయిల్ సైన్యం, షిన్ బెట్ ప్రాదేశిక భద్రతా సంస్థ సంయుక్త ప్రకటన చేశాయి. దక్షిణ లెబనాన్ కోస్తా నగరమైన సిడాన్‌లో జరిపిన వైమానిక దాడుల్లో మహమ్మద్ షహీన్ మరణించారు. ఆయన లెబనాన్ ఆపరేషన్స్ విభాగంలో హమాస్ అధిపతి, ఇటీవల లెబనాన్ నుంచి ఇజ్రాయిల్ సొరులపై జరిగిన దాడుల సూత్రధారి అంటూ సంయుక్త ప్రకటన పేర్కొంది.

# అమెరికా-రష్యా శాంతి చర్చలు

**రియాద్:** ఉక్రెయిన్ అధ్యక్షుడు వొలోదిమిర్ జెలెన్‌స్కీతో చర్చలకు రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ సిద్ధంగా ఉన్నట్లు క్రెమ్లిన్ ధ్రువీకరించింది. యూరోపియన్ యూనియన్‌లో చేరడమన్నది ఉక్రెయిన్‌కున్న సార్వభౌమ హక్కుగా పేర్కొంది. కీవ్‌ను శాంతించే ఉద్దేశం మాస్కోకు లేదని తెలిపింది. ఉక్రెయిన్-రష్యా యుద్ధానికి ముగింపు పలికే దిశగా శాంతి చర్చలు కొనసాగుతున్నాయి. ఇదే క్రమంలో అమెరికా, రష్యా ప్రతినిధులు మంగళవారం రియాద్‌లో భేటీ అయ్యారు. రెండు దేశాల ఉన్నత స్థాయి అధికారులు భేటీకి హాజరయ్యారు. సౌదీ రాజ కుటుంబానికి చెందిన దిరియా ప్యాలెస్‌లో సమావేశం జరిగింది. ఈ క్రమంలో క్రెమ్లిన్ అధికార ప్రతినిధి దిమిత్రీ పెస్కోవ్ విలేకరులతో మాట్లాడుతూ యూరోపియన్ యూనియన్‌లో ఉక్రెయిన్ చేరాలని అనుకుంటే మాస్కో అడ్డుచెప్పదన్నారు. ఉక్రెయిన్ సార్వభౌమ దేశమని, ఈయూలో చేరడం దాని హక్కు అని అన్నారు. 'మనం మాట్లాడుకుంటున్నది ఏకీకరణ గురించి... ఆర్థిక ఏకీకరణ విధానం గురించి... ఇక్కడ ఏ దేశం మరొక దేశాన్ని శాశించలేదు. మేము కూడా అలా చేయబోం' అని పెస్కోవ్ బదులిచ్చారు. అదే సమయంలో సైనికుల కూటముల్లో ఉక్రెయిన్ చేరే అంశంలో రష్యా వైఖరి మారుతుందని చెప్పారు. ఇది పూర్తిగా భద్రతా సంబంధితం కాబట్టి రక్షణ లేక సైనిక కూటముల్లో చేరడంపై రష్యా వైఖరి పూర్తి భిన్నంగా ఉంటుందని అన్నారు. ఇదిలావుంటే, అమెరికా తరపున మార్కో రుబియో, రష్యా తరపున సెర్గి లావ్రోవ్ చర్చల్లో పాల్గొన్నారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌పై రష్యా ఆశలు పెట్టుకున్నది. ఆయనను సమస్యలను పరిష్కరించగల సమర్థుడిగా వర్ణించింది. పెద్ద సవాళ్లను వేగంగా, సమర్థంగా, విజయవంతంగా పరిష్కరించగలరంటూ రియాద్‌లో విలేకరులతో మాట్లాడిన రష్యా అధికారి కిరిల్ దిమిత్రీవ్ అన్నారు.

**స్వాగతిస్తున్నాం: చైనా**

శాంతి నెలకొల్పే దిశగా జరుగుతున్న కసరత్తులో భాగంగా రియాద్ వేదికగా రష్యా, అమెరికా ప్రతినిధులు చర్చలను స్వాగతిస్తున్నట్లు చైనా తెలిపింది. ఈ మేరకు ఆ దేశ విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి గువో జియాకున్ మంగళవారం ఒక ప్రకటన చేశారు. 'శాంతి సాధన కోసం జరిగే అన్ని ప్రయత్నాలను మేము స్వాగతిస్తాం' అని గువో అన్నారు. అన్ని వర్గాల ప్రతినిధులు ఉక్రెయిన్ శాంతి చర్చల్లో సమానుచితంగా వ్యవహరిస్తారని చైనా ఆకాంక్షిస్తున్నట్లు ఆయన తెలిపారు.

## సైబర్ సేఫ్టీలో 'నంబర్ 1' లక్ష్యం

(మొదటి పేజీ తరువాయి)

జరగకుండా నిరోధించేలా సిద్ధం కావాలన్నారు.

**స్టార్టప్‌ల అభివృద్ధికి బ్రెజిల్‌తో కీలక ఒప్పందం**

స్టార్టప్‌ల అభివృద్ధికి ప్రభుత్వం మరో కీలక ఒప్పందం చేసుకుంది. అంతర్జాతీయ స్టార్టప్ భాగస్వామ్యానికి టీ హబ్, బ్రెజిల్ కు చెందిన గోయాస్ హబ్ తో అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఐటీ శాఖ మంత్రి శ్రీధర్ బాబు గో యాస్ హబ్ ప్రతినిధులతో చర్చలు జరిపారు. టీ హబ్ ఫౌండేషన్ సీఈవో సుజిత్, బ్రెజిల్ గోయాస్ స్టేట్ సైన్స్ టెక్నాలజీ అండ్ ఇన్నోవేషన్ సెక్రటరీ జోస్ ఫ్రెడెరికో లైరా నెట్టో ఒప్పందంపై సంతకాలు చేశారు. దీని ప్రకారం తెలంగాణ స్టార్టప్‌లకు బ్రెజిల్‌లో, బ్రెజిల్ స్టార్టప్‌లకు మన రాష్ట్రంలో అవకాశాలు లభిస్తాయి. ప్రధానంగా అర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, ఐటీ, అగ్రి-టెక్, హెల్త్ కేర్, బయోటెక్, మైనింగ్ రంగాల్లో పరస్పర సహకారం పంచుకుంటాయి. మార్కెట్ యాక్సెస్ తో పాటు కెపాసిటీ బిల్డింగ్ ఇంక్యుబేషన్, సాంకేతిక భాగస్వామ్యం, పెట్టుబడుల అవకాశాల మెరుగుదల వంటి కీలక అంశాలపై రెండు సంస్థలు కలిసి పని చేస్తాయి.

## కుంభమేళాలో మృతుల వివరాలు వెల్లడించాలి

(మొదటి పేజీ తరువాయి)

ఉద్యోగుల క్రమబద్ధీకరణకు, జీతాల పెంపునకు కృషి చేస్తానని పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు హామీ ఇచ్చారు. క్రమబద్ధీకరణ, జీతాలపెంపు తదితర సమస్యలపై మంత్రితో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు చర్చించారు. చాడా వెంకట్ రెడ్డి, తెలంగాణ పర్యాటక శాఖ కాంట్రాక్ట్, అవుట్ సోర్స్ ఉద్యోగుల సంఘం జనరల్ సెక్రటరీ సబ్బు రాజమౌళి, యల్.సాంబశివ రెడ్డి, యు.రమేష్ బాబు, యస్.డి నాసర్ అలీ మంత్రిని కలిసినవారిలో ఉన్నారు.

## మహాయుతిలో ముదిరిన వివాదం

(మొదటి పేజీ తరువాయి)

కూటమి నుంచి అధికార పార్టీలో చేరిన ఎమ్మెల్యేలకు ఈ వై కేటగిరీ భద్రత కల్పించారు. తాజాగా ఈ భద్రతను తొలగించేందుకు సిద్ధమయ్యారు. 3 నెలల కిందటే మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో మహాయుతి కూటమి ఘన విజయం సాధించింది. ఆ తర్వాత సీఎం అభ్యర్థి ఎంపికలో విభేదాలు నెలకొన్నప్పటికీ... రెండు పార్టీలు రాజీ ధోరణి ప్రదర్శించి...ప్రభుత్వాన్ని ఏర్పాటుచేశారు. ఇటీవల ఇంచార్జి మంత్రుల నియామకంలోనూ అధికార కూటమిలో విభేదాలు తలెత్తాయి. రాయ్‌గఢ్, నాసిక్‌లకు ఇంచార్జుల నియామకంపై షిండే సేన అభ్యంతరం తెలపడంతో వాటికి బ్రేక్ పడింది. ఈ పరిణామాల వేళ... షిండే నేతృత్వంలోని ఎమ్మెల్యేలకు భద్రతను కుదించాలని నిర్ణయించుకోవడం వివాదాలకు ఆజ్యం పోసినట్లు అయింది. కాగా, సీఎం, డిప్యూటీ సీఎం మధ్య 'కోల్డ్ వార్' నడుస్తున్నట్టు మీడియాలో వస్తున్న వార్తలపై షిండే స్పందిస్తూ... తమ మధ్య ఎలాంటి 'కోల్డ్ వార్' లేదన్నారు. 'ఠండా ఠండా కూల్ కూల్' అని నవ్వుతూ సమాధానమిచ్చారు. 'ఎలాంటి కోల్డ్ వార్ లేదు. మాదేమీ మహా వికాస్ అఘాడి (విపక్ష కూటమి) కాదు, ఇండియా ఐక్య సంఘటన కాదు. రాష్ట్ర ప్రగతి కోసం మేము సమష్టిగా పనిచేస్తున్నాం' అని ఏక్‌నాథ్ షిండే వివరణ ఇచ్చారు.

## ఏడు వర్సిటీలకు కొత్త వీసీలు

(మొదటి పేజీ తరువాయి)

కృష్ణ యూనివర్సిటీ వీసీ రామ్‌జీ ఆంధ్ర వర్సిటీ ఇంజనీరింగ్ కాలేజి ప్రొఫెసర్‌గా ఉన్నారు. డాక్టర్ వెంకట బసవరావు ఉస్మానియా యూనివర్సిటీ కెమికల్ ఇంజనీరింగ్ ప్రొఫెసర్ కాగా నెల్లూరు జిల్లా విక్రమ సింహపురి యూనివర్సిటీ వీసీ అల్లం శ్రీనివాసరావు ఢిల్లీ టెక్నాలజికల్ యూనివర్సిటీలో లుమినిసెంట్ మెటీరియల్స్ విభాగం ప్రొఫెసర్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్నారు.

## అందని ఊపిరి

(మొదటి పేజీ తరువాయి)

ఉండటం కోసం సముచిత చర్యలు అవసరమని, మెడికల్ ఆక్సిజన్‌పై దృష్టి సారించకుంటే భవిష్యత్‌లో ఆరోగ్య సంరక్షణ లక్ష్యాల సాధనకు తక్షణ చర్యలు అత్యవసరమని అధ్యయనకర్తలు సూచించారు. మెడికల్ ఆక్సిజన్‌పై పెట్టుబడి ప్రపంచ ప్రజారోగ్య మెరుగుదలకు సరళమైన, సమర్థమైన మార్గాల్లో ఒకటి కాగలదని అధ్యయనం వెల్లడించింది. తద్వారా సుస్థిరాభివృద్ధి లక్ష్యాల సాధనలో పురోగతి సాధ్యమని పేర్కొంది. ఆరోగ్య సంరక్షణ సవాళ్లను పరిష్కరించడంతో పాటు సంబంధిత వ్యత్యాసాలను తగ్గించడానికి సమష్టిగా కృషి చేయడం ముఖ్యమని నివేదిక నొక్కిచెప్పింది. గతంలో పోలిస్తే మెడికల్ ఆక్సిజన్ ఉత్పత్తి, పంపిణీలో భారత్ పురోగతి సాధించినట్లు తెలిపింది.

# కాంగ్రెస్‌ను గద్దె దింపుతాం

**విశాలాంధ్ర-ఆమనగల్లు:** రాష్ట్రంలో ప్రజలను మోసగిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వాన్ని గద్దె దింపుతామని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ అన్నారు. రాష్ట్రంలో అన్నదాతలకు అండగా మంగళవారం ఆమనగల్లులోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ అధ్యక్షతన రైతు దీక్ష చేపట్టారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన కేటీఆర్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన 14 నెలల్లో ప్రజల సొమ్ముతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి 35 సార్లు ఢిల్లీ వెళ్లారని, 10 శాతం మందికి కూడా రైతుబంధు వేయలేదని, ప్రతి రైతుకు ఎకరానికి రూ.17,500 ప్రభుత్వం బాకీ పడిందని అన్నారు. రేవంత్ రెడ్డి అత్తమామల నియోజకవర్గమైన కల్వకుర్తిలో కూడా మహిళలకు తులం బంగారం అందలేదని విమర్శించారు. మాజీ సీఎం కేసీఆర్ హయాంలో గ్రామాలను అభివృద్ధి పథంలో నడిపించిన మాజీ సర్పంచ్‌ల పెండింగ్ బిల్లులు రూ.600 కోట్లు మంజూరు చేయలేక రేవంత్ రెడ్డి వారి ఆత్మహత్యలకు కారణమవుతున్నారని ఆరోపించారు. ప్రపంచానికే అన్నం పెట్టిన కేసీఆర్‌ను వదులుకున్నందుకు రాష్ట్ర ప్రజలు ప్రస్తుతం బాధ పడుతున్నారని పేర్కొన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ నాయకులకు తగిన గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు. 11 ఏళ్ల కిందట పార్లమెంట్‌లో తెలంగాణ బిల్లు పాస్ అయిన ఫిబ్రవరి 18వ తేదీనే పాలమూరులో రైతులు దీక్షకు దిగడం చూస్తుంటే బాధేస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. కేటీఆర్ ప్రసంగిస్తున్న సమయంలో కొందరు యువకులు సీఎం సీఎం అంటూ నినాదాలు చేయడంతో ఆపండయ్యా అంటూ కొంత అసహనం వ్యక్తం చేశారు. మాజీ మంత్రులు సబితా ఇంద్రారెడ్డి, శ్రీనివాస్ గౌడ్, శ్రీనివాస్ రెడ్డి, లక్ష్మారెడ్డి, రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి, ఎమ్మెల్సీలు నవీన్ కుమార్ రెడ్డి, సురభి వాణి దేవి, మాజీ ఎమ్మెల్యేలు గువ్వల బాలరాజు, అంజయ్య యాదవ్, డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్, రాష్ట్ర మిషన్ భగీరథ మాజీ వైస్ చైర్మన్ వెంకటేష్ హాజరయ్యారు. తొలుత కేటీఆర్ ర్యాలీ కి దారి పొడువునా ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు గులాబీ పూల వర్షాన్ని కురిపిస్తూ ఘన స్వాగతం పలికారు.

## సాక్షి సత్యవర్ధన్‌పై పోలీస్ కేసు

(మొదటి పేజీ తరువాయి)

కొమ్మా కోట్లు, భీమవరపు రామకృష్ణ, రాజు, సత్యవర్ధన్‌పై పటమట పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసులో వంశీ అనుచరుల బెదిరింపులకు సత్యవర్ధన్ లొంగి రూ.5లక్షలు తీసుకుని కేసు వెనక్కి తీసుకున్నారని రమాదేవి వివరించారు. టీడీపీ వాళ్లతో మాట్లాడి అంతకంటే ఎక్కువ ఇప్పించాలని తమను కోరినట్లుగా ఫిర్యాదులో ఆమె తెలిపారు. దీంతో రమాదేవి...పార్టీ తరపున అండగా ఉంటామని చెప్పినప్పటికీ...సత్యవర్ధన్ వినకుండా కేసు వాపసు తీసుకున్నారని వివరించారు. వంశీ, అతని అనుచరులు డబ్బులిస్తామని ప్రలోభాలు పెట్టి... చెప్పినట్లు చెయ్యకపోతే చంపుతామని సత్యవర్ధన్‌ను బెదిరించారని పేర్కొన్నారు. ఆమె ఫిర్యాదు మేరకు వల్లభనేని వంశీ, కొమ్మా కోట్లు, భీమవరపు రామకృష్ణంరాజు, సత్యవర్ధన్‌లపై పటమట పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసులో బెయిల్ కోసం వంశీ తరపు న్యాయవాదులు కోర్టును ఆశ్రయించగా... ఇదే సమయంలో సత్యవర్ధన్‌పై కేసు నమోదు చేయడం చర్చనీయాంశంగా మారింది. అటు జైలులో వంశీని వైసీపీ అధినేత జగన్ పరామర్శించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ, వంశీపై అన్యాయం కేసు నమోదు చేసి, చంద్రబాబు ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతోందని ధ్వజమెత్తారు.

## రాజస్థాన్‌లో 'ఉర్దూ' వివాదం

(మొదటి పేజీ తరువాయి)

ఇటీవల ఆదేశించింది. ఆపై కొన్ని రోజులకు బికనీర్ ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలకూ ఇవే ఉత్తర్వులు జారీ అయ్యాయి. మరోవైపు ఉర్దూ టీచర్లపై మంత్రి జవహర్ సింగ్ వివాదాస్పద వ్యాఖ్యలతో వివాదం మరింత ముదిరింది. కాంగ్రెస్ గత ప్రభుత్వం సంస్కృతం టీచర్లను తొలగించి వారి స్థానంలో ఉర్దూ అధ్యాపకులను నియమించినట్లు మంత్రి ఆరోపించారు. ఎవరికీ ఉర్దూ రాదని, ఆ భాషను అభ్యసించేవారు లేరని, ఉర్దూ టీచర్లను తొలగించి ప్రజలు కోరే విద్యను అందించాలన్నారు. ఈ వ్యాఖ్యలను రాజస్థాన్ ఉర్దూ టీచర్ల సమాఖ్య తీవ్రంగా ఖండించింది. నిర్లక్ష్యపూరిత, నిరాధార వ్యాఖ్యలను మంత్రి చేయడం హేయమని దుయ్యబట్టింది. తప్పుడు ఆరోపణలు ఎలా చేస్తారని నిలదీసింది. తాజా వివాదంపై పాఠశాల విద్యా మంత్రి మదన్ దిలావర్ స్పందించలేదు. సెకండరీ ఎడ్యుకేషన్ బోర్డు డైరెక్టర్ ఆశీష్ మోదీ మాత్రం వివరణ ఇచ్చారు. అన్ని స్కూళ్లకు ఈ ఉత్తర్వులు ఇవ్వలేదు... బికనీర్, నపాసర్ ప్రభుత్వ పాఠశాలలో ఒకరు తప్ప ఉర్దూ విద్యార్థులు లేరు కాబట్టే దాని తొలగింపునకు ఉత్తర్వులు జారీ అయ్యాయని వివరించారు.

## నూతన సీఈసీ జ్ఞానేశ్‌కుమార్, ఈసీ వివేక్ జోషి

**న్యూఢిల్లీ:** భారత ఎన్నికల సంఘం ప్రధాన కమిషనర్‌గా జ్ఞానేశ్ కుమార్ (61) నియమితులయ్యారు. ఎన్నికల కమిషనర్ (ఈసీ)గా వివేక్ జోషీని ఎంపిక చేశారు. ఈ మేరకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలోని త్రిసభ్య సెలక్షన్ కమిటీ ఖరారు చేసింది. ఇందుకు సంబంధించి సోమవారం రాత్రి రెండు గెజిట్ నోటిఫికేషన్లు విడుదల య్యాయి. ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ), ఎన్నికల కమిషనర్ (ఈసీ) పదవిని చేపట్టబోయే వ్యక్తుల పేర్లను ఈ నోటిఫికేషన్లలో వెల్లడించారు. కేంద్ర న్యాయశాఖ మంత్రి అర్జున్‌రాం మేఘ్‌వాల్ నేతృత్వంలోని సెర్చ్ కమిటీ ప్రతిపాదించిన ఐదుగురు అభ్యర్థుల జాబితాలో జ్ఞానేశ్ కుమార్‌ను ప్రధాన ఎన్నికల కమిషనర్‌గా ఎంపిక చేశారు. సెలక్షన్ కమిటీ ఖరారు చేసిన నూతన సీఈసీ, ఈసీ పేర్లను రాష్ట్రపతి ద్రౌపదిముర్ముకు సిఫార్సు చేసినట్లు అధికార వర్గాలు వెల్లడించాయి. అనంతరం సోమవారం రాత్రి జ్ఞానేశ్‌కుమార్‌ను భారత 26వ ప్రధాన ఎన్నికల కమిషనర్‌గా నియమిస్తూ రాష్ట్రపతి ఉత్తర్వులు జారీ చేశారు. ఫిబ్రవరి 19న జ్ఞానేశ్ కుమార్ సీఈసీగా బాధ్యతలు స్వీకరించనున్నారు. సీఈసీగా జ్ఞానేశ్ కుమార్ ఈ పదవిలో 2029 జనవరి 26 దాకా కొనసాగుతారు. అలాగే ఎన్నికల కమిషనర్‌గా జ్ఞానేశ్ కుమార్ స్థానంలో హర్యానా కేడర్ ఐఏఎస్ అధికారి అయిన డాక్టర్ వివేక్ జోషిని నియమించారు. కాగా ఎన్నికల కమిషనర్ల నియామకాలకు సంబంధించి 2023లో తీసుకొచ్చిన చట్టం ప్రకారం ఇవి తొలి ఎంపికలు కావడం విశేషం. ప్రస్తుత సీఈసీగా కొనసాగుతున్న రాజీవ్ కుమార్ పదవీకాలం (ఫిబ్రవరి 18) మంగళవారంతో ముగియనుంది. ఆయన తర్వాత సాధారణంగా ఎన్నికల కమిషనర్‌లలో సీనియర్‌ను సీఈసీగా నియమిస్తుంటారు. ఈసారి కూడా దానినే కొనసాగిస్తూ అత్యంత సీనియర్ అయిన జ్ఞానేశ్ కుమార్‌ను సీఈసీగా ఎంపిక చేశారు. జ్ఞానేశ కుమార్ కేరళ క్యాడర్‌కు చెందిన 1988 బ్యాచ్ ఐఏఎస్ అధికారి. ఈయన 2024 మార్చిలో ఎన్నికల కమిషనర్ (ఈసీ)గా నియమితుల య్యారు. కొత్త సీఈసీ జ్ఞానేశ్ కుమార్ పర్యవేక్షణలోనే బిహార్, కేరళ, పుదుచ్చేరి, తమిళనాడు, పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. జ్ఞానేశ్ కుమార్ కేంద్ర హెూంశాఖలో పని చేస్తున్న సమయంలో ఆర్టికల్ 370 రద్దుకు సంబంధించిన బిల్లు రూపకల్పనలో కీలక పాత్ర పోషించారు.

# సుప్రీంలో నేడు విచారణ

(మొదటి పేజీ తరువాయి)

చేశారు. సీఈసీ నియామక ప్యానెల్‌లో సుప్రీంకోర్టు ప్రాతినిథ్యం లేకుండా ఉండేందుకే కేంద్ర ప్రభుత్వం తొందరపడి ఈ నియామకం చేపట్టింది. ఇది రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధం. సీఈసీ నియామక ప్యానెల్ నుంచి సీజేఐని తొలగించడంపై బుధవారం (ఫిబ్రవరి)19 సుప్రీంకోర్టులో విచారణ జరగనుంది. ఈలోపే కొత్త సీఈసీని కేంద్ర ప్రభుత్వం నియమించింది. సుప్రీంకోర్టు పరిశీలన లేకుండా సీఈసీని నియమించాలనే తొందరపాటు కేంద్ర ప్రభుత్వ చర్యలో కనిపిస్తోంది. ఎన్నికల ప్రక్రియను బీజేపీ ఎంత నాశనం చేస్తోందో దీన్ని బట్టే అర్థం చేసుకోవచ్చు. ఇలాంటి చర్యల వల్ల నకిలీ ఓటర్ల జాబితా, బీజేపీ అనుకూల ఎన్నికల షెడ్యూల్,ఈవీఎంల ట్యాంపరింగ్‌పై అనుమానాలు బలపడతాయి' అని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ 'ఎక్స్' పోస్టులో పేర్కొన్నారు.

# మూస పద్ధతులకు స్వస్తి

**విశాలాంధ్ర బ్యూరో-అమరావతి:** విద్యారంగంలో అమలు చేస్తున్న మూస పద్ధతులకు స్వస్తి పలికి సృజనాత్మకత పెంపొందించేలా కేజీ టు పీజీ విద్యా పాఠ్యాంశాలలో సమూల మార్పులు తీసుకురానున్నట్లు విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ తెలిపారు. కళాశాల నుంచి బయటకు వచ్చే విద్యార్థికి వెనువెంటనే ఉద్యోగం లభించేలా నైపుణ్యాలను అభివృద్ధి చేస్తున్నట్లు చెప్పారు. జాతీయ విద్యా విధానం లక్ష్యసాధనలో భాగంగా విద్యా నైపుణ్యాల అభివృద్ధికిగాను సింఘానియా గ్రూప్ (రేమండ్స్), రాష్ట్ర ప్రభుత్వ ప్రతినిధుల నడుమ అవగాహన ఒప్పందం మంగళవారం కుదిరింది. తొలుత ట్రస్ట్ అధ్వర్యాన తిరుపతి జిల్లాలోని 14 పాఠశాలల్లో ఉపాధ్యాయుల పనితీరు, ఉపాధ్యాయ శిక్షణ, స్పోకెన్ ఇంగ్లీషు శిక్షణ, జాతీయ విద్యావిధానంతో సమాంతరంగా, సాంకేతికత అనుసంధానం వంటి అంశాల్లో విద్యా నైపుణ్యాన్ని తీసుకురావడం ద్వారా పాఠశాలల నిర్వహణలో మార్పులు తేవాలని నిర్ణయించారు. ఐదేళ్లలో అమలుచేసే ఈ కార్యక్రమం ద్వారా లక్ష మంది విద్యార్థులకు మెరుగైన విద్య అందుతుంది. అమరావతి, విశాఖపట్నం, కాకినాడకు ట్రస్ట్ సేవలను విస్తరిస్తారు. ఏపీ విద్యారంగాన్ని దేశంలోనే నెం.1గా తీర్చిదిద్దడమే లక్ష్యమని నారా లోకేశ్ అన్నారు. సింఘానియా గ్రూప్ చైర్మన్ గౌతమ్ హరి సింఘానియా మాట్లాడుతూ విద్యార్థులను ఉన్నత సాంకేతిక పరిజ్ఞానంతో నైపుణ్యవంతంగా తయారు చేయడమే ధ్యేయమన్నారు. మరింత ప్రభావవంతమైన, ఆకర్షణీయమైన అభ్యసన విధానాల్లో బోధనకు వీలుగా ఉపాధ్యాయుల సామర్థ్యాలను బలోపేతం చేసేందుకు విజయవాడ, వైజాగ్, అమరావతిలో శిక్షణ ఇవ్వనున్నట్లు చెప్పారు. పాఠ్యాంశాల్లో సాంకేతికతను సమగ్ర పర్చడం, ఆంగ్లంలో విద్యార్థుల సంభాషించే నైపుణ్యత పెంచడం ద్వారా విద్య నాణ్యత పెంచడమే లక్ష్యమని సింఘానియా వెల్లడించారు. సింఘానియా గ్రూప్ ఆఫ్ స్కూల్స్ డైరక్టర్ రేవతి శ్రీనివాసన్ మాట్లాడుతూ ఈ భాగస్వామ్యం అకడమిక్ ఎక్సలెన్స్, సమగ్రాభివృద్ధిని పెంపొందించడానికి దోహదమవు తుందన్నారు. కార్యక్రమంలో రేమండ్స్ ఇండిపెండెంట్ డైరక్టర్ కె.నరసింహమూర్తి, కార్పొరేట్ అఫైర్స్ హెడ్ జతిన్ ఖన్నా, కార్పొరేట్ కమ్యూనికేషన్స్ హెడ్ రోహిత్ ఖన్నా, చీఫ్ గార్మెంటింగ్ బిజినెస్ ఆఫీసర్ మనీశ్ భారతి, రేమండ్స్ ఇంజనీరింగ్ బిజినెస్ సీఈఓ గౌతమ్ మైనీ, సీఎఫ్ఓ నవీన్ శర్మ, చైర్మన్ సెక్రటరీ అతుల్ ఖేల్కర్ పాల్గొన్నారు.

## గాజాలో పలస్తీనా పాలన ఉండదు

### నెతన్యాహు

**జెరూసలేం:** గాజాలో పలస్తీనా యంత్రాంగం అధికారంలోకి వచ్చే అవకాశం ఉండదని ఇజ్రాయిల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు వక్కాణించారు. ఇందుకు తాము పూర్తి వ్యతిరేకమని చెప్పారు. గాజాలో యుద్ధం ముగిసిన మరునాడు ఆ భూభాగంలో హమాస్ కనిపించదన్నారు. పలస్తీనా అథారిటీ (పీఏ)కి ఆస్కారం తేల్చిచెప్పారు. 'నా హామీ ప్రకారం గాజాలో యుద్ధం ముగిసిన మరునాడు హమాస్ కానీ పలస్తీనా యంత్రాంగం కానీ ఉండదు' అని విలేకరులతో మాట్లాడిన సందర్భంగా నెతన్యాహు అన్నారు. గాజా కోసం అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన ప్రతిపాదనకు మద్దతు ప్రకటించారు. పలస్తీనా ప్రజలను పొరుగు దేశాలకు తరలించాలన్నది ట్రంప్ ప్రణాళిక కాగా ఇందుకు అరబ్ దేశాలు తిరస్కరించారు. అయితే భిన్నమైన గాజా సృష్టికిగాను ట్రంప్ ప్రణాళికకు కట్టుబడి ఉన్నానంటూ నెతన్యాహు చెప్పుకున్నారు. 1967 నాటి పశ్చిమాసియా యుద్ధమప్పుడు తాము స్వాధీనపర్చుకున్న గాజా స్ట్రిప్, వెస్ట్ బ్యాంక్, తూర్పు జెరూసలేంలో పలస్తీనా సార్వభౌమత్వాన్ని ఇజ్రాయిల్ ఎంత మాత్రం ఒప్పుకోవడంలేదు.

**యూఎన్‌ఆర్‌డబ్ల్యూఏను తక్షణమే నిషేధించాలి...**

పలస్తీనా శరణార్థుల కోసం పనిచేసే ఐక్యరాజ్య సమితి సంస్థ యూఎన్‌ఆర్‌డబ్ల్యూఏను నిషేధిస్తూ తీసుకొచ్చిన చట్టాన్ని తక్షణమే అమలు చేయాలని నెతన్యాహు ఆదేశించారు. పార్లమెంటు విస్తృత మద్దతుతో పార్లమెంటు ఆమోదించిన ఈ చట్టాన్ని అమల్లోకి తేవాలన్న ప్రధాని ఆదేశాల అమలునకు ఆటంకాలు లేవని నెతన్యాహు కార్యాలయం ఒక ప్రకటన చేసింది. యునైటెడ్ నేషన్స్ రిలీఫ్ అండ్ వర్క్స్ ఏజెన్సీ ఫర్ పలస్తీన్ రెఫ్యూజీస్ ఇన్ నియర్ ఈస్ట్ (యూఎన్‌ఆర్‌డబ్ల్యూఏ)పై నిషేధానికి బిల్లునకు అక్టోబరులో ఇజ్రాయిల్ చట్టసభ ఆమోదం తెలిపింది. 2023 అక్టోబరులో హమాస్ జరిపిన దాడికి యూఎన్‌ఆర్ డబ్ల్యూఏ ఉద్యోగులు మద్దతిచ్చారన్నది ఇజ్రాయిల్ ఆరోపణ కాగా దీనికి సముచిత రుజువులు లేవన్న వాదన ఉంది. కాగా, 48 గంటల్లో ఐరాస సహాయ సంస్థతో తెగతెంపులు చేసుకొని యూఎన్‌ఆర్ డబ్ల్యూఏ కార్యాలయాలను మూసివేసామంటూ జనవరి 29న ఇజ్రాయిల్ ప్రభుత్వ అధికార ప్రతినిధి డేవిట్ మెంట్సర్ ప్రకటించిన విషయం విదితమే.

## అర్ధరాత్రి నిర్ణయం అవమానకర చర్య

(మొదటి పేజీ తరువాయి)

అవుతుందన్నారు. ప్రధాని నేతృత్వంలోని ఎంపిక కమిటీ సమావేశం జరిగిన కొన్ని గంటల తర్వాత, సోమవారం రాత్రి ప్రభుత్వం జ్ఞానేష్ కుమార్‌ను కొత్త ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) గా నియమించిన సంగతి విదితమే. సామాజిక మాధ్యమం 'ఎక్స్' వేదికగా రాహుల్ తన అసంతృప్తిని వ్యక్తం చేశారు. 'సీఈసీ ఎంపిక కమిటీ సమావేశంలో మోదీ, అమిత్‌షాకు అభ్యంతరాల నివేదకను అందజేశాను. కార్యనిర్వాహక వర్గం జోక్యం లేని స్వతంత్ర ఎన్నికల సంఘం కమిషనర్, ప్రధాన ఎన్నికల కమిషనర్‌ను ఎంపిక చేసే ప్రక్రియ కీలకం. ఎంపిక కమిటీ నుంచి సీజేఐను తొలగించడం ద్వారా మోదీ ప్రభుత్వం సుప్రీంకోర్టు ఆదేశాలను ఉల్లంఘించింది. ఇది ఎన్నికల ప్రక్రియ సమగ్రతపై లక్షలాది మంది ఓటర్ల ఆందోళనకు కారణమవుతోంది' అని రాహుల్ అన్నారు. డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్, జాతి నిర్మాతల సిద్ధాంతాలకు కట్టుబడటం, ప్రభుత్వాన్ని జవాబుదారీ చేయాల్సిన బాధ్యత ఒక ప్రతిపక్ష నేతగా తనకు ఉందని రాహుల్ చెప్పారు. కమిటీ కూర్పు, ప్రక్రియను సుప్రీంకోర్టులో సవాలు చేస్తూ వేసిన పిటిషన్‌పై మరో 48 గంటల్లోనే విచారణ జరగాల్సి ఉండగా రాత్రికి రాత్రి ప్రధాని, హోంమంత్రి నిర్ణయం తీసుకోవడం సరికాదని అన్నారు. ప్రధాని మోదీ, హోంమంత్రి అమిత్‌షా, లోక్‌సభలో ప్రతిపక్షనేత రాహుల్ గాంధీ ఎంపిక కమిటీ సభ్యులుగా ఉండగా... సోమవారం కమిటీ సమావేశంలో పాల్గొన్న రాహుల్ గాంధీ... ఈ విషయంలో సుప్రీంకోర్టు విచారణను దృష్టిలో ఉంచుకుని సమావేశాన్ని వాయిదా వేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు అసమ్మతి నోట్‌ను కూడా సమర్పించారు. 'ఈ కమిటీ కూర్పు ప్రక్రియను సవాలు చేసిన పిటిషన్లపై త్వరలో సుప్రీంకోర్టు విచారించనున్న తరుణంలో ఈ కమిటీ తదుపరి సీఈసీని ఎంపిక చేసే ప్రక్రియను కొనసాగించడం సంస్థలకు, మన జాతీయ నాయకులకు అగౌరవంగా, అ మర్యాదగా ఉంటుంది' అని రాహుల్ అసమ్మతి నోట్‌లో రాశారు. మార్చి 2, 2023న సుప్రీం రాజ్యాంగ ధర్మాసనం ఇచ్చిన తీర్పులో... సీఈసీ, ఎన్నికల కమిషనర్ల నియామకాన్ని ప్రధానమంత్రి, లోక్‌సభలో ప్రతిపక్షనేత, భారత ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ)తో కూడిన కమిటీ చేపట్టాలని ఆదేశించిందని రాహుల్‌గాంధీ అసమ్మతి నోట్ రాశారు. ఎన్నికల ప్రక్రియ సమగ్రతకు సంబంధించి ఓటర్లలో ఆందోళనను ఈ తీర్పు ప్రతిబింబిస్తుందని ఆయన జోడించారు. కాగా, కాంగ్రెస్ పార్టీ సైతం సోమవారం ఇదే రకమైన డిమాండ్ చేసింది. సీఈసీ ఎంపిక ప్రక్రియపై అభ్యంతరాలు వ్యక్తం చేస్తూ సుప్రీంకోర్టులో దాఖలైన పిటిషన్‌పై ఈనెల 19న తుది తీర్పు రానుందనీ, అంతవరకూ సీఈసీ నియామక ప్రక్రియను వాయిదా వేయాలని ఆ పార్టీ కోరింది. అయితే... యథాప్రకారం భారత ఎన్నికల సంఘం నూతన సారథిగా జ్ఞానేష్ కుమార్, ఎలక్షన్ కమిషనర్‌గా వివేక్ జోషి పేర్లను త్రిసభ్య కమిటీ ఖరారు చేసింది.

## రైతు ప్రయోజనార్థమే 'భూ భారతి'

(మొదటి పేజీ తరువాయి)

సత్వరమే అందించాలన్న ఆశయంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆలోచనలకు అనుగుణంగా భూభారతి చట్టాన్ని తీసుకురావడం జరిగిందన్నారు. భూభారతి విధివిధానాలను రూపొందించడంపై ఎంసీఆర్‌హెచ్‌ఆర్‌డిలో కలెక్టర్లు, ఇతర ఉన్నతాధికారులతో రెండు రోజులపాటు నిర్వహిస్తున్న వర్క్‌షాప్‌లో మొదటి రోజు మంగళవారం పొంగులేటి మాట్లాడారు. నాటి పాలకులు గొప్పగా చెప్పుకున్న ధరణిలో అన్నీ లొసుగులు, లోపాలే ఉన్నాయని పేర్కొన్నారు. లక్షలాది మంది రైతులు రోడ్డున పడ్డారన్నారు. వీలైనంత త్వరగా భూభారతి చట్టాన్ని అమలులోకి తీసుకువస్తామన్నారు. రైతులకు ప్రయోజనం కలిగేలా విధివిధానాలను రూపొందిస్తున్నట్లు వెల్లడించారు. భూ హక్కులను రక్షించడం, భూ వ్యవహారాలలో పారదర్శకత, భూ లావాదేవీలను సులభతరం చేయడం, సామాన్యులకు సైతం రెవెన్యూ సేవలను అందుబాటులోకి తీసుకురావడం ఈ చట్టం ప్రధాన లక్ష్యం అన్నారు. తరతరాల భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపుతుందని పేర్కొన్నారు. రెవెన్యూ ముఖ్య కార్యదర్శి నవీన్ మిత్తల్, సీసీఎల్ఏ పీడీ సీఎంఆర్ఓ మకరంద్, భూ చట్ట నిపుణులు సునీల్, రంగారెడ్డి, మేడ్చల్-మల్కాజిగిరి, వికారాబాద్, నాగర్ కర్నూల్ జిల్లాల కలెక్టర్లు, ఆర్‌డిఓలు, తహసీల్దార్లు, రిటైర్డ్ రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

## లక్ష్యాల సాధనకు టెన్త్ ఫలితాలు దోహదం : కలెక్టర్

విశాలాంధ్ర - కొత్తగూడెం అర్బన్ : త్వరలో జరగబోయే పదవ తరగతి ఫలితాలు విద్యార్థులకు భవిష్యత్తులో ఉన్నత లక్ష్యాలు సాధించడానికి చాలా దోహదం చేస్తాయని జిల్లా కలెక్టర్ జితేష్ వి.పాటిల్ అన్నారు. మంగళవారం కొత్తగూడెంలోని అంబేద్కర్ భవన్‌లో షెడ్యూల్ కులాల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో విద్యార్థులకు ప్రేరణ, శిక్షణ తరగతులు నిర్వహించారు. కలెక్టర్ హాజరయ్యారై విద్యార్థులకు దిశా నిర్దేశం చేసి ఉత్సాహాన్ని నింపారు. తొలుత ఆయన అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి, జ్యోతి ప్రజ్వలన చేసి తరగతులను ప్రారంభించారు. పదవ తరగతి ఫలితాల్లో ఎన్ని మార్కులు వస్తాయన్నది కాకుండా భవిష్యత్తు లక్ష్యాల కోసం కష్టపడి చదవాలని కలెక్టర్ కోరారు. కేవలం పదవ తరగతి మాత్రమే ప్రామాణికంగా తీసుకోరాదన్నారు. పదవ తరగతి అనేది ఒక ప్రధాన మెట్టు మాత్రమే అన్నారు. తాను విద్యార్థి దశలో ఎన్నో ఆటుపోట్లు ఎదుర్కొన్నట్లు కలెక్టర్ ఆనాటి అంశాలను వివరించారు. టెన్త్‌లో ఉన్నప్పుడు ఒక మంచి ఇంజనీర్ అవుదామని అనుకున్నాను... తర్వాత నా లక్ష్యాలను మార్చుకొని పట్టుదలతో చదివి ఐఏఎస్ సాధించానని చెప్పారు. విద్యాశాఖ రిసోర్స్ పర్సన్‌లు సైదులు, నాగరాజు శేఖర్, నాగరాజు, విజయ భాస్కర్, శ్యాం చందర్‌రావులు విద్యార్థులకు వివిధ సబ్జెక్టుల్లో మెలకువలు నేర్పారు. ఈ కార్యక్రమంలో ఎస్‌సి శాఖ అధికారిని అనసూర్య, ఏఎస్‌డబ్ల్యూఓలు హనుమంతరావు, సునీత, హెచ్‌డబ్ల్యుఓలు పాల్గొన్నారు.

## ఆన్‌లైన్ సేవా కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలి

విశాలాంధ్ర - గార్ల : వినియోగదారుల సేవా కేంద్రాన్ని రైతులు, చిరు వ్యాపారులు, స్థానిక ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎస్‌బిఐ బ్యాంక్ మేనేజర్ దిలీప్ కుమార్ కోరారు. మండల కేంద్రంలోని స్థానిక నెహ్రూ విగ్రహ కూడలి సమీపంలో డ్రీమ్ ఆన్‌లైన్ సెంటర్‌ను ఆయన మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మేనేజర్ మాట్లాడుతూ సేవా కేంద్రం గ్రామీణ ప్రాంత ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని వివరించారు. స్థానిక ప్రజలు ఇక్కడి సేవా కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించడానికి అన్ని రకాల సౌకర్యాలతో ఈ నూతనంగా సేవా కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో నిర్వహకులు బోగ్గారపు నాగేశ్వరరావు, బ్యాంక్ సిబ్బంది, వినియోగదారులు పాల్గొన్నారు.

## రాష్ట్రానికి వన్నె తెచ్చిన పోలీస్ అంజయ్య : ఎస్పీ

విశాలాంధ్ర - జిల్లా బ్యూరో మహబూబాబాద్ : అల్ ఇండియాలో సిల్వర్ మెడల్ పొందిన అంజయ్య తెలంగాణ రాష్ట్రానికి వన్నె తెచ్చాడని జిల్లా ఎస్పీ సుధీర్ రామ్నాథ్ కేకన్ అన్నారు. మంగళవారం అంజయ్యను ఎస్పీ అభినందించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ రెండు నెలల పాటు ఇంటిగ్రేటర్ ఇంటెలిజెన్స్ ట్రైనింగ్ అకాడమీలో ఎస్పీ రామకృష్ణ ఇంటలిజెన్స్ సెక్యుటీ వింగ్ ఆధ్వర్యంలో ట్రైనింగ్ తీసుకుని, ఈనెల ఫిబ్రవరి 10 నుండి 15న ఝార్ఖండ్ రాష్ట్రం రాంచీలో జరిగిన 68వ ఆల్ ఇండియా పోలీస్ డ్యూటీ మీట్‌లో ఆంటీ సబటేజ్ చెక్ రూమ్ సర్చ్ విభాగం వివి ఐపి, విఐపి నివాసం ఉండే రూంను ఎలాంటి హానికర వస్తువులు లేకుండా చుకునే విధానంలో తెలంగాణా తరుపున పాల్గొన్న అంజయ్యకు సిల్వర్ మెడల్ ఝార్ఖండ్ ఐజి ఎస్‌కే సిన్హా చేతుల మీదుగా అందుకున్నారన్నారు. ఇందుకు మహబూబాబాద్ జిల్లా తరుపున జిల్లా సూపర్‌ఇండెంట్ ఆఫ్ పోలీస్ సుధీర్ రాంనాద్ కేకన్, రిజర్వు డి.ఎస్.పి శ్రీనివాస్ మరియు విజయ్ ప్రతాప్, అడ్మిన్ రిజర్వు ఇన్‌స్పెక్టర్ అనిల్ కుమార్ బాంబు స్క్వాడ్ సిబ్బంది అంజయ్యకు అభినదలు తెలియజేశారు.

## కారేపల్లిలో కలెక్టర్ విస్తృత పర్యటన

విశాలాంధ్ర - కారేపల్లి : కారేపల్లి మండలంలో మంగళవారం జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ విస్తృతంగా పర్యటించారు. మండల పరిధిలోని చీమలపాడు, రేలకాయలపల్లి రెవెన్యూలో రైతులు సాగు చేస్తున్న పామ్ ఆయిల్, డ్రాగన్ ఫ్రూట్స్ తదితర పంటలను కలెక్టర్ పరిశీలించారు. అనంతరం రైతులతో సమావేశమై పంటల సాగు విధానంలో కష్టనష్టాల గురించి అడిగి తెలుసుకున్నారు. కోతుల వల్ల పండించిన పంట చేతికందక నష్టపోతున్నామని రైతులు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. కోతుల నివారణకు తగు చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను కోరారు. దీంతో స్పందించిన కలెక్టర్ సోలార్ పవర్ ద్వారా పంట చేను చుట్టూ విద్యుత్ ఖర్చులు సబ్సిడీ ద్వారా ఇప్పించేందుకు కృషి చేస్తానన్నారు. అందుకు సంబంధించిన ప్రతిపాదనను రూపొందించాలని సంబంధిత శాఖ సిబ్బంది ఆదేశించారు.

## వేసవిలో త్రాగునీటి సమస్య లేకుండా చర్యలు తీసుకోవాలి

విశాలాంధ్ర - కొమురంభీం : రానున్న వేసవి కాలంలో ప్రజలకు ఎలాంటి త్రాగునీటి సమస్య లేకుండా కార్యచరణ రూపొందించి తగు చర్యలు తీసుకోవాలని జిల్లా అదనపు కలెక్టర్ దీపక్ తివారి అన్నారు. మంగళవారం జిల్లాలోని జైనూర్ మండలం దుబ్బగూడ గ్రామపంచాయతీలో పర్యటించి మిషన్ భగీరథ నీటి నాణ్యత, త్రాగునీటి కొరకు తీసుకోవలసిన చర్యలపై పరిశీలించారు. జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ వేసవిలో ప్రజలకు త్రాగునీటి ఎద్దడి లేకుండా కార్యచరణ రూపొందించి ప్రణాళికాబద్ధంగా అమలు చేయాలని మిషన్ భగీరథ పథకంలో భాగంగా ప్రతి ఇంటికి నల్లా కనెక్షన్ ద్వారా త్రాగునీటిని అందించాలని, అనంతరం గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను సందర్శించి విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజన నాణ్యత, త్రాగునీరు, ఇతర మౌలిక సదుపాయాలను పరిశీలించారు. విద్యార్థులకు సకాలంలో పోషక విలువలు కలిగిన ఆహారాన్ని అందించడంతో పాటు వారి ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి బిక్షపతి గౌడ్, మండల పరిషత్ అభివృద్ధి అధికారి, మండల పంచాయతీ అధికారి, మిషన్ భగీరథ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శి, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## గంగారంలో యువకుడి ఆత్మహత్య

విశాలాంధ్ర - సత్తుపల్లి : సత్తుపల్లి మండలం గంగారం గ్రామంలో కంచి రాధాకృష్ణ అనే యువకుడు ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. పనిచేస్తున్నాడు. మృతునికి భార్య, ఒక కుమారుడు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి ఉంది.

# వేసవిలో నీటి ఎద్దడి, విద్యుత్ అంతరాయం లేకుండా చూడాలి

### జిల్లాల అధికారులకు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దిశానిర్దేశం

విశాలాంధ్ర బ్యూరో - కొత్తగూడెం : ఈ వేసవి కాలంలో ప్రజలు తాగునీటి ఎద్దడి ఎదుర్కోకుండా తీసుకోవాల్సిన చర్యలకు జిల్లా అధికారులకు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శాంతి కుమార్ దిశా నిర్దేశం చేశారు. మంగళవారం ఆమె వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు, ముఖ్య అధికారులతో విస్తృతంగా మాట్లాడారు. కొత్తగూడెం జిల్లా నుంచి కలెక్టర్ జితేష్ వి పాటిల్, అదనపు కలెక్టర్లు వేణుగోపాల్, విద్య చందన, జడ్పీ సీఈవో నాగలక్ష్మి, వివిధ శాఖల అధికారులు కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. సాగునీరు, త్రాగునీరు, నిర్మాణ రంగానికి విద్యుత్ అంతరాయం లేకుండా సరఫరా జరగాలని శాంతికుమారి ఆదేశించారు. రైతు భరోసా, రబీసీజన్‌కు సాగునీటి సరఫరాతో పాటు యూరియా కొరత లేకుండా చూడాలని, రేషన్ కార్డుల జారీ, రెసిడెన్షియల్ పాఠశాలల సందర్శన అంశాలపై ఆమె సమీక్ష చేసారు. వ్యవసాయ సాగులో రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం తీసుకుంటున్న చర్యల గురించి వివరించారు. అర్హత గల ప్రతి రైతుకు రైతు భరోసా అందించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. అర్హులైన వారందరికీ రేషన్ కార్డులు త్వరగా జారీ చేయ్యాలన్నారు. గురుకుల పాఠశాలల్లో సమస్యలు తొలగించేందుకు విధిగా సందర్శించాలన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ జితేష్ వి పాటిల్ మాట్లాడుతూ జిల్లాలో అన్ని రంగాలకు విద్యుత్ అంతరాయం లేకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. రైతు భరోసా పథకం క్రింద అర్హులందరికి అందించే విధంగా చర్యలు చేపడుతున్నామని చెప్పారు. శాసనమండలి సభ్యుల ఎన్నికల అనంతరం అర్హులైన వారందరికీ రేషన్ కార్డులు స్పందించబోతున్నామన్నారు. వేసవిలో త్రాగునీటి ఎద్దడి నివారణకు తీసుకుంటున్న చర్యలు కలెక్టర్ వివరించారు. జిల్లా వ్యవసాయ శాఖ అధికారి బాబురావు, మిషన్ భగీరథ ఈఈ లు తిరుమలేష్, నలిని, విద్యుత్ శాఖ అధికారి జి. మహేందర్, నీటి పారుదలశాఖ ఈఈ రాంప్రసాద్, పౌర సరఫర అధికారి త్రినాథ్ బాబు, రుక్మిణి, మున్సిపల్ కమిషనర్ శేషాంజన స్వామి పాల్గొన్నారు.

## మిర్చిబోర్డు ఏర్పాటు చేయాలి : బాగం

విశాలాంధ్ర - ఖమ్మం : పడిపోతున్న మిర్చి ధరలను దృష్టిలో ఉంచుకొని తక్షణం మిర్చిబోర్డును ఏర్పాటు చేయాలని తెలంగాణా రాష్ట్ర రైతు సంఘం అధ్యక్షులు బాగం హేమంతరావు డిమాండ్ చేశారు. గత ఏడాదితో పోల్చినప్పుడు ఈ ఏడాది సగానికి పడిపోయాని, పెట్టుబడులు గత ఏడాదికంటే రెంటింపయ్యాయని ఆయన తెలిపారు. తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం, భారత కమ్యూనిస్టుపార్టీ ఆధ్వర్యంలో మంగళవారం ఖమ్మం వ్యవసాయ మార్కెట్లో ఆందోళన నిర్వహించారు. మిర్చికొనుగోళ్లను అడ్డుకొని నిరసన వ్యక్తం చేశారు. మిర్చిమార్కెట్ను ముట్టడించే ప్రయత్నాన్ని పోలీసులు అడ్డుకున్నారు. రైతులకు పోలీసులకుమధ్య స్వల్పతోపులాట జరిగింది. పెద్ద సంఖ్యలో రైతులు హాజరుకావడంతో విధిలేక పోలీసులు మార్కెట్లోకి అనుమతించారు. రైతు సంఘం, సి.పి.ఐ నాయకులు రైతులతో మాట్లాడారు. వ్యవసాయ మార్కెట్ చైర్మెన్ యరగర్ల హన్మంతరావు ఆందోళనకారుల దగ్గరకు వచ్చి అధికారులు, వ్యాపారులతో సమావేశం ఏర్పాటు చేస్తామని ధర పెంపుకు సంబంధించి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. రైతులనుద్దేశించి బాగం హేమంతరావు మాట్లాడుతూ మిర్చిబోర్డు ఏర్పాటుతోనే మిర్చి ధరలకు పరిష్కారం లభిస్తుందన్నారు. రోజురోజుకు మిర్చిధర పడిపోతుందని నాబార్డును రంగంలోకి దించి మిర్చిని క్వింటా ఒక్కింటికి రూ.25 చొప్పున కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. వ్యవసాయ ఉత్పత్తి ధరలను స్థిరీకరించి సాగుకు గిట్టుబాటు అయ్యేవిధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. సి.పి.ఐ జిల్లా సహాయకార్యదర్శి దండి సురేష్, రాష్ట్ర కంట్రోల్ కమీషన్ చైర్మెన్ మహ్మద్ మౌలాన, తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు దొండపాటి రమేష్, కొండపర్తి గోవిందరావు, సి.పి.ఐ రాష్ట్ర సమితి సభ్యులు యర్రాబాబు, జిల్లా కార్యవర్గసభ్యులు శింగునర్సింహారావు, పోటు కళావతి, మిడికంటి చిన్న వెంకటరెడ్డి, రావి శివరామకృష్ణ, జాగర్లమూడి రంజిత్, ఏపూరి రవీంద్రబాబు, మందడపు రాణీ రైతు సంఘాల నాయకులు పుచ్చకాయల సుధాకర్, బానోత్ రామ్మోటి, నూనెశశిధర్, బాగం ప్రసాద్, కూచిపుడి రవి, తుల్లూరి ప్రసాద్, ఇటికాల రామకృష్ణ, యడ్లపల్లి శంకరయ్య, పొద్దుటూరి వెంకటరెడ్డి పాల్గొన్నారు.

## ఏసీబీకి చిక్కిన ఫారెస్ట్ రేంజర్, బీట్ ఆఫీసర్

ఇల్లందు - విశాలాంధ్ర : లంచం తీసుకుంటూ అటవీ శాఖ అధికారులు ఏసీబీ అధికారులకు చిక్కారు. మండల పరిధిలోని కొమరారం అటవీశాఖ రేంజ్ అధికారి ఉదయ్ కిరణ్ ,బీట్ ఆఫీసర్ హిరాలాల్ రూ. 30 వేలు లంచం తీసుకుంటూ మంగళవారం ఏసీబీ అధికారులకు ప్రత్యక్షంగా పట్టుబడ్డారు. రోడ్డు పనుల కోసం అటవీ భూమి నుంచి మట్టిని తోలుకునేందుకు వారు గుత్తేదారు నుంచి రు.30 వేలు డిమాండ్ చేశారు. ఇంతకుముందే ఈ పనులకోసం రూ.20వేలు లంచంగా ఇచ్చినట్లు సమాచారం. మరల గ్రావెల్ తీస్తుండగా అటు విశాఖ సిబ్బందిని పంపించి జెసిబిని, ట్రాక్టర్‌ను పట్టుకున్నారు. వీటిని విడిచి పెట్టేందుకు రూ.15 వేలు లంచం తీసుకున్నట్లు తెలుస్తుంది. అయినప్పటికీ మరల గ్రావెల్ తోలుకునేందుకు రూ.50 వేలు డిమాండ్ చేసినట్లు గుత్తేదారుల ద్వారా తెలుస్తుంది. అంత మొత్తం ఇవ్వలేనని చెప్పి రూ.30 వేలు ఇచ్చేందుకు ఒప్పందం కుదుర్చుకున్నారు. అటవీ అధికారుల వేధింపులు భరించలేక గుత్తేదారు ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. ఏసీబీ డి.ఎస్.పి రమేష్ ఆధ్వర్యంలో దాడులు నిర్వహించి రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు.

## విద్యుత్ ఏఈపై కలెక్టర్‌కి ఫిర్యాదు

విశాలాంధ్ర - కారేపల్లి : కారేపల్లి మండల పరిధిలోని చీమలపాడు పరిసర ప్రాంతాల్లో మంగళవారం జిల్లా కలెక్టర్ ముజిమిల్ ఖాన్ విస్తృతంగా పర్యటించారు. స్థానిక విద్యుత్ శాఖ ఏఈపై ఆ ప్రాంత రైతులు కలెక్టర్కు ఫిర్యాదు చేశారు. బోరు బావుల మీద ఆధారపడి పంటలు సాగు చేసుకుంటున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం కారణంగా కరెంటు సరఫరా సక్రమంగా లేకపోవడం వల్ల నష్టపోతున్నామని కలెక్టర్ ముందు వాపోయారు. ఈ ప్రాంతంలో ఎక్కువగా విద్యుత్ హై, లోవోల్టేజ్ సమస్యలు వస్తాయన్నారు. ఏఈ స్థానికంగా అందుబాటులో ఉండకపోవడం వల్ల కాలిపోయిన ట్రాన్స్ఫార్మర్ల మరమ్మత్తులకు ఆలస్యం అవుతుందన్నారు. స్థానిక ఏఈ నీ ఫోన్లలో సంప్రదించాలని ప్రయత్నించిన స్పందించడం లేదని ఆరోపించారు. సంబంధిత అధికారులు, సిబ్బంది నిత్యం అందుబాటులో ఉండి నాణ్యమైన విద్యుత్ సరఫరా చేసేలా కృషి చేయాలని కలెక్టర్‌ను వేడుకున్నారు. దీంతో స్పందించిన కలెక్టర్ వ్యవసాయానికి విద్యుత్ సరఫరా చేయడంలో రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని పక్కనే ఉన్న విద్యుత్ శాఖ ఉన్నత అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ ఉద్యోగులు తాము పనిచేసే చోట విధుల నిర్వహణ పట్ల స్థానిక ప్రజల మన్ననలు పొందాలని అధికార యంత్రంగానికి కలెక్టర్ సూచించారు.

## వెంకటేష్ కుటుంబానికి అండగా ఉంటా: ఎమ్మెల్యే

విశాలాంధ్ర- పినపాక : ఇటీవల అగ్ని ప్రమాదంలో గుడిసె పూర్తిగా దగ్ధమై నిలువ లేని నిలువ నీడ లేకుండా పోయిన పూస వెంకటేష్ కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ అన్ని విధాలుగా అండగా ఉంటుందని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు అన్నారు. పినపాక మండలం సీతంపేట గ్రామంలో ఈ నెల 14న విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు కాలిపోయిన వెంకటేష్ కుటుంబాన్ని ఆయన పరామర్శించారు. ఆర్థిక సహాయం కూడా చేశారు. అగ్ని ప్రమాదానికి గల కారణాలను ఎమ్మెల్యే అడిగి తెలుసుకున్నారు. బాధిత కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. కాంగ్రెస్ నాయకులు ఉడుముల లక్ష్మారెడ్డి, కొరసా ఆనంద్, బండారుసాంబయ్య, గంగిరెడ్డి వెంకటరెడ్డి, శ్రీనివాసరెడ్డి, వార శంకర్ పాల్గొన్నారు. వెంకటేష్ కుటుంబ పరిస్థితులు తెలుసుకొని ఆదివాసి గిరిజన అభ్యుదయ సంఘం నాయకులు గొగ్గల ఆర్కే దొర, కొమరం శ్రీను, సారయ్యలు వితరణ అందించారు. 25 కిలోల బియ్యంతో పాటు ఆ కుటుంబానికి దుప్పట్లు పంపిణీ చేశారు.

## సూరమ్మకు నివాళులర్పించిన రమేష్ నాయక్

విశాలాంధ్ర-గూడూరు: గూడూరు మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీకి చెందిన మైదం సూరమ్మ అనారోగ్యంతో మృతి చెందింది. ఈ విషయం తెలుసుకున్న మైదం సూరమ్మ (48) భౌతికకాయానికి ఆయన నివాళులర్పించారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద కుటుంబానికి చెందిన మైదం సూరమ్మ కుటుంబాన్ని పోషించడానికి హైదరాబాద్‌కు వలసవెళ్లి అక్కడనే పనిచేసుకుంటూ కాలం గడిపారన్నారు. ఆరోగ్యం సహకరించకపోవడం వలన సోమవారం అనారోగ్యంతో మృతి చెందిందని, ఎమ్మార్పీఎస్ మండల కన్వీనర్ మందుల ప్రవీణ్ మృతురాలి దహన సంస్కారాలు నిర్వహించారన్నారు. మాజీ వార్డ్ మెంబెర్ హెచ్చు శివ, కాంగ్రెస్ మండల నాయకులు మండల మల్లేష్, బోడ సూరయ్య పాల్గొన్నారు.

## సహజ ఆవాసాల పరిరక్షణ నిధులకు హాబిటాట్స్ ట్రస్ట్ దరఖాస్తుల ఆహ్వానం

నోయిడా: భారతదేశ సహజ ఆవాసాలు, స్వదేశీ జాతులను రక్షించేందుకు కట్టుబడిన లాభాపేక్షలేని సంస్థ హాబిటాట్స్ ట్రస్ట్, ది హాబిటాట్స్ ట్రస్ట్ గ్రాంట్స్ తన 8వ ఎడిషన్‌ను ప్రారంభించామని ప్రకటించింది. ఈ ఎడిషన్ ముఖ్యాంశం ది హాబిటాట్స్ ట్రస్ట్ రీసెర్చ్ గ్రాంట్‌ను పరిచయం చేస్తుండగా, ఇది పర్యావరణ పరిరక్షణ, సామాజిక, సాంకేతిక అంశాలపై ఇంటర్ డిసిప్లినరీ పరిశోధనలను ప్రోత్సహించే లక్ష్యాన్ని కలిగి ఉంది. దరఖాస్తులు ఫిబ్రవరి 15 నుంచి మార్చి 17 వరకు పంపించుకునేందుకు అవకాశం ఉంటుంది. ఫైనల్స్‌కు చేరుకున్న వారి వివరాలను అక్టోబర్ 2025లో ప్రకటిస్తారు. ఆసక్తి ఉన్న వ్యక్తులు, సంస్థలు ది హ్యాబిటాట్స్ ట్రస్ట్.ఆర్గ్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు. దేశవ్యాప్తంగా పరిరక్షణ ప్రాజెక్టులకు మద్దతు ఇచ్చేందుకు, ఈ ఏడాది చరిత్రలో అతిపెద్ద ఫండింగ్ సైకిల్ రూ.3.5కోట్లకు పైగా నిధులు కేటాయించారు.

## స్వచ్ఛందంగా కార్మికుల సభ్యత్వం : ఏఐటీయుసీ

విశాలాంధ్ర ప్రతినిధి- పెద్దపల్లి,సింగరేణి : సింగరేణిలో కార్మికులు స్వచ్ఛందంగానే ఏఐటీయుసి సభ్యత్వం చేశారని ఎవరిని బెదిరించి చేయించలేదని సింగ రేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్, ఏఐటీయుసి నాయకులు మడ్డి ఎల్లయ్య, కె.స్వామి, ఆరెల్లి పోషంలు అన్నారు. మంగళవారం గోదావరిఖని భాస్కరరావు భవనంలో జరిగిన విలేఖరుల సమావేశంలో వారు మాట్లాడుతూ హెచ్.ఎం.ఎస్ నాయకుడు రియాజ్ అహ్మద్ విమర్శలు ఖండించారు. తమ కార్యకర్తలెవరూ గూండాగిరి చేయడం లేదని, ఇలాంటి చౌకబారు విమర్శలు మానుకోవాలని హెచ్చరించారు.

## జేఎస్‌డబ్ల్యు ఎంజీ మోటార్ ఇండియా ఎండీగా అనురాగ్ మెహ్రోత్రా

ముంబయి: జేఎస్‌డబ్ల్యు ఎంజీ మోటార్ ఇండియా టుడే, అనురాగ్ మెహ్రోత్రాను కంపెనీ మేనేజింగ్ డైరెక్టర్‌గా నియోగిస్తున్నట్లుగా ప్రకటించింది. మూడు దశాబ్దాల ప్రొఫెషనల్ అనుభవం కలిగిన ఆయన, ఆటోమేటివ్ రంగం విక్రయాలు, మార్కెటింగ్, వ్యూహరచన, వ్యాపారాభివృద్ధిలో కీలకమైన లీడర్‌షిప్ పాత్రలను నిర్వహించారు. ఆయనకు ఉన్న విస్తృతమైన అనుభవంలో, ప్రముఖ జాతీయ, అంతర్జాతీయ కంపెనీల్లో లీడర్షిప్ హెూదాలు కూడా ఉన్నాయి. ఆయన గతంలో టాటా మోటర్స్ కమర్షియల్ వెహికల్స్‌లో స్ట్రేటజీ అండ్ ఇంటర్నేషనల్ బిజినెస్ విభాగపు వైస్ ప్రెసిడెంటుగా, ఫోర్డ్ ఇండియాలో ప్రెసిడెంట్, మేనేజింగ్ డైరెక్టర్‌గా పదవులు నిర్వహించి ఉన్నారు.

## ఘనంగా కేసీఆర్ జన్మదిన వేడుకలు

విశాలాంధ్ర - పెనుబల్లి : మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర రావు జన్మదిన వేడుకలు పెనుబల్లి మండ లంలో ఆ పార్టీ నాయకులు ఘనంగా నిర్వహించారు. బిఆర్ఎస్ మండల నాయకులు పరసా రామకృష్ణ ఆధ్వర్యంలో కెసిఆర్ జన్మదిన వేడుకలు నిర్వహించారు. రామచంద్రరావు బంజర్ గ్రామంలో కెసిఆర్ జన్మదిన సందర్భంగా కేక్ కట్‌చేసి, జై కెసిఆర్ అంటూ నినాదాలు చేశారు. బాణాసంచా కాల్చి మిఠాయిలు పంచుకున్నారు. పరసా రామకృష్ణ మాట్లాడుతూ కెసిఆర్ తెలంగాణ ముద్దు బిడ్డ అని, మళ్ళీ కెసిఆర్ అధికారంలోకి రావడానికి ప్రతి కార్యకర్త సైనికుడులా పని చెయ్యాలన్నారు. పేదలకు అన్ని విధాలుగా సంక్షేమ పథకాలు పూర్తి స్థాయిలో అందించేందుకు కేసీఆర్ మళ్ళీ అధికారంలోకి రావాలని ఆకాంక్షించారు.

## మహా కుంభమేళాలో ఎయిర్‌టెల్ పేమెంట్స్ బ్యాంక్ డిజిటల్ బ్యాంకింగ్ సేవలు

ముంబయి: కార్పొరేట్ సామాజిక బాధ్యత (సీఎస్ఆర్)లో భాగంగా ఎయిర్‌టెల్ పేమెంట్స్ బ్యాంక్ మహా కుంభమేళాలో భక్తులు, వ్యాపారులకు సురక్షితమైన డిజిటల్ బ్యాంకింగ్ సేవలు అందిస్తోంది.లక్షలాది మంది భక్తులకు బ్యాంక్ ఆర్థిక సేవలను సులభంగా పొందేలా చేస్తూ, సురక్షితమైన లావాదేవీలను నిర్ధారిస్తోంది. ఇక్కడ కార్యక్రమాలన్నీ సజావుగా నిర్వహించేందుకు సహకారాన్ని అందిస్తోంది. ఎయిర్‌టెల్ పేమెంట్స్ బ్యాంక్ విశాలమైన మేళా మైదానంలో పది వ్యూహాత్మక ప్రదేశాల్లో ఉన్న కియోస్క్‌లను ఏర్పాటు చేసింది. ఈ కియోస్క్‌లు అవసరమైన బ్యాంకింగ్ సేవలను అందిస్తుండగా, భక్తులు తమ ఖాతాల నుంచి నగదు డ్రా చేసుకునేందుకు లేదా ఏదైనా బ్యాంకు ఖాతాకు నిధులను బదిలీ చేసేందుకు అవకాశం కల్పిస్తాయి. ఆధార్-లింక్ అయిన బ్యాంక్ ఖాతా ఉన్న ఏ బ్యాంకు వినియోగదారుడు అయినా ఈ సేవల ప్రయోజనాన్ని పొందవచ్చు.

## సోల్ లీడర్‌షిప్ కాన్‌క్లేవ్‌కు గౌరవ అతిథిగా భూటాన్ ప్రధాని

న్యూఢిల్లీ: ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ త్వరలో ప్రారంభించనున్న సోల్ లీడర్‌షిప్ కాన్‌క్లేవ్ మొదటి ఎడిషన్ ప్రారంభ సమావేశానికి గౌరవ అతిథిగా భూటాన్ ప్రధాన మంత్రి దాషో షెరింగ్ టోబ్గే హాజరుకానున్నారు. ఫిబ్రవరి 21వ తేదీ శుక్రవారం న్యూఢిల్లీలోని భారత్ మండపంలో ఈ సమావేశం జరుగనుంది. దాషో షెరింగ్ టోబ్గే ఐక్యరాజ్యసమితి, టెడ్, వివిధ అంతర్జాతీయ సమావేశాలలో నాయకత్వం, పరిరక్షణ, వాతావరణ మార్పు, పేదరికం, ప్రజాస్వామ్యం, ఆనందంపై ప్రసంగించారు. సోల్ లీడర్‌షిప్ కాన్‌క్లేవ్ కోసం తన కీలకోపన్యాసంలో ఆయన తన జీవిత ప్రయాణం నుండి నాయకత్వ పాఠాలను పంచుకుంటారు. ముఖ్యంగా, భూటాన్ పార్లమెంటరీ ప్రజాస్వామ్యానికి పరివర్తన చెందడంలో ఆయన కీలక భూమిక పోషించారు. భూటాన్‌లో నమోదైన మొట్టమొదటి రాజకీయ పార్టీ అయిన పీపుల్స్ డెమొక్రటిక్ పార్టీని స్థాపించడంలో కీలక పాత్ర పోషించారు, దీనికి ఆయన అధ్యక్షుడిగా కొనసాగుతున్నారు.

## పునరుత్పాదక ఇంధన తయారీలో రిన్‌ఫ్రా వ్యూహాత్మక విస్తరణ

ముంబై: మౌలిక సదుపాయాల రంగంలో ప్రముఖ ఆటగాడు అయిన రిలయన్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్ (రిన్‌ఫ్రా), పునరుత్పాదక ఇంధన తయారీ పరిశ్రమలోకి వ్యూహాత్మక ప్రవేశాన్ని ప్లాన్ చేస్తోంది. స్థిరమైన ఇంధన పరిష్కారాలకు దాని నిబద్ధతలో, స్వచ్ఛమైన ఇంధన వనరుల వైపు పరివర్తన చెందడానికి ప్రపంచ ప్రయత్నాలకు అనుగుణంగా, కంపెనీ ఇంటిగ్రేటెడ్ సోలార్, బ్యాటరీ తయారీ యూనిట్లను స్థాపించనుంది. ఇంటిగ్రేటెడ్ సోలార్ మాన్యుఫ్యాక్చరింగ్ చొరవలో భాగంగా, రిన్‌ఫ్రా సౌర ఫలకాలు, భాగాల ఉత్పత్తిని పెంచడానికి, క్లీన్ ఎనర్జీలో స్వయం సమృద్ధిని ప్రోత్సహించడానికి ఒక అత్యాధునిక సౌకర్యాన్ని ఏర్పాటు చేయనుంది. అదే సమయంలో, దాని ఇంటిగ్రేటెడ్ బ్యాటరీ తయారీ యూనిట్ గ్రిడ్ అప్లికేషన్లు, ఎలక్ట్రిక్ మొబిలిటీ కోసం అధునాతన శక్తి నిల్వ పరిష్కారాలను అభివృద్ధి చేయడంపై దృష్టి పెడుతుంది.రిలయన్స్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ సౌర పరికరాలు, బ్యాటరీ తయారీ వ్యాపారంలోకి ప్రవేశించడంతో, రిలయన్స్ గ్రూప్ ఇప్పుడు పునరుత్పాదక ఇంధన విలువ గొలుసు మొత్తం స్పెక్ట్రమ్‌ను కవర్ చేస్తుంది.

## హైదరాబాద్ నమోదైన ఇళ్ల విలువలో 24% పెరుగుదల: నైట్ ఫ్రాంక్ ఇండియా

హైదరాబాద్: రియల్ ఎస్టేట్ రంగంపై నైట్ ఫ్రాంక్ ఇండియా తన తాజా నివేదికను విడుదల చేసింది. హైదరాబాద్ ప్రీమియమైజేషన్ ధోరణి కొనసాగుతోందని, పెద్ద నివాస స్థలాలు, మెరుగైన సౌకర్యాలను కలిగి ఉన్న అధిక-విలువ గృహ అమ్మకాలలో గణనీయమైన పెరుగుదల ఉందని పేర్కొంది. మొత్తం రిజిస్ట్రేషన్లు స్థిరంగా ఉన్నప్పటికీ, నమోదైన ఇళ్ల మొత్తం విలువ వైవైవై 5% పెరిగింది. హైదరాబాద్ నివాస మార్కెట్ నాలుగు జిల్లాలను - హైదరాబాద్, మేడ్చల్-మల్కాజ్‌గిరి, రంగారెడ్డి, సంగారెడ్డి - విస్తరించి ఉంది. ప్రాథమిక, ద్వితీయ రియల్ ఎస్టేట్ మార్కెట్ల నుండి లావాదేవీలను కలిగి ఉంది. అధిక విలువ కలిగిన అపార్ట్‌మెంట్ల రిజిస్ట్రేషన్లలో పెరుగుదల కన్పించింది. రూ.50 లక్షల లోపు ధర ఉన్న ఆస్తులు రిజిస్ట్రేషన్లలో ఆధిపత్యం చెలాయించాయి. కానీ జనవరి 2025లో రూ.1 కోటి, అంతకంటే ఎక్కువ ధర ఉన్న ఇళ్ల ధర సంవత్సరానికి 12% పెరగడంతో ప్రీమియమైజేషన్ వైపు బలమైన మార్పు ఉద్భవించింది. ఇది అధిక విలువ కలిగిన ఆస్తులకు పెరుగుతున్న ప్రాధాన్యతను ప్రతిబింబిస్తుంది.

## స్మార్ట్ డివైస్ లీజింగ్ సొల్యూషన్స్‌పై గూగుల్‌తో జాగిల్ భాగస్వామ్యం

హైదరాబాద్: ప్రముఖ బీ2బీ సాస్ ఫిన్‌టెక్ కంపెనీ అయిన జాగిల్ ప్రీపెయిడ్ ఓషన్ సర్వీసెస్ లిమిటెడ్, భారతదేశంలో టెక్ దిగ్గజం ప్రత్యేక పంపిణీ భాగస్వామి అయిన రెడింగ్టన్ (ఇండియా) లిమిటెడ్ ద్వారా స్మార్ట్ ఎంప్లాయీ పర్చేజ్ (ఈపీపీ+) ప్రోగ్రామ్‌ను ప్రవేశపెట్టడానికి గూగుల్‌తో భాగస్వామ్యం కుదుర్చుకున్నట్లు ప్రకటించింది. ఈ చొరవ జాగిల్ ప్రస్తుత ఉద్యోగి ప్రయోజనాల ప్రోగ్రామ్‌కు అనుబంధంగా ఉంటుంది. వ్యాపారాలు ఉద్యోగి నిశ్చితార్థాన్ని మెరుగుపరచడంలో, వినూత్న లీజింగ్ ఎంపికల ద్వారా ఖర్చులను మెరుగ్గా నిర్వహించడంలో సహాయపడుతుంది. ఈ ప్రోగ్రామ్ వ్యాపారాలు తమ కార్యాచరణ సామర్థ్యాన్ని మెరుగుపరచడానికి సురక్షితమైన, ఖర్చు-సమర్థవంతమైన మరియు స్కేలబుల్ పరిష్కారాలను అందిస్తుంది. అదే సమయంలో ఉద్యోగులకు సరసమైన ధరకు ప్రీమియం టెక్నాలజీని యాక్సెస్ చేయడంలో సాధికారత కల్పిస్తుంది.

## తమిళనాడులో ఆలయాల స్వయంప్రతిపత్తిపై అన్నామలై ప్రసంగం

తిరుపతి: అంతర్జాతీయ దేవాలయాల సమావేశం, ఎక్స్‌పో (ఐటీసీఎక్స్) 2025 ఒండవ రోజు తమిళనాడులోని బిజెపి చీఫ్, కె.అన్నామలై ఆలయ ఆర్థిక వ్యవస్థ, స్వయంప్రతిపత్తి గురించి మాట్లాడటానికి వేదికపైకి రావడంతో చాలా ఉద్వేగభరితంగా సభ ప్రారంభమైంది. తన ప్రసంగంలో, హిందూ రెలిజియస్, చారిటబుల్ ఎండోమెంట్స్ యాక్ట్స్ (హెచ్ఆర్ అండ్ సీఈ) వంటి పాలక సంస్థలను రద్దు చేస్తూ, భారతదేశ ఆర్థిక వృద్ధిని వేగవంతం చేయడానికి దేవాలయాలకు స్వయంప్రతిపత్తి కల్పించాల్సిన అవసరాన్ని, పెద్ద, స్వయంప్రతిపత్తి కలిగిన దేవాలయాల ఆర్థిక వ్యవస్థను అనుకరించాల్సిన అవసరాన్ని ఆయన వెల్లడించారు. వివిధ తరాలకు చెందిన సనాతన ధర్మ అనుచరులను ఒకచోట చేర్చడానికి ఐసీటీఎక్స్, టెంపుల్ కనెక్ట్ చేసిన ప్రయత్నాలను ఆయన ప్రశంసించారు.

## కేఎల్ డీమ్డ్ టు బి యూనివర్సిటీ స్కాలర్‌కు న్యూరోకెమిస్ట్రీ ఫ్రాన్స్ ట్రావెల్ అవార్డు

హైదరాబాద్: బయోటెక్నాలజీలో పిహెచ్‌డి స్కాలర్ అయిన లక్ష్మీ సౌమ్య ఈమని ప్రతిష్టాత్మక న్యూరోకెమిస్ట్రీ ఫ్రాన్స్ ట్రావెల్ అవార్డును గెలుచుకున్నారని కెఎల్ డీమ్డ్ టు బి యూనివర్సిటీ సంతోషంగా వెల్లడించింది. ఆంధ్రప్రదేశ్ నుండి ఎంపికైన ఏకైక స్కాలర్‌గా లక్ష్మీ సౌమ్య ఆగస్టు 14 నుండి 24 వరకు యుఎస్‌ఎలో జరిగే అంతర్జాతీయ సదస్సుకు హాజరవుతారు. ఈ అవార్డు ఆమె ప్రఖ్యాత పరిశోధనా కేంద్రానికి ప్రయాణించడానికి వీలు కల్పిస్తుంది, అక్కడ ఆమె నాడీ సంబంధిత రుగ్మతలపై తన వినూత్న పరిశోధన ను కొనసాగించనున్నారు. ఈ రంగంలోని అగ్రశ్రేణి శాస్త్రవేత్తలతో కలిసి పనిచేయనున్నారు. ఆగస్టు 25న భారతదేశానికి తిరిగి వచ్చే ముందు ఆమె తన పరిశోధనలను ప్రపంచ నిపుణులతో ఈ సదస్సులో భాగంగా పంచుకుంటారు.

## ఈయూలోకి ప్రవేశించే సరుకుల భద్రతకు ఏప్రిల్ 1 నుండి ఐసీఎస్-2

ముంబయి: ద యూరోపియన్ యూనియన్ ఇంపోర్ట్ కంట్రోల్ సిస్టం 2 ( ఐసీఎస్2) ఇప్పటికే ఉన్న గగన, సముద్ర, ఇన్ ల్యాండ్ వాటర్ వే సదుపాయాలకు అదనంగా రోడ్డు, రైలు మార్గాలు సహా అన్ని రవాణా విధానాల కోసం ప్రామాణికమైన, ప్రీ-అరైవల్ కస్టమర్స్ ప్రక్రియను ప్రవేశపెట్టడం ద్వారా ఈయూలోకి ప్రవేశించే సరుకుల భద్రత, రక్షణను మెరుగుపరిచే లక్ష్యాన్ని కలిగి ఉంది. పూర్తి ఎంట్రీ సమ్మరి డిక్లరేషన్స్ (ఈఎస్ఎస్) డేటా ద్వారా రాబోతున్న సరుకులతో కలిగే ప్రమాదాలను మెరుగ్గా అంచనా వేయడానికి కస్టమర్స్ అధికారులకు ఐసీఎస్2 వీలు కల్పిస్తుంది, తద్వారా కస్టమర్స్ నేరాలను నివారించి, పోరాడటంలో ఈయూ సామర్థ్యాన్ని మెరుగుపరుస్తుంది. అంతిమంగా సురక్షితమైన, మరింత భద్రతతో కూడిన వాణిజ్య వ్యాపారాన్ని నిర్ధారిస్తుంది. 1 ఏప్రిల్ 2025 నుండి, రోడ్డు, రైలు వాహకాలు ఈయూకి లేదా దాని ద్వారా పంపించిన సరుకులపై డేటాను పూర్తి ఈఎస్ఎస్ ద్వారా కేటాయించాలి. రవాణా విధానాలను ఉపయోగించి వాహనాలను రవాణా చేసే తపాలా, ఎక్స్‌ప్రెస్ క్యారియర్లకు, అదే విధంగా లాజిస్టిక్స్ ప్రొవైడర్స్ వంటి ఇతర పార్టీలకు కూడా ఈ బాధ్యత వర్తిస్తుంది.

## నథింగ్ ఫోన్ (3ఏ) సిరీస్‌లో కెమెరా ఫీచర్స్ ప్రత్యేకం

ముంబయి: లండన్‌కు చెందిన టెక్నాలజీ కంపెనీ నథింగ్ మంగళవారంనాడు ఫోన్ (3ఏ) సిరీస్‌లో ప్రో-లెవెల్ కెమెరా సిస్టమ్ ఉంటుందని ప్రకటించింది. అది వాడుకదారులు ఏ వాతావరణంలో అయినా సరే నిజమైన స్మార్ట్‌ఫోన్ ఫోటోలు మరియు వీడియోలను తీసుకోవడానికి వీలు కలిగిస్తుంది. ఫోన్ (3ఏ) సిరీస్ కొత్త పెరిస్కోప్ లెన్స్‌ను ఏఐ స్పష్టతను పెంచే అల్గారిథమ్‌లతో సమ్మిళితం చేస్తూ ఒక ఫ్లాగ్‌షిప్ ఫోటోగ్రఫీ స్మార్ట్‌ఫోన్ లాగా పనితీరును కనబరుస్తుంది. ఇంతకు మునుపు ఉన్న తన ఫోన్ (2ఏ)తో పోలిస్తే ఫోన్ (3ఏ) సిరీస్ కెమెరా గణనీయమైన మెరుగుదలలను కలిగి ఉంటుంది. దీని అత్యంత ముఖ్యమైన ఆధునీకరణలలో, 50ఎంపీ పెరిస్కోప్ లెన్స్‌ను జోడించడం అనేది ఒకటి. ఇది ప్రస్ఫుటమైన, వివరణాత్మక మాక్రో షాట్‌లను, 70 ఎంఎం పోర్ట్రెయిట్ -కచ్చితమైన దృష్ట్యాత్మక నిడివిని అందిస్తూ 3ఎక్స్ ఆప్టికల్ జూమ్, 6ఎక్స్ ఇన్-సెన్సార్ జూమ్, 60ఎక్స్ అల్ట్రా జూమ్‌ను అందజేస్తుంది.

సంపాదకీయం

ఎన్నికల కమిషన్ ప్రధానాధికారి రాజీవ్ కుమార్ మంగళవారం పదవీ విరమణ చేశారు. ఆయన స్థానంలో ఎన్నికల కమిషన్ ప్రధానాధికారిగా జ్ఞానేశ్ కుమార్‌ను నియమిస్తూ సోమవారం అర్థ రాత్రి మోదీ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. కొత్త ఎన్నికల కమిషన్ ప్రధానాధికారిని నియమించడానికి ముగ్గురు సభ్యులతో కూడిన కమిటీ సమావేశం సోమవారం సాయంత్రం ఏర్పాటు చేయడంలోనే మోదీ ప్రభుత్వ అసలు ఉద్దేశం ఏమిటో తేలిపోయింది. రాజ్యాంగ వ్యవస్థ అయిన ఎన్నికల కమిషన్ ఎంత ప్రధానమైందో మోదీ ప్రభుత్వానికి తెలియక కాదు. అది కార్య నిర్వాహకవర్గంలో భాగం కాదనీ, మన ఎన్నికల వ్యవస్థకు, ప్రజాస్వామ్యానికి మూల కందం అని కూడా మోదీ ప్రభుత్వానికి తెలుసు. చిక్కంతా ఎక్కడంటే రాజ్యాంగ వ్యవస్థలను కూడా తమ గుప్పెట్లో పెట్టుకోవడానికి అలవాటు పడిన మోదీ ప్రభుత్వం ఎన్నికల కమిషన్ ప్రధానాధికారిని, కమిషనర్లను నియమించడంలోనూ తమకు అనుకూలంగా ఉండేవారిని, తాము చెప్పినట్టల్లా వినేవారిని వెతికి వెతికి నియమించడం మోదీ నిరంకుశ శైలిలో భాగమే. అసత్య ప్రచారాలు, డబ్బు సంచులు గుమ్మరించడం, చిన్నా చితక ఎన్నికలలో కూడా ప్రధానమంత్రి ప్రచారం చేయడం మాత్రమే బీజేపీ గెలుపును ఖాయం చేయవనే విషయం కూడా మోదీకి తెలుసు. అందుకే ఎన్నికల కమిషన్ ప్రధానాధికారి, మిగతా ఇద్దరు కమిషనర్లు కూడా తమ ప్రయోజనాలు పరిరక్షించే వారై ఉండాలి. రాజీవ్ కుమార్ ఎన్నికల కమిషన్ ప్రధానాధికారిగా ఉన్నప్పుడు సరిగ్గా అదే పని చేసి స్వామి భక్తిని చాటుకున్నారు. ఇప్పుడు ఎన్నికల కమిషనర్‌గా నియమితుడైన జ్ఞానేశ్ కుమార్ కూడా అచ్చు గుద్దినట్టు రాజీవ్ కుమార్ లాంటి వారే. ఆయన గత చరిత్ర గమనిస్తే మోదీ ఆయననే ఎందుకు ఎన్నికల కమిషన్ ప్రధానాధికారిని చేశారో అర్థం అవుతుంది. రాజీవ్ కుమార్ తరవాత ఆయనే సీనియర్ అన్న విషయం కేవలం మాటవరసకు చెప్పే మాటే. జ్ఞానేశ్ కుమార్ ఈ ప్రభుత్వ ప్రయోజనాలు కాపాడడానికి భేషుగ్గా ఉపయోగపడ్తారన్నది ఆయన గత చరిత్ర చూస్తే తెలుస్తుంది. 2018 నుంచి 2021 దాకా హోం మంత్రిత్వ శాఖలో అడిషనల్ సెక్రెటరీగా ఉన్నారు. 2019లో మోదీ ప్రభుత్వం అకస్మాత్తుగా జమ్మూ-కశ్మీర్‌కు ప్రత్యేక ప్రతిపత్తి కల్పించిన సమయంలో తెరవెనక కథ నడిపింది ఆయనే. అదీ మోదీ అభీష్టం మేరకే అనేది దాపరికంలేని వ్యవహారమే. జమ్మూ-కశ్మీర్ పునర్వ్యవస్థీకరణ బిల్లును రూపొందించడంలో జ్ఞానేశ్ కుమార్ పాత్ర అత్యంత ప్రధానమైందే. రామజన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ ఏర్పాటులో కూడా జ్ఞానేశ్ కుమార్ మోదీ అనుకూల వైఖరి అనుసరించి తరించారు. అప్పుడు ఆయన ఉన్నతాధికార వర్గంలో భాగం కనక ప్రభుత్వం చెప్పిందల్లా చేశారు అని సర్దుకోవడానికి అవకాశం ఉంది. కానీ ప్రభుత్వానికి అడుగులొత్తవలసిన బాధ్యత ఏ ఐ.ఎ.ఎస్. అధికారికీ లేదు. ప్రభుత్వానికి సబబైన సలహా ఇవ్వడం ఐ.ఎ.ఎస్. అధికారుల విధి. వినడం వినకపోవడం ప్రభుత్వం తేల్చుకుంటుంది. సీనియర్ ఐ.ఎ.ఎస్. అధికారిగా ఆయన అందించిన "సేవల"కు మెచ్చి ఆయనను ఎన్నికల కమిషనర్‌ను చేశారు. ఇప్పుడు ఎన్నికల కమిషన్ ప్రధానాధికారిని చేసేశారు. ఎన్నికల కమిషన్ ప్రధానాధికారిగా రాజీవ్ కుమార్ పదవీ విరమణ చేస్తారని ముందే తెలుసు. అలాంటప్పుడు ఒక్క రోజు ముందు నియామక కమిటీ సమావేశం ఏర్పాటులోనే తన మాట నెగ్గించుకోవాలన్న పట్టుదల మోదీకి ఉందని ఈ హడావుడి సమావేశం వల్ల తేలిపోయింది.

# భారం సుప్రీంకోర్టుదే

జ్ఞానేశ్ కుమార్ ఎన్నికల కమిషనర్‌గా ఉన్న 11 నెలల కాలంలో రాజీవ్ కుమార్, సుక్బీర్ సింగ్ సంధూతో కలిసి లోక్‌సభ ఎన్నికలు, కేంద్ర పాలిత ప్రాంతం అయిన తరవాత కశ్మీర్‌లో మొదటి శాసనసభ ఎన్నికలు, హర్యానా జార్ఖండ్, మహారాష్ట్ర, ఢిల్లీ శాసనసభ ఎన్నికలు నిర్వహించారు. ఈ ఎన్నికల్లో వివాదాస్పదం కానిది ఒక్కటి కూడా లేదు.

జ్ఞానేశ్ కుమార్ 2029 జనవరి 26 దాకా ఎన్నికల కమిషన్ ప్రధానాధికారిగా ఉంటారు. అంటే ఆ సమయంలో 20 శాసనసభ ఎన్నికలే కాక, 2027లో రాష్ట్రపతి, ఉప రాష్ట్రపతి ఎన్నికలు కూడా ఆయన అధీనంలోనే జరుగుతాయి. 2029 సార్వత్రిక ఎన్నికలకు ఏర్పాట్లు కూడా ఆయన అధీనంలోనే జరుగుతాయి. ఎన్నికల కమిషన్ ప్రధానాధికారి, మిగతా ఇద్దరు కమిషనర్లను నియమించే కమిటీలో ఇంతకు ముందు ప్రధాని, సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి, లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు ఉంటారు. కానీ డి.వై.చంద్రచూడ్ ప్రధాన న్యామూర్తిగా ఉన్నప్పుడే ప్రధాన న్యాయమూర్తికి ఈ త్రిసభ్య కమిటీలో స్థానం లేకుండా చేయడానికి 2023 డిసెంబర్ లో ఎన్నికల కమిషనర్ల నియామక చట్టాన్నే మోదీ సర్కారు మార్చేసింది. అంతకు ముందు 2023 మార్చిలోనే సుప్రీంకోర్టు ఈ త్రిసభ్య కమిటీలో ప్రధాన న్యాయమూర్తి కూడా ఉండాలని చెప్పింది. ఈ ఆదేశాన్ని ఖాతరు చేయకుండా ఉండడానికే 20023 డిసెంబర్ లో ఏకంగా చట్టమే మార్చేశారు. ఆ తరవాత త్రిసభ్య కమిటీలో ప్రధాని, కేంద్ర మంత్రివర్గ సభ్యులు ఒకరు, ప్రతిపక్ష నాయకుడు ఉంటారు. ఈ గొడవంతా ఎందుకొచ్చిందంటే ఎన్నికల కమిషన్ అధికారులను నియమించేందుకు నిర్దిష్ట చట్టం ఏమీ లేదు. అప్పటిదాకా ప్రధాన న్యాయమూర్తికి కూడా స్థానం ఉండాలని సుప్రీంకోర్టు తీర్పు చెప్పింది. అందుకే మోదీ ప్రభుత్వానికి అనుకూలంగా కొత్త చట్టం తీసుకొచ్చారు. చట్టాలు చేసే హక్కు పార్లమెంటుకు ఉన్న మాట నిజమే. పార్లమెంటులో అధికార పక్షానికి మెజారిటీ ఉంటుంది కనక తమ రాజకీయ ప్రయోజనాలకు అనుకూలంగా శాసనాలు చేయడం మోదీ ప్రభుత్వ విధానం. ఎన్నికల కమిషన్ అధిపతులను నియమించడం స్వతంత్రమైన రీతిలో, ఎలాంటి ప్రభావానికి లోను కాకుండా అంటే ప్రభుత్వ ప్రభావం లేకుండా జరగాలన్నది సుప్రీంకోర్టు ఆదేశం సారాంశం. కొత్త చట్టాన్ని సవాలు చేస్తూ కాంగ్రెస్ నాయకులు జయ ఠాకూర్, ప్రజాస్వామ్య సంస్కరణల సంఘం తదితరులు సుప్రీంకోర్టుకెక్కారు. ఈ పిటిషన్లపై గత 12వ తేదీన విచారణ జరగాల్సింది. కానీ ఆ రోజు విచారణకే రాలేదు. బుధవారానికి వాయిదా వేశారు. అందులో కూడా విచారించవలసిన కేసుల్లో ఈ పిటిషన్ 41వ స్థానంలో ఉంది. మామూలుగా అయితే బుధవారం కూడా జరిగేది కాదేమో. కానీ సీనియర్ న్యాయవాది ప్రశాంత్ భూషన్ ఈ పిటిషన్లను కోర్టు ప్రారంభం కాగానే విచారించాలని విజ్ఞప్తి చేశారు. న్యాయ మూర్తులు అత్యవసర అంశాల పరిశీలన ముగిసిన తరవాత విచారించ డానికి అంగీకరించారు. విచిత్రం ఏమిటంటే అనూప్ బరన్వాల్ కేసులో సుప్రీంకోర్టు రాజ్యాంగ పీఠం చెప్పిన తీర్పును లెక్క చేయకుండా మోదీ సర్కారు చట్టం తీసుకొచ్చింది. నియామక కమిటీలో ప్రధాని, మరో కేంద్ర మంత్రి ఉన్నప్పుడు మరో సభ్యుడైన ప్రతిపక్ష నాయకుడి మాటను ఎవరు పట్టించుకుంటారు గనక! మోదీ ప్రభుత్వ ఉద్దేశమే రాజ్యాంగాన్ని, సుప్రీకోర్టును పట్టించుకోకుండా సకల వ్యవస్థలు తమ గుప్పెట్లో పెట్టుకోవడమే. సుప్రీంకోర్టు మీద భారం వేసి ఎదురు చూడాల్సిందే.

## ప్రజావసరాలపై కొరవడ్డ శ్రద్ధ

కె.సుబ్బరాయన్
సీపీఐ ఎంపీ

కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ 2025-26 ఆర్థిక సంవత్సరానికి ఇటీవల పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన బడ్జెట్ ప్రజల సంక్షేమమే లక్ష్యంగా ఏమాత్రం లేదు. ఇది కార్పొరేట్ కంపెనీల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని రూపొందించినట్టు కనిపిస్తోంది. ఈ దేశ సంపద సృష్టికర్తలైన కార్మికులు, కర్షకులను ఈ బడ్జెట్‌లో పూర్తిగా విస్మరించారు. అణగారిన వర్గాల అత్యంత దయనీయ స్థితి ఆందోళన కలిగిస్తోంది. వారి కడగండ్ల గురించి మాట్లాడేందుకు కేవలం కొద్ది నిముషాలు సరిపోదు. దానిపై మాట్లాడాలంటే పార్లమెంట్ సంవత్సర కాలంలో అనేక సార్లు సమావేశం కావాల్సివుంటుంది. ఒకప్పుడు సంవత్సరానికి 135సార్లు సమావేశమయ్యే పార్లమెంట్ ఇప్పుడు ఏడాదికి 55 రోజులు మాత్రమే సమావేశమవుతోంది. ఇలా చేయడం మన ప్రజాస్వామ్యానికి శిలువ వేయడం వంటిదేననడంలో ఎటువంటి అనుమానంలేదు. ఇలా చేయడాన్ని అధికారపక్షం మానివేయడంతోపాటు ప్రతిపక్ష పార్టీలకు మరింత అవకాశం కల్పించాలి. అప్పుడే పార్లమెంట్‌లో ప్రజల కడగండ్లు స్పష్టంగా వివరించగలుగుతామని నేను స్పష్టం చేయదలుచుకున్నాను. "ఈ బడ్జెట్‌లో బీహార్‌కు అనేక రాయితీలు ఇచ్చినందుకు తమిళనాడుకు ఎటువంటి అభ్యంతరంలేదు. తమిళనాడును ఎందుకు

పట్టించుకోలేదన్నదే ప్రశ్న. తమిళనాడును ఎందుకు విస్మరిస్తున్నారో ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ స్పష్టంచేయాలి. ప్రత్యేకించి ప్రతిపక్ష పాలిత రాష్ట్రాలను కేంద్ర ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం చేస్తోంది. మోదీ ప్రభుత్వం ఈ రాష్ట్రాలను లక్ష్యంగా చేసుకుని నాశనం చేస్తోంది. ఢిల్లీ అసెంబ్లీకి జరిగిన ఎన్నికలలో బీజేపీ సాధించిన విజయం శాశ్వతం కాదు, ఈ విజయం తాత్కాలిక స్వభావం కలిగినదే. ప్రతిపక్షాలలో అనైక్యత బీజేపీకి విజయాన్ని అందించింది. ఈ ఎన్నికల్లో బీజేపీ అనేక అక్రమాలకు కూడా పాల్పడింది. ఈ విజయం చిరకాలం నిలిచిపోదని బీజేపీ గుర్తించాలి. ఈ బడ్జెట్‌లో తిరుక్కురల్ ప్రస్తావన చేశారు. కానీ ఎటువంటి న్యాయం, చట్టంలేదు.

గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధిని పెంచేందుకు ఏం చేస్తారో బడ్జెట్ ప్రతిపాదనలలో ప్రస్తావించలేదు. యూపీఏ ప్రభుత్వం తీసుకువచ్చిన మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని నీరుగార్చకుండా మీరు పటిష్టపరిచివుండాల్సింది. ఈ పథకం క్రింద కూలీలకు ఇచ్చే వేతనాలు పెంచాలి. కానీ, ఈ పథకానికి కేటాయింపులు రూ.89,000 కోట్ల నుంచి రూ.86,000 కోట్లకు తగ్గించి వేశారు. గ్రామీణ ప్రాంత ప్రజానీకానికి రెగ్యులర్ ఉపాధి ఎలా కల్పించాలనే విషయాన్ని కేంద్ర ప్రభుత్వం పట్టించుకోకుండా ఈ పథకాన్ని ఎలాగైనా రద్దు చేయాలని తహతహలాడుతోంది. మోదీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఈ దశాబ్దా కాలంలో కార్పొరేట్ కంపెనీలకు ప్రయోజనాలు, పన్ను రాయితీలు ఎంత భారీగా ఇచ్చారో లెక్కలేదు. ఆ కార్పొరేట్ కంపెనీల రుణాలను ఎలా మాఫీ చేశారు? కార్పొరేట్ పన్ను ఎంత తగ్గించారు? దీని వల్ల ప్రభుత్వ ఖజానాకు వచ్చిన నష్టం ఎంత? ఈ వాస్తవాలన్నింటి కేంద్ర ప్రభుత్వం శ్వేతపత్రం రూపంలో విడుదల చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. అప్పుడే ఈ ప్రభుత్వం ఎవరి కోసం అధికారంలో ఉందో తెలుస్తుంది.

మోదీ పాలనలో ప్రభుత్వరంగ నిర్వహణ అత్యంత పేలవంగా ఉంది. వాటిని పటిష్టపరిచే బదులు నిర్వీర్యం చేసే విధంగా కేంద్ర ప్రభుత్వ విధానంవుంది. మోదీ నిరంతరాయంగా పండిట్ జవహర్‌లాల్ నెహ్రూని తప్పుపడుతుంటారు. ప్రజల సంపదగా ప్రభుత్వరంగ సంస్థలను నెహ్రూ మనకు వదిలివేశారు. ఇవి సామాన్య ప్రజల సంపద. ఈ ప్రభుత్వరంగ సంస్థలన్నింటి నుంచి పెట్టుబడులు ఉపసంహరించే అధికారం మీకు ఎక్కడి నుంచి వచ్చింది? ప్రజా సంక్షేమానికి వ్యతిరేకంగా ఎలా పనిచేస్తారు? ఇందుకు ప్రజల నుంచి అనుమతి తీసుకున్నారా?

మోదీ ప్రభుత్వానికి ప్రభుత్వరంగం దేనిపైనా శ్రద్ధలేదు. బీమా రంగాన్ని చూడండి. ఇప్పుడు నూరుశాతం విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులకు (ఎఫ్‌డీఐ) అనుమతిస్తున్నారు. బీమా రంగం నుంచి తన బాధ్యతలన్నింటినీ ప్రభుత్వం వదులుకుంది. ఇది ప్రజలకు, దేశానికి అన్యాయం చేయడమే. ఈ పదేళ్లలో కేంద్ర ప్రభుత్వం పేద, అణగారిన, అట్టడుగు, కార్మిక, కర్షక, రైతు, వ్యవసాయ కూలీల సంక్షేమానికి చేసిందేమీ లేదంటే అతిశయోక్తికాదు. అమెరికా డాలరు లేదా రష్యా రూబుల్, లేదా ఇతర దేశ కరెన్సీతో పోల్చుకుంటే నేడు మన రూపాయి విలువేమిటి? భారత రూపాయి పతనానికి ఎవరు బాధ్యతవహిస్తారు?ఆ పతనానికి మోదీ ప్రభుత్వానిదే పూర్తి బాధ్యత. ఒక వైపు ధరల పెరుగుదల, మరో వైపు ద్రవ్యోల్బణం పేద, మధ్యతరగతి ప్రజానీకాన్ని అతలాకుతలం చేస్తున్నాయి. వారి కష్టార్జితాన్ని మోదీ ప్రభుత్వం లాక్కుంటోంది. ఈ దేశాన్ని పాలించే నైతిక హక్కు ఈ ప్రభుత్వానికి లేదు. ఈ బడ్జెట్ ప్రజావ్యతిరేక, కార్పొరేట్ అనుకూల బడ్జెట్. ఎఫ్‌డీఐ స్నేహపూర్వక బడ్జెట్. కాబట్టి భారత కమ్యూనిస్టు పార్టీ తరపున ఈ బడ్జెట్‌ను పూర్తిగా వ్యతిరేకిస్తున్నాను.

(కేంద్ర బడ్జెట్ ప్రతిపాదనలపై చర్చ సందర్భంగా ఈ నెల 11వ తేదీన పార్లమెంట్‌లో చేసిన ప్రసంగం సంక్షిప్తీకరణ)

# స్థానిక సంస్థల పోటీకి అర్హతల తారుమారు

షనిల్ యాకుబ్

జనాభాపై ప్రభుత్వాలు తీసుకుంటున్న చర్యలు తారుమారవుతున్నాయి. స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేయడానికి అర్హతలను ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఇటీవల తీసుకున్న చర్యలు ఇందుకు అద్దంపడుతున్నాయి. జనాభాను నియంత్రించడానికిగాను 1994లో చంద్రబాబునాయుడు ప్రభుత్వం పంచాయతీరాజ్, మున్సిపల్ శాఖ చట్టాలను సవరించింది. ఆనాడు ఇద్దరు పిల్లలున్న అభ్యర్థులు మాత్రమే పోటీ చేయాలనీ, అంతకు మించి పిల్లలున్న వారు పోటీచేయకూడదన్న నిబంధన పెడుతూ చట్టాలను సవరించారు. జనాభా పెరుగుదలలో స్తంభన నేపథ్యంలో తాజాగా ఈ నిబంధనను మార్చనున్నట్లు ప్రతిపాదించారు. ఇద్దరుపిల్లల కంటే తక్కువ మంది ఉన్నట్లయితే పోటీ చేయడానికి అనర్హులవుతారని, చట్టం చేయాలని 2025 జనవరి 16న ప్రతిపాదన చేశారు. జనాభాను అనుసరించి కేంద్ర ప్రభుత్వం నిధులను కేటాయిస్తుంది. అందువల్ల జనాభా పెంపుదలకు చంద్రబాబు ఇంతకు ముందు తాను తీసుకున్న నిర్ణయాలను తానే మార్చాల్సి వచ్చింది. ఇప్పుడు ఇద్దరు పిల్లలకంటే తక్కువమంది ఉంటే పోటీకి అర్హులుకాదు. ఇద్దరికి లేదా అంతకు ఎక్కువ మంది పిల్లలుంటేనే పోటీ చేయడానికి అర్హత ఉండేట్టు చట్టాన్ని సవరించే తలంపు చంద్రబాబు నాయుడు చేశారు. చంద్రబాబు ప్రభుత్వం ఏర్పడిన రెండు నెలలకు ఆంధ్రప్రదేశ్ పంచాయతీ రాజ్(సవరణ) బిల్లు 2024ను, ఆంధ్రప్రదేశ్ మున్సిపల్ చట్టాల (సవరణ) బిల్లు, 2024ను ప్రభుత్వం ఆమోదించింది. ఆకస్మికంగా ఈ బిల్లు ప్రతిపాదించి అందరినీ ఆశ్చర్యపరిచారు. గతంలో ఎక్కువ మంది పిల్లలుంటే అనర్హతను ప్రకటించి, తాజాగా తక్కువమంది పిల్లలుంటే అనర్హత ప్రకటించారు. దేశంలో సంప్రదాయంగా అనేక రాష్ట్రాలలో ఇద్దరుపిల్లల పరిమితిని అమలు చేస్తున్నారు. ఆయా కుటుంబాలలో అత్యధిక మంది పిల్లలు లేకుండా నియంత్రించడం కోసం ఇద్దరు పిల్లల పరిమితిని విధించారు. అయితే చంద్రబాబునాయుడు పెట్టిన కనీస పరిమితి తిరోగమనచర్య అవుతుంది. అదే సమయంలో రాజ్యాంగపరంగా సంశయాత్మకమైనది. ఇది ఆచరణాత్మకమైనది కాదు. తీవ్రమైన రిస్కులు

ఇందులో ఉన్నాయి. ప్రజాస్వామ్యయుతంగా పాల్గొనడం విరుద్ధమవుతుంది. వ్యక్తిగత స్వేచ్ఛ అలాగే స్త్రీ పురుష సమానత్వం ఉండదు.

ప్రపంచవ్యాప్తంగా సంతాన సాఫల్యత రేటు బాగా తగ్గిపోయి ఆందోళనకర పరిస్థితులు ఏర్పడ్డాయి. ఆసియా, ఐరోపా, ఉత్తరఅమెరికా దేశాలలో నిర్దిష్టమైన జనాభా ప్రాతినిధ్యం లేకుండా పోయింది. ఆంధ్రప్రదేశ్‌లో చంద్రబాబునాయుడు చేసిన ప్రతిపాదన సంతానసాఫల్యతకు సంబంధించిన సూచన ఆందోళన కలిగిస్తోంది. హర్యానాలో 2023లో సుప్రీంకోర్టు ఆ రాష్ట్రం ఏర్పరచిన గరిష్టంగా ఇద్దరు పిల్లల నిబంధనను సమర్థించింది. ఎన్నికల్లో పోటీచేసే హక్కు ప్రాథమిక హక్కు ఏమీకాదు. అయితే అది చట్టబద్ధమైనదే. కోర్టు చెప్పిన సహేతుకమైన విషయం జనాభా నియంత్రణలోనే ఇమిడి ఉంది. ఇది జాతీయ జనాభా విధానం (2000 సంవత్సరం)పై ఆధారపడి ఉంది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కనీస అర్హతను ఇద్దరు పిల్లలు ప్రతిపాదన చేయడం ఇతర అన్ని రాష్ట్రాలకంటే భిన్నంగాఉంది. 2009 సంవత్సరంలో చండీగఢ్ పాలనా విభాగం సుచిత, శ్రీ వత్సవ మధ్య జరిగిన కేసులో సుప్రీంకోర్టు పునరుత్పత్తి అవకాశాలు వ్యక్తి గత స్వేచ్ఛలో భాగమవుతాయి. రాజకీయ వ్యవహారాలలో పాల్గొనడానికి శిశు జననం తప్పనిసరిచేయడం ప్రాథమిక హక్కులో జోక్యం చేసుకోవడం అవసరం. ఈ నేపథ్యంలో చంద్రబాబు ప్రాతినిధ్యం ఆర్టికల్ 22 కింద క్లిష్టమైన ప్రశ్నలు లేవనెత్తుతోంది. ఆర్టికల్ 14 కింద ఈ ప్రతిపాదన సహేతుక వర్గీకరణను అనుమతించడం వీలుకాదు.

> ప్రపంచవ్యాప్తంగా సంతాన సాఫల్యత రేటు బాగా తగ్గిపోయి ఆందోళనకర పరిస్థితులు ఏర్పడ్డాయి. ఆసియా, ఐరోపా, ఉత్తరఅమెరికా దేశాలలో నిర్దిష్టమైన జనాభా ప్రాతినిధ్యం లేకుండా పోయింది. ఆంధ్రప్రదేశ్‌లో చంద్రబాబునాయుడు చేసిన ప్రతిపాదన సంతానసాఫల్యతకు సంబంధించిన సూచన ఆందోళన కలిగిస్తోంది. హర్యానాలో 2023లో సుప్రీంకోర్టు ఆ రాష్ట్రం ఏర్పరచిన గరిష్టంగా ఇద్దరు పిల్లల నిబంధనను సమర్థించింది. ఎన్నికల్లో పోటీచేసే హక్కు ప్రాథమిక హక్కు ఏమీకాదు.

అన్వర్‌అలీ సర్కార్ (1952), ఈ పీ రోయప్ప (1974) కేసులలో సుప్రీంకోర్టు నిర్ణయాల ప్రకారం, పరీక్షను ఎదుర్కొవలసి ఉంటుందని సుప్రీంకోర్టు తెలిపింది. ఎన్నికల్లో పోటీచేయడానికి పిల్లలను పరిమితం చేసే విధానం సరైంది కాదు. ఇద్దరు పిల్లలను కన్నవారిని పోటీ చేయకుండా పరిమితం చేయడం సహేతుకతలేనిదే. యువతీ యువకులకు, పిల్లలులేని దంపతులను పోటీచేయకుండా నిలువరించడం సరైందికాదు. 2003లో ముగ్గురితో కూడిన సుప్రీంకోర్టు ధర్మాసనం ఆర్టికల్ 19(1)(ఏ)ప్రకారం ఓటు హక్కుగా గుర్తించింది. అలాగే 2006లో కుల్‌దీప్ నయ్యర్ నాయకత్వంలోని ఐదుగురు జడ్జిలతో కూడిన ధర్మాసనం రాజ్యాంగం మౌలిక నిర్మాణంలో స్వేచ్ఛగా, న్యాయంగా ఎన్నికలు జరగడం ఒక భాగమని చెప్పారు. ఈ విధంగా చూసినప్పుడు చంద్రబాబునాయుడు ప్రతిపాదన స్వేచ్ఛాప్రసంగానికి, మౌలిక నిర్మాణానికి అవమానమేకాదు, ఇండియా ప్రజాస్వామ్య వ్యవస్థను మౌలికంగా ప్రమాదం కలిగిస్తుంది.

ప్రస్తుతం రాజ్యాంగంలోని ఆర్టికల్స్ 243 ఎఫ్, 243 వి కింద 21 సంవత్సరాల వయసుగల యువతీ యువకులు పంచాయతీలు, లేదా మున్సిపాలిటీల పరిపాలనను నిర్వహించగల హక్కు ఉంది. ఇండియాలో వివాహంచేసుకునే యువకుల వయసు 21, యవతుల వయసు 18 ఉండాలి. ఆంధ్రప్రదేశ్‌లో ప్రతిపాదించిన ఇద్దరు పిల్లల కనీస విధానం రాజకీయాలలో పాల్గొనే వయసు 24 లేదా 25ఏళ్లు ఉండాలనే కనీస వయసుకు విరుద్ధంగా ఉంటుంది. చంద్రబాబు ప్రతిపాదన విశిష్టంగా లేదు. ప్రపంచవ్యాప్తంగా సంతానోత్పత్తి రేటు విధానకర్తలకు ఆందోళన కలిగిస్తుంది. చంద్రబాబు ప్రతిపాదనకు చట్టబద్ధమైన భద్రత అవసం. ఇందుకోసం ప్రభుత్వం ఎదురుచూస్తోంది. హక్కుల ఆధారిత ప్రజాస్వామ్యంలో బలవంతపు ప్రజావిధానాలు, ఆంక్షలు విధించడానికి ఎంతమాత్రం స్థానంలేదు.

చంద్రబాబు నాయుడు తీసుకున్న నిర్ణయంపైన రాష్ట్రంలో ప్రతిపక్షాలతో విపులంగా చర్చించాలి. అనేక రాష్ట్రాల్లో లేని ఈ విధానం ఎందుకు అమలు జరుపుతున్నారన్న విషయమై కేంద్ర ప్రభుత్వం లోతుగా చర్చించి ఆమోదించాలి. ప్రతిపక్షాలు సైతం విడిగా చర్చించి అయినా తమ అభిప్రాయాలను వెల్లడించాలి.

# మార్క్సిజాన్ని అభిమానించిన నరేంద్ర దేవ్

ఆర్వీ రామారావ్

అఖిలభారత కిసాన్ సభ ఏర్పడినప్పుడు ఆచార్య నరేంద్ర దేవ్ అందులో కీలక పాత్రధారి. అఖిలభారత కిసాన్ సభ (ఏఐకేఎస్) అధ్యక్షుడిగా కూడా ఉన్నారు. బాల గంగాధర్ తిలక్, అరవిందో ఘోష్ స్ఫూర్తితో నరేంద్ర దేవ్ జాతీయోద్యమంలో భాగస్వామి అయ్యారు. ఆయనకు బౌద్ధం మీద ఎంత విశ్వాసం ఉండేదో మార్క్సిజం మీద కూడా అంతే అనురక్తి ఉండేది. హిందీ భాషోద్యమంలోనూ ఆయన కీలక పాత్ర పోషించారు. 1934లో కాంగ్రెస్ సోషలిస్టు పార్టీ ఏర్పడినప్పుడూ ఆచార్య నరేంద్ర దేవ్ కీలక పాత్ర పోషించారు. స్వాతంత్ర్యోద్యమ సమయంలో ఆయన చాలా సార్లు జైలు శిక్ష అనుభవించారు. అనేక సార్లు ఉత్తరప్రదేశ్ శాసనసభ్యుడిగా ఉన్నారు. 1948 తరవాత లక్నో విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్‌గా ఉన్నారు. తనకు అభిమానం ఉన్న మార్క్సిస్టు దృక్పథం రీత్యా నైతిక, మానవతావాద దృష్టితో కూడా పేదరికం, దోపిడీకి వ్యతిరేకంగా పోరాడారు. ప్రజాస్వామ్యం లేని సామాజిక ప్రజాస్వామ్యం బూటకం అని ఆయన నమ్మేవారు.

నరేంద్ర దేవ్ నిరీశ్వర వాది. దేవుడిని గొప్పగా

భావించడం అంటే మానవాళిని కించపరచడమే అనేవారు. మన దేశంలో పరిశోధనావకాశాలు అంతగా లేని సమయంలోనే పాళీ భాషలో ఉన్న బౌద్ధ సాహిత్యాన్ని ఆపోసన పట్టారు. త్రిపిటకాలు, అనుపిటక మీద ఆయన సాధికారికంగా మాట్లాడేవారు. బౌద్ధంలోని నైతిక అంశాల మీద ఆయనకు ఎనలేని మక్కువ. ప్రపంచం అంతా బాధల్లో మునిగి ఉన్నప్పుడు నాకు మోక్షం వస్తే ఫలితం ఏమిటి అనేవారు. బౌద్ధంలో పేర్కొన్న విధంగా సాంస్కృతికంగా మన దేశం స్వేచ్ఛగా ఉంటుందని, గుడ్డి సాంప్రదాయికతకు దూరంగా ఉండొచ్చునని నరేంద్ర దేవ్ భావించేవారు. ఈ సిద్ధాంతం ఆధారంగానే ఆయన నైతికత అన్న భావనను ప్రచారం చేసేవారు. ఇదే దృష్టితో ఆయన ప్రాచ్య, పాశ్చాత్య సిద్ధాంతాలను అధ్యయనం చేసేవారు. అందువల్లే ఆయనకు భారత సంస్కృతి మీద అపారమైన పట్టు ఉండేది.

బౌద్ధంలో అందుబాటులో ఉన్న సాహిత్యం అంతా హిందీలో వెలువడాలన్నది ఆయన కోరిక. బౌద్ధ గ్రంథాలను హిందీలోకి అనువదించే వారి కోసం అన్వేషించారు. ఆయన రాసిన బౌద్ధ ధర్మ దర్శనం చాలా ప్రామాణికమైన గ్రంథం. ఈ గ్రంథంలో ఆయన బౌద్ధ మతం, సిద్ధాంతాన్ని విడమర్చారు. మహాత్మా గాంధీలాగే ఫాసిజం వల్ల ఎంత కీడు ఉందో సామ్రాజ్యవాదం కూడా అంతే చేటు తెస్తుందన్నది ఆయన భావన. ఈ అవగాహన ఆయనకు భారతీయ స్రోతస్సు నుంచే అబ్బింది.

నరేంద్ర దేవ్

ఆయన అసలు పేరు అవినాశీ లాల్. కానీ నరేంద్ర దేవ్‌గా మార్చుకున్నారు. ఆయన పుట్టింది ప్రస్తుత పాకిస్థాన్ లోని సియాల్ కోట్‌లో అయినా ఆయన తండ్రి బల్దేవ్ ప్రసాద్ 19వ శతాబ్దంలో ఫైజాబాద్ తరలి వచ్చారు. స్వాతంత్ర్యానంతరం ఆయన లక్నో విశ్వ విద్యాలయం, బెనారస్ విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్‌గా ఉన్నారు. సోషలిజం అంటే కేవలం ఆకలి తీర్చేది కాదని, సాంస్కృతికంగా కూడా స్వేచ్ఛ ఉండాలని భావించారు. నరేంద్ర దేవ్ పండిత్ జవహర్ లాల్ నెహ్రూకు అత్యంత సన్నిహితుడు. నరేంద్ర దేవ్ మరణించినప్పుడు పండిత్ నెహ్రూ చాలా ఉద్వేగంగా మాట్లాడుతూ ఈ సభలో ఉన్న

నెహ్రూతో నరేంద్ర దేవ్

వారిలో ఆచార్య నరేంద్ర దేవ్‌కు నాకన్నా సన్నిహితులు ఎవరూ లేరు. మాది 40 ఏళ్ల స్నేహం. స్వాతంత్ర్యోద్యమంలోనూ, వ్యక్తి గత జీవితంలోనూ మేమిద్దరం చాలా సన్నిహితంగా పనిచేశాం. అలాంటివారు మళ్లీ కనిపించడం కష్టం" అన్నారు.

# దిల్లీ సీఎం ప్రమాణానికి భారీ ఏర్పాట్లు

**న్యూదిల్లీ:** దిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో ఘన విజయం సాధించింది బీజేపీ ప్రభుత్వ ఏర్పాటుపై దృష్టి సారించింది. దిల్లీలో సుదీర్ఘకాలం తర్వాత అధికారంలోకి వస్తుండటంతో నూతన ముఖ్యమంత్రి ప్రమాణస్వీకారానికి భారీ ఏర్పాట్లు చేస్తోంది. ఈ కార్యక్రమానికి పెద్దఎత్తున సినీ తారలు, పారిశ్రామికవేత్తలను ఆహ్వానించినట్లు తెలుస్తోంది. ఫిబ్రవరి 20న (గురువారం) సాయంత్రం 4.30 గంటలకు కొత్త సీఎం ప్రమాణస్వీకారానికి ముహూర్తం ఖరారైనట్లు బీజేపీ వర్గాలు వెల్లడించాయి. రామ్‌లీలా మైదాన్‌లో జరిగే ఈ వేడుకకు బీజేపీ భారీ ఏర్పాట్లు చేస్తోంది. ప్రమాణస్వీకారానికి ముందు ప్రముఖ కళాకారులతో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించ నుంది. దాదాపు 50 మంది సినీతారలు, ప్రముఖ పారిశ్రామికవేత్తలతో పాటు ఇతర దేశాల దౌత్యవేత్తలు, 20 రాష్ట్రాల ముఖ్యమంత్రులు, డిప్యూటీ సీఎంలు, కేంద్ర మంత్రులు, బీజేపీ అగ్రనేతలు ఈ కార్యక్రమానికి రానున్నట్లు తెలుస్తోంది. వీరితోపాటు దిల్లీకి చెందిన రైతులు, కేంద్ర ప్రభుత్వ పథకాల లబ్ధిదారులను ఆహ్వానించినట్లు సమా చారం. బాబా రాందేవ్, స్వామి చిదానంద, బాబా బాగేశ్వర్ ధీరేంద్రశాస్త్రి వంటి ఆధ్యాత్మిక గురువులు ప్రత్యేక అతిథులుగా హాజరుకానున్నట్లు బీజేపీ వర్గాలు తెలిపాయి. ఎన్నికల ఫలి తాలు వెలువడి 10 రోజులు అవుతున్నా నూతన ముఖ్యమంత్రి ఎవరనేది ఇంకా తెలియరాలేదు. మాజీ సీఎం సాహిబ్ సింగ్ వర్మ కుమారుడు పర్వేశ్ వర్మ పేరు సీఎం రేసులో ప్రము ఖంగా వినిపిస్తోంది. ఆయన తాజా ఎన్నికల్లో ఆమ్‌ఆద్మీ పార్టీ అధినేత కేజ్రీవాల్‌పై విజయం సాధించారు. బుధవారం బీజేపీ శాసనసభాపక్ష భేటీ జరగనుంది. అందులో కొత్త సీఎంతో పాటు కేబినెట్ మంత్రులను ఎన్నుకోనున్నట్లు తెలుస్తోంది.

# సత్యేంద్ర జైన్ విచారణకు రాష్ట్రపతి అనుమతి

**న్యూదిల్లీ:** ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) సీనియర్ నాయకుడు, దిల్లీ మాజీమంత్రి సత్యేంద్ర జైన్ కష్టాలు పెరిగాయి. మనీలాండరింగ్ కేసులో సత్యేంద్ర జైన్ విచారణకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆమోదం తెలిపారు. భారత పౌర రక్షణ నియమావళిలోని సెక్షన్ 218 కింద 60 ఏళ్ల జైన్‌పై కేసు నమోదు చేయడానికి హోంమంత్రిత్వ శాఖ రాష్ట్రపతి అనుమతి కోరింది. ఈడీ దర్యాప్తు, తగినంత సాక్ష్యాలు ఉండటంతో రాష్ట్రపతికి ఈ అభ్యర్థన చేసింది. కాగా... ఆదాయానికి మించి ఆస్తులు కలిగి ఉన్నారనే ఆరోపణపై జైన్ తదితరులపై సీబీఐ 2017 ఆగస్టులో ఎఫ్ఐఆర్ నమోదు చేసింది. 2018 డిసెంబర్‌లో చార్జిషీటు దాఖలు చేసింది. రూ.1.47 కోట్ల అక్రమాస్తులు ఉన్నాయని సీబీఐ తన చార్జిషీటులో పేర్కొంది. మనీలాండరింగ్ కేసులో సుదీర్ఘ కాలం జైలులో ఉండటంతో సత్యేంద్ర జైన్‌కు సిటీ కోర్టు బెయిలు మంజూరు చేసింది. దీంతో గత ఏడాది అక్టోబర్ 18 ఆయన తీహార్ జైలు నుంచి విడుదలయ్యారు. 2022 మేలో జైన్ అరెస్టు కాగా, 2023 మే 26, 2024 మార్చి 18 మధ్య 10 నెలలు మెడికల్ బెయిల్ మినహా తక్కిన కాలమంతా ఆయన జైలులోనే ఉన్నారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసిన సత్యేంద్ర జైన్... బీజేపీ అభ్యర్థి కర్నైల్ సింగ్ చేతిలో 21 వేల ఓట్ల తేడాతో ఓటమి పాలయ్యారు.

# క్రిస్టియన్ మైఖేల్‌కు సుప్రీం బెయిల్

### అగస్టా వెస్ట్‌లాండ్ కుంభకోణం కేసు...

**న్యూదిల్లీ:** అగస్టా వెస్ట్‌ల్యాండ్ కుంభకోణం కేసులో బ్రిటన్‌కు చెందిన క్రిస్టియన్ మైఖేల్ జేమ్స్‌కు సుప్రీంకోర్టు బెయిల్ మంజూరు చేసింది. రూ.మూడువేల కోట్లకుపైగా కుంభకోణంలో మైఖేల్ మధ్యవర్తిగా వ్యవహరించినట్లు ఆరోపణలు వెల్లువెత్తాయి. రూ.3,600 కోట్ల విలువైన 12 వీవీఐ హెలికాప్టర్ కొనుగోలులో మైఖేల్ పాత్రపై సీబీఐ, ఈడీ వేర్వేరుగా కేసులు నమోదు చేసి విచారణ జరుపుతున్నాయి. గతంలో ఆయన దాఖలు చేసిన బెయిల్ పిటిషన్‌ను సుప్రీంకోర్టు తిరస్కరించింది. 2023లో జేమ్స్ మార్చి 11, 2022 దిల్లీ హైకోర్టు ఉత్తర్వులను సవాల్ చేశారు. హైకోర్టు ఆయన బెయిల్ పిటిషన్‌ను తిరస్కరించింది. కేసుల్లో మైఖేల్ సగం శిక్ష అనుభవించారని... బెయిల్‌పై తనను విడుదల చేయాలని సుప్రీంకోర్టును కోరారు. విచారణ జరిపిన సర్వోన్నత న్యాయస్థానం బెయిల్‌ను తిరస్కరించింది. తాజాగా గతేడాది మళ్లీ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. అయినా అత్యున్నత న్యాయస్థానం విచారణకు నిరాకరించింది. అదే ఏడాది డిసెంబరులో మళ్లీ సుప్రీంకోర్టులో బెయిల్ పిటిషన్ దాఖలు చేయగా... సుప్రీంకోర్టు సీబీఐ సమాధానం కోరింది. అగస్టా వెస్ట్‌లాండ్ కేసులో జైలులో ఉన్న క్రిస్టియన్ మైఖేల్ జేమ్స్‌కు హిప్ రీప్లేస్‌మెంట్ సర్జరీకి ఏర్పాట్లు చేయాలని జనవరి 12న దిల్లీ కోర్టు ఎయిమ్స్‌ను ఆదేశించింది. ఆయన పెట్టుకున్న పిటిషన్‌పై ప్రత్యేక న్యాయమూర్తి సంజీవ్ అగర్వాల్ ఆదేశాలు జారీ చేశారు. తీవ్రమైన నొప్పితో బాధపడుతున్నారని... తుంటి మార్పిడి శస్త్రచికిత్స అవసరమని కోర్టుకు తెలిపారు. ఈ మేరకు సర్వోన్నత న్యాయస్థానం బెయిల్ మంజూరు చేసింది. యూపీఏ ప్రభుత్వ హయాంలో 12 హెలీకాప్టర్స్‌ను భారత వైమానికి దళానికి అప్పగించేలా రూ.3,600 కోట్లతో ఒప్పందం కుదిరింది. అయితే, ఈ ఒప్పందంలో అవకతవకలు జరిగాయని, సుమారు రూ.480 కోట్లు చేతులు మారాయని తేలింది. ఈ కుంభకోణంలో మధ్యవర్తిగా ఉన్నాడనే ఆరోపణలపై క్రిస్టియన్ మైఖేల్‌ను దుబాయి 2018లో భారత్‌కు అప్పగించింది. అప్పటి నుంచి మైఖేల్ భారత కస్టడీలో ఉన్నారు.

# మోదీ సర్కారుకు దార్శనికత లేదు

- ఆర్థిక వ్యవస్థ కుప్పకూలింది
- మల్లికార్జున ఖర్గే నిశిత విమర్శలు

**న్యూదిల్లీ:** దార్శనికత లేని మోదీ ప్రభుత్వం దేశ ఆర్థిక వ్యవస్థను కుప్పకూల్చిందని, ప్రజల జీవితాలను నాశనం చేసిందని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే దుయ్యబట్టారు. విదేశీ మదుపరులకు భారత ఆర్థిక వ్యవస్థ మంచి రాబడులు ఇస్తోందని ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ చేసిన వ్యాఖ్యానించడాన్ని తోసిపుచ్చారు. మంగళవారం ఈ మేరకు 'ఎక్స్'లో పోస్ట్ చేశారు. "మన ఆర్థిక వ్యవస్థ 'మంచి రాబడిని' అందిస్తోందని మోదీ సర్కార్ ఆర్థిక మంత్రి చెప్పడం కంటే వ్యంగ్యం మరొకటి ఉండదు" అని పేర్కొన్నారు. 2025 లో ఇప్పటివరకు భారత స్టాక్ మార్కెట్ల నుండి రూ.45 లక్షల కోట్లు తుడిచిపెట్టుకుపో యాయని, నిఫ్టీ పరిధిలోని 50 సంస్థలు ఐదు సంవత్సరాలలో అత్యంత బలహీన త్రైమాసిక లాభాల వృద్ధిని చూపించాయని ఖర్గే విమర్శిం చారు. 'గత ఏడాది అక్టోబర్ నుండి విదేశీ పెట్టుబడిదారులు రూ.1.56 లక్షల కోట్లకు పైగా స్టాక్‌లను విక్రయించారు. వీటిలో 2025 లోనే దాదాపు రూ.లక్ష కోట్లు ఉన్నాయి... దీని వల్ల చిన్న మధ్య తరహా పెట్టుబడిదారుల సంపద తుడిచి పెట్టుకుపోయింది' అన్నారు. "డాలరుతో పోలిస్తే రూపాయి విలువ రూ. 87 వద్ద ఉంది అంటే వాణిజ్య లోటు ఆకాశాన్ని అంటుతోంది. గత 5 సంవత్సరాలలో దిగుమతులు 62.21% పెరిగాయి. మోదీ ప్రభుత్వ వాణిజ్య విధానం భారతదేశానికి వినాశకరమైనది' అని ఖర్గే దుయ్య బట్టారు. 2004 నుండి 2014 వరకు యూపీఏ ప్రభుత్వ పదేళ్ల కాలంలో ఎగుమతుల వృద్ధి 549.36% పెరిగిందని, అదే 2014 నుండి 2024 వరకు మోదీ ప్రభుత్వ పదేళ్ల పాలనలో ఎగుమతులు కేవలం 24.72% పెరిగాయని ఖర్గే వివరిం చారు. భారతదేశం ప్రపంచ సుంకాల యుద్ధాన్ని చూస్తోందని చెబుతూ... 'మన తయారీ రంగం మునిగి పోతోంది, మేక్ ఇన్ ఇండియా, పీఎల్ఐ పథకాలు విఫలమయ్యాయి. యువత నిరుద్యోగ సమస్యకు పరిష్కారం లేదు. ధరల పెరుగుదల పొదుపును ఆపివేస్తోంది. వినియోగం తగ్గుతోంది. బడ్జెట్ నుండి ఉపశమనం లేదు. గ్రామీణ వేతనాల వృద్ధి శూన్యం. గత 10 సంవత్సరాలలో రూపాయి విలువ 43% క్షీణించింది. బలవంతంగా చమురు-గ్యాస్ కొనుగోలు చేయడం వల్ల మన దిగుమతి బిల్లులు భారం అవుతాయి" అని ఖర్గే వివరించారు. 'దృక్పథం లేని, చుక్కాని లేని, విధానరహిత మోదీ సర్కార్ భారత ఆర్థిక వ్యవస్థను కుప్ప కూల్చింది. భారతీయుల జీవితాలను నాశనం చేసింది' అని ఖర్గే నిప్పులు చెరిగారు. భారత ఈక్విటీ మార్కెట్‌లో విదేశీ సంస్థాగత మదుపర్లు (ఎఫ్ఐఐ) తరలిపోవడంపై సోమవారం కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ స్పందిస్తూ... భారత్‌లో పెట్టుబడులు పెట్టిన వారికి మెరుగైన ప్రతిఫలం అందుతోందని, అందుకే వారు లాభాల స్వీకరణకు దిగుతున్నారని చెప్పారు. పెట్టుబడులకు మెరుగైన రాబడులు ఇచ్చే వాతావరణం భారత్‌లో ఉందని పేర్కొన్నారు. గత ఏడాది అక్టోబర్ నుండి ఎఫ్ఐఐలు రూ.1.56 లక్షల కోట్లకు పైగా స్టాక్‌లను విక్రయించడం గమనార్హం. వీటిలో 2025 లోనే దాదాపు రూ.లక్ష కోట్లు ఉన్నాయి, ఇది సూచీలపై పడునైన దిద్దుబాటుకు దారితీసింది. పెట్టుబడిదారుల సంపదను తుడిచిపెట్టింది.

# కశ్మీర్‌లో కొత్త నేరచట్టాల అమలు విజయవంతం

### సీఎం ఒమర్ అబ్దుల్లా

**న్యూదిల్లీ:** కేంద్రప్రభుత్వం తీసుకొచ్చిన మూడు కొత్త నేరచట్టాలు అమలు జమ్మూ కశ్మీర్‌లో విజయవంతమైందని ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా అన్నారు. న్యూదిల్లీలో హోంమంత్రి అమిత్ షా అధ్యక్షతన జరిగిన సమీక్షా సమావేశంలో ఒమర్ పాల్గొన్నారు. సమావేశం అనంతరం విలేకరు లతో మాట్లాడుతూ... 'కొన్ని చిన్నచిన్న సమస్యలు మినహా మొత్తం మీద జమ్మూ కశ్మీర్‌లో కొత్త చట్టాల అమలు విజయవంత మైంది" అన్నారు. ఈ సమావేశంలో జమ్మూ కశ్మీర్ లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా, సీనియర్ ప్రభుత్వ అధికారులు, హోం మంత్రిత్వ శాఖ కీలక ప్రతినిధులు పాల్గొన్నారు. క్రిమినల్ చట్టాల అమలు కేంద్ర ప్రభుత్వ పరిధిలోకి వస్తుందనేది అబ్దుల్లా అంగీకరించినప్పటికీ, కొత్త చట్ట నిబంధనల గురించి ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. 'కేంద్రపాలిత ప్రాంతం (కశ్మీర్)లో ఈ చట్టాలను అమలు చేయడం ఎన్నికైన ప్రభుత్వం బాధ్యత కానప్పటికీ, వాటి నిబంధనలు, చిక్కుల గురించి ప్రజలకు అవగాహన కల్పించడం చాలా అవసరం. కళాశాలలు, విశ్వవిద్యాలయాలు, ప్రజా వేదికలలో అవగాహన పెంచాలి' అని ఆయన అన్నారు. సమావేశంలో ఎటువంటి శాంతిభద్రతల సమస్యలు చర్చించబడలేదని, ఇటీవల పార్లమెంటులో అమిత్ షాతో జరిగిన ప్రత్యేక సమావేశంలో అలాంటి చర్చలు జరిగాయని అబ్దుల్లా స్పష్టం చేశారు. జమ్మూకశ్మీర్‌పై ఇటీవల జరిగిన భద్రతా సమీక్ష సమావేశాలకు అబ్దుల్లా గైర్హాజరు కావడంపై ఆయన్ను ప్రశ్నించగా... "ఎన్నికైన ప్రభుత్వాన్ని భద్రతా సమీక్ష సమావేశాలకు పిలవకూడదని నిర్ణయం తీసుకుంటే, మనం ఏమి చేయగలం?" అన్నారు. సీఈసీ నియామకంపై కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ, ప్రధాని మోదీ మధ్య తలెత్తిన అభిప్రాయభేదాల్ని కూడా అబ్దుల్లా ప్రస్తావించారు. "ఆయన (రాహుల్)కు భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేసే హక్కు ఉంది... అందుకే ఆయన అక్కడ ఉన్నారు. ప్రభుత్వ నిర్ణయంతో ఏకీభవించడానికి మాత్రమే ఆయన అక్కడ లేరు" అని పేర్కొంటూ రాహుల్ గాంధీకి ఉన్న భిన్నాభిప్రాయ హక్కును ఆయన సమర్థించారు.

# మహాకుంభ్ కాదు... మృత్యు కుంభ్: మమత

**కోల్‌కతా:** ఉత్తరప్రదేశ్‌లోని యోగి సర్కార్‌పై పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ప్రయాగ్‌రాజ్‌లో జరుగుతున్న మతపరమైన కార్యక్రమం మహాకుంభమేళాకు సరైన ప్రణాళిక లేదని విమర్శించారు. ఇటీవలే అక్కడ జరిగిన తొక్కిసలాట ఘటనను ప్రస్తావిస్తూ... మహాకుంభ్‌ను 'మృత్యు కుంభ్'గా అభివర్ణించారు. కుంభమేళాకు వచ్చే వీఐపీలకు మాత్రం ప్రత్యేక హక్కులు కల్పిస్తున్నారని, పేదలను విస్మరిస్తున్నారని ఆరోపించారు. ఉత్తరప్రదేశ్‌లోని బీజేపీ ప్రభుత్వం 'దేశాన్ని విభజించేందుకు మతాన్ని అమ్ముతోంది' అని సంచలన వ్యాఖ్యలు చేశారు. పవిత్ర కార్యక్రమానికి ఎందుకంత ప్రచారం కల్పించారని నిలదీశారు.. బడ్జెట్ సమావేశాల్లో భాగంగా రాష్ట్ర అసెంబ్లీలో మంగళవారం మమత మాట్లాడుతూ.. 'అది 'మృత్యు కుంభ్'. నేను మహా కుంభ్‌ను గౌరవిస్తాను. పవిత్ర గంగామాతనూ గౌరవిస్తా. కానీ అక్కడ సరైన ప్రణాళిక లేదు. ధనవంతులు, వీఐపీ లకు ప్రత్యేక క్యాంపులు ఉన్నాయి. రూ.లక్షలు వెచ్చించి ప్రత్యేక టెంట్లు బుక్ చేసుకునే వ్యవస్థ ఉంది. కానీ పేదలకు మాత్రం ఎలాంటి ఏర్పాట్లూ లేవు. ఇలాంటి కార్యక్రమాల్లో తొక్కిసలాట ఘటనలు సాధారణమే. కానీ అలాంటి ఘటనలకు ఆస్కారం లేకుండా ఏర్పాట్లు చేయడం ముఖ్యం. ఇక్కడ మీరు ఎలాంటి ఏర్పాట్లు చేశారు' అని యూపీ సర్కార్‌ను ప్రశ్నించారు.

**నిరూపిస్తే రాజీనామా: మమత**

బీజేపీ ఎమ్మెల్యేలపై మమత విరుచుకుపడ్డారు. బంగ్లాదేశ్ ఛాందసవాదులతో తనకు సంబంధం ఉందని నిరూపిస్తే తన పదవికి రాజీనామా చేస్తానని సవాల్ విసిరారు. బంగ్లాదేశ్ ఛాందసవాదులతో చేతులు కలిపారంటూ బీజేపీ ఎమ్మెల్యేలు చేస్తున్న ఆరోపణలపై ప్రధాని నరేంద్ర మోదీకి ఫిర్యాదు చేస్తానని తెలిపారు. 'అసెంబ్లీలో మాట్లాడటానికి అనుమతించడంలేదని బీజేపీ ఎమ్మెల్యేలు దుష్ప్రచారం చేస్తున్నారు. విద్వేషాలు వ్యాప్తి చేయడానికి, ప్రజల్ని విభజించడానికి వారికి వాక్ స్వాతంత్ర్యం అనుమతించదు. బీజేపీ మతాన్ని తన రాజకీయ ప్రయోజనాల కోసం వాడుకుంటోంది. నేను జాతీయ భద్రత లేదా విదేశాంగ విధానం వంటి అంశాల జోలికి వెళ్లను. కానీ, అమెరికా నుంచి అక్రమవలసదారుల్ని గొలుసులతో బంధించి వెనక్కి పంపించడం సిగ్గుచేటు. వారిని అమెరికా నుంచి తీసుకొచ్చేందుకు కేంద్ర ప్రభుత్వం విమానాలు పంపాలి. బీజేపీ ఎమ్మెల్యేలు నన్ను ఎదుర్కొనేందుకు భయపడుతున్నారు. అందుకే నేను సభలో మాట్లాడుతున్నప్పుడు బహిష్కరణ చేసి వెళ్లిపోతున్నారు' అని ఆక్షేపించారు.

# ఆ నీళ్లు స్నానానికి పనికిరావు...

### ప్రయాగ్‌రాజ్ నదీ జలాల్లో స్థాయికి మించి కోలీఫామ్ బ్యాక్టీరియా

**లక్నో:** ప్రయాగ్‌రాజ్‌లోని నదీ జలాలు స్నానానికి పనికిరావని, స్థాయికి మించి కోలీఫామ్ బ్యాక్టీరియా ఉందని కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి (సెంట్రల్ పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్-సీపీసీబీ) జాతీయ హరిత ట్రిబ్యునల్ (నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్-ఎన్‌జీటీ) కు సమర్పించిన నివేదిక ఆందోళన కలిగిస్తోంది. ప్రయాగ్‌రాజ్‌లోని వివిధ ప్రదేశాల్లో నదీ జలాలు కలుషితమ య్యాయని.. ఆ నీళ్లలో మానవ, జంతు మల సంబంధమైన కోలీఫామ్ బ్యాక్టీరియా విపరీ తంగా పెరిగిపోయిందని, దాంతో ప్రయాగ్‌రాజ్ ప్రాంతంలోని గంగా, యమునా నదీ జలాల్లో స్నానాలకు కావాల్సిన ప్రమాణాలు లేవని జీఎన్‌టీకి సమర్పించిన నివేదికలో సీపీసీబీ పేర్కొంది. మహాకుంభమేళా సందర్భంగా కోట్ల మంది భక్తులు పుణ్య స్నానాలకు తరలివస్తుం డటంతో జంతు, మానవ సంబంధ వ్యర్థాలు పెరిగిపోవడంతోనే కోలిఫామ్ బ్యాక్టీరియా స్థాయికి మించి పెరగడానికి కారణమవుతోందని ఎన్‌జీటీకి తెలిపింది. 100 మిల్లీలీటర్ల నీటిలో 2,500 కోలిఫామ్ బ్యాక్టీరియాలు ఉన్నా ఆ నీరు స్నానానికి యోగ్యమైనదేనని, అంతకు మించి ఉంటే చర్మ సంబంధ అనారోగ్యాలు తలెత్తుతాయని పేర్కొంది. ప్రయాగ్‌రాజ్‌లో గంగా, యమునా నదుల్లో మురుగు నీటిని, వ్యర్థాలను వదలకుండా నిరోధించాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌లపై జస్టిస్ ప్రకాశ్ శ్రీవాస్తవ, జస్టిస్ శ్రీధర్ అగర్వాల్, జస్టిస్ ఎ సెంథిల్ వేల్‌లతో కూడిన త్రిసభ్య ధర్మాసనం విచారణ చేపట్టింది. ఈ నెల 3న సీపీసీబీ సమర్పించిన నివేదికను పరిశీలించిన ఎన్‌జీటీ బెంచ్... కాలుష్యాన్ని నియంత్రించడంలో ఉత్తరప్రదేశ్ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు విఫలమైందని వ్యాఖ్యానించింది. తదుపరి విచారణను బుధవారానికి వాయిదా వేశారు.

# ఫాల్కన్ సంస్థ మోసాలు

### రూ. 870 కోట్లు లూటీ...

**హైదరాబాద్:** దేశంలో మరో కుంభకోణం వెలుగులోకి వచ్చింది. పోంజీ పేరుతో తక్కువ సమయంలో పెట్టుబడులు పెట్టడం ద్వారా ఎక్కువ మొత్తాలు పొందవచ్చని అనేక మందిని మభ్యపెట్టారు. ఈ క్రమంలో ఓ సంస్థ వేలాది మందిని మోసం చేసి దాదాపు రూ.1,700 కోట్లు వసూలు చేసింది. తాజాగా ఈ కేసు గురించి సంచలన విషయాలు వెలుగులోకి వచ్చాయి. ఫాల్కన్ ఇన్‌వాయిస్ డిస్కౌంటింగ్ అనే సంస్థ అమెజాన్, బ్రిటానియా వంటి ప్రముఖ కంపెనీలతో డిపాజిటర్లతో సంబంధం ఉందని చెప్పి... 22 శాతం వరకు రాబడి ఇస్తామని హామీ ఇచ్చారు. 2021 నుంచి ఫాల్కన్ సంస్థ దాదాపు 7 వేలమంది పెట్టుబడిదారుల నుంచి రూ.1,700 కోట్లు వసూలు చేసింది. ఈ మొత్తం నుంచి కేవలం సగం మాత్రమే తిరిగి వసూలు చేసినట్లు తెలంగాణ పోలీసులు తెలిపారు. ఈ కేసులో ఇంకా దాదాపు 100 మిలియన్ డాలర్లు తిరిగి పొందేందుకు ప్రయత్నిస్తున్నట్లు చెప్పారు. ఈ సంస్థ అధిక రాబడి ఇస్తామని అనేక మందికి హామీ ఇచ్చి మోసగించినట్లు వెల్లడించారు. ఈ విషయాన్ని పోలీసు అధికారులతోపాటు బాధితులు కూడా మీడియాకు తెలియజేశారు. ఈ కేసు విషయంలో పోలీసులు శనివారం ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేశారు. న్యూదిల్లీకి చెందిన ఆభరణాల వ్యాపారి అంకిత్ బిహానీ గతవారం 50 మంది పెట్టుబడి దారులతో సమావేశమయ్యారు. వారు కోల్పోయిన రూ.500 కోట్లు తిరిగి పొందడానికి చట్టపరమైన పరిష్కారాల గురించి చర్చించారు. వారిలో ఎక్కువ మంది సోషల్ మీడియా ద్వారా పెట్టుబడి గురించి తెలుసుకుని అందులో డబ్బు పెట్టినట్లు బిహానీ తెలిపారు. తాను కష్టపడి సంపాదించిన డబ్బు, ఇప్పుడు ఎలా తిరిగి పొందాలో అర్థం కావడం లేదని 15 మిలియన్లు కోల్పోయిన టెక్ ఉద్యోగి రూపేష్ చౌహాన్ అన్నారు. ఇలా అనేక మంది వారి సంపదను కోల్పోయారు. ఇటీవల సోషల్ మీడియా గ్రూపుల్లో నకిలీ పెట్టుబడి పథకాల పేరుతో ప్రజలను మోసం చేసే ఘటనలు పెరుగుతున్నాయి. వీటిలో మోసపోతున్న వారిలో అనేక మంది విద్యావంతులే ఉండటం విశేషం. ఈ మోసాలకు ప్రధాన కారణం అనేక రకాల యాప్స్, వెబ్‌సైట్‌లు, కాల్ సెంటర్‌లు కారణమ వుతున్నాయని ఫిర్యాదులు వస్తున్నాయి. ఈ ఘటన నేపథ్యంలో మోసపూరిత పథకాలపై అవగాహన లేకుండా పెట్టుబడులు చేయకూడదని నిపుణులు సూచిస్తున్నారు. ఫాల్కన్ సంస్థ కొత్త పెట్టుబడుల నుంచి వచ్చిన డబ్బును పాత పెట్టుబడులకు ఉపయోగించింది. మిగిలిన నిధులను వివిధ షెల్ సంస్థలకు మళ్లించిందని పోలీసులు తెలిపారు. ఫాల్కన్ వ్యవస్థాపకుడు, ప్రధాన నిందితుడు అమర్‌దీప్ కుమార్ కోసం పోలీసులు గాలిస్తున్నారు.

# 'రాజీవ్' చుట్టూ వివాదాలు

**నూదిల్లీ:** కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ (సీఈసీ)గా పదవీ విరమణ చేసిన రాజీవ్‌కుమార్ తన హయాంలో అనేక వివాదాలకు కేంద్ర బిందువయ్యారు. లోక్‌సభ ఎన్నికలు సహా కొన్ని కీలక రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల సమయంలో రాజీవ్‌కుమార్ పక్షపాత ధోరణితో వ్యవహరించారన్న విమర్శలొచ్చాయి. ముఖ్యంగా కీలక ఎన్నికల సమయాల్లో అధికార బీజేపీకి మేలు జరిగేలా వ్యవహరించారని ప్రతిపక్షాలు అనేక సందర్భాల్లో ఆయనపై ఆరోపణలు చేశాయి. దీంతో రాజీవ్‌కుమార్ హయాంలో ఎన్నికల కమిషన్(ఈసీ) స్వయం ప్రతిపత్తిపై అనుమానాలు తలెత్తాయి. ఎన్నికలప్పుడు పశ్చిమబెంగాల్ లాంటి రాష్ట్రాల్లో ఎన్నికల హింసను అదుపు చేయడంలో విఫలమయ్యారన్న అపఖ్యాతిని రాజీవ్‌కుమార్ మూటకట్టుకున్నారు. ముఖ్యంగా ఎన్నికల్లో ఈవీఎంల వాడకంపై చర్చ జరుగుతున్న వేళ రాజీవ్‌కుమార్ ఈవీఎంలు, వీవీప్యాట్‌లను మీడియా ఎదుటే ఏకపక్షంగా సమర్థించడం ప్రతిపక్షాల ఆగ్రహానికి కారణమైంది. రాజీవ్‌కుమార్ హయాంలో ఎన్నికైన కొంతమంది ప్రజాప్రతినిధులపై అనర్హత వేటు పడ్డ టైమింగ్ వివాదాస్పదమైంది. సీఈసీగా వీడ్కోలు వేళ రాజీవ్‌కుమార్ వ్యాఖ్యలు చర్చనీయాంశమయ్యాయి. ఎన్నికల కమిషన్ చుట్టూ అలుముకున్న వివాదాలపై మీడియా దృష్టి ఎక్కువైందని, ఇలాంటి తరుణంలో ఎన్నికల కమిషన్ తన హుందాతనాన్ని కాపాడుకోవాల్సిన అవసరం ఉందని రాజీవ్‌కుమార్ అనడం చర్చకు దారి తీసింది. మొత్తంగా ప్రధాన ఎన్నికల కమిషనర్‌గా రాజీవ్‌కుమార్ హయాంలో ఎన్నికల కమిషన్‌తో పాటు ఎన్నికల ప్రక్రియ విశ్వసనీయతపై దేశంతో పాటు ప్రపంచ వ్యాప్తంగా తీవ్ర చర్చ జరిగింది. సాధారణ ప్రక్రియలో భాగంగా రాజీవ్‌కుమార్ పదవీ విరమణ చేసినప్పటికీ దేశంలో ఎన్నికల కమిషన్, ఎన్నికల నిర్వహణపై తలెత్తిన అనుమానాలు ఇప్పటికీ అలాగే ఉన్నాయి.

### ముగింపు దశకు కుంభమేళా

# విమాన చార్జీల మోత

**ప్రయాగ్‌రాజ్:** కుంభమేళా ముగింపు దశకు చేరుకుంది. ఈ నెల 26న శివరాత్రితో ముగియనున్నది. దీంతో పెద్ద సంఖ్యలో భక్తులు ప్రయాగ్‌రాజ్ చేరుకుంటున్నారు. ఇప్పటికే 50కోట్ల మందికిపైగా భక్తులు త్రివేణీ సంగమంలో స్నానాలు ఆచరించారు. కుంభమేళా ముగింపునకు రైళ్లు, బస్సులు, ప్రత్యేక వాహనాల ద్వారా పెద్ద సంఖ్యలో జనం ప్రయాగ్‌రాజ్ చేరుకుంటున్నారు. అదే సమయంలో విమాన మార్గంలోనూ పెద్ద సంఖ్యలోనే భక్తులు తరలివస్తున్నారు. ఇప్పటికే ప్రయాగ్‌రాజ్ వెళ్లే విమానాల్లో టికెట్ల ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. తాజాగా విమాన చార్జీలు మరింత పెరుగుతున్నాయి. విమానాల రాకపోకల సంఖ్య సైతం భారీగానే పెరిగింది. మహా కుంభమేళా సమయంలో దిల్లీ నుంచి రూ.13 వేలకు తక్కువ కాకుండా చార్జీ ఉండగా... కొన్ని తేదీల్లో రూ.20 వేలకుపైగా ధర పలికింది. రెండురోజులుగా ప్రయాగ్‌రాజ్ విమానాశ్రయం నుంచి నడిచే విమానాల సంఖ్య వంద మార్క్‌ను దాటింది. చాలా నగరాల నుంచి నేరుగా విమాన సర్వీసులు నడుస్తున్నప్పటికీ చార్జీలు ఏమాత్రం తగ్గడం లేదు. చార్జీలు అధికంగా ఉన్నా... సీట్లు దొరకడం లేదు. మంగళవారం (ఫిబ్రవరి 18) రోజున ప్రయాగ్‌రాజ్ నుంచి బెంగళూరు ప్రయాణానికి ఓ ప్రైవేట్ ఎయిర్‌లైన్ కంపెనీ ఒక్కొక్కరికి రూ.39,146 వసూలు చేసింది. కుంభమేళా సమయంలో బెంగళూరుకు రూ.22వేల వరకు వసూలు చేస్తుండేవారు. తాజాగా కంపెనీలు భారీగా పెంచేశాయి. ముంబై వెళ్లే విమానాల్లో టికెట్ల ధర ఇలాగే ఉంది. మంగళవారం ప్రయాగ్‌రాజ్ నుంచి ముంబైకి ఏడు విమానాలు నడుస్తుండగా... రూ.20 వేలకుపైగా వసూలు చేశాయి. సోమవారం కనీసం రూ.21,974 వసూలు చేశాయి. మహారాష్ట్రలోని పూణేకు సైతం విమాన చార్జీలు రూ.20 వేలకు తక్కువగా లేవు. హైదరాబాద్ నుంచి ప్రయాగ్‌రాజ్‌కు రూ.28 వేల నుంచి రూ.32 వేలు, ప్రయాగ్‌రాజ్ నుంచి హైదరాబాద్‌కు రూ.33 వేల వరకు ధర పలుకుతున్నది. కోల్‌కతా, భువనేశ్వర్ తదితర ప్రాంతాలకు నడిచే విమానాల్లోనూ టికెట్ల ధరలు ఇదే తరహాలో ఉన్నాయి. విమానయాన సంస్థలు ప్రయాణికుల నుంచి భారీగానే దండుకుంటున్నాయి. విశేషమేంటంటే.. స్పైస్‌జెట్, ఎయిర్ ఇండియా తదితర విమానయాన సంస్థలు ఫిబ్రవరి 28 వరకు విమానాలు నడిపేందుకు షెడ్యూల్ చేశాయి. ప్రస్తుతం ప్రయాగ్‌రాజ్ నుంచి జైపూర్, గువహతి, కోల్‌కతా, భువనేశ్వర్, దిల్లీ, డెహ్రాడూన్, రాయపూర్, బిలాస్‌పూర్, పూణే, ముంబై, బెంగళూరు, చెన్నై, అహ్మదాబాద్, హైదరాబాద్, చండీగఢ్, లక్నోకు నేరుగా విమానాలు నడుస్తు న్నాయి. తాజాగా ఇండిగో ఎయిర్‌లైన్ కంపెనీ ప్రయాగ్‌రాజ్ నుంచి పూణేకు నేరుగా విమానాన్ని ప్రారంభించింది. ఈ విమానం 11.10 గంటలకు బయలు దేరి... మధ్యాహ్నం 1.10 గంటలకు పూణే చేరుకుంటుంది. తిరిగి మధ్యాహ్నం 2 గంటలకు బయలుదేరి... సాయంత్రం 4.10 గంటలకు ప్రయాగ్‌రాజ్ చేరుతుంది. అదే సమయంలో ప్రయాగ్‌రాజ్ నుంచి రాంచీకి డైరెక్ట్ విమానం నడిపేందుకు ఏర్పాట్లు చేస్తున్నది.

# నీ తీరుతో సమాజం తల దించుకుంటోంది

### యూట్యూబర్‌పై సుప్రీంకోర్టు ఆగ్రహం

**న్యూదిల్లీ:** యూట్యూబర్ రణ్‌వీర్ అల్లాబదియాపై సుప్రీంకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. యూట్యూబ్ షోలో అతడు వాడిన భాషను అత్యున్నత న్యాయస్థానం తప్పుపట్టింది. సమాజానికి కొన్ని విలువలు ఉన్నాయని కోర్టు పేర్కొంది. అల్లాబదియా మెదడులో చెడు ఆలోచనలు ఉన్నాయని, వాటిని అతడు యూట్యూబ్ షోలో కక్కేశాడని స్పష్టం చేసింది. జస్టిస్ సూర్యకంత్, జస్టిస్ కోటీశ్వర్ సింగ్‌లతో కూడిన ధర్మాసనం మంగళవారం పైవిధంగా వ్యాఖ్యలు చేసింది. సమాజానికి ఉన్న విలువలు, వాటి పరిమితులు నీకు తెలుసా అని కోర్టు అతడిని ప్రశ్నించింది. సమాజానికి కొన్ని విలువలు ఉన్నాయని, వాటిని గౌరవించడం నేర్చుకోవాలని చెప్పింది. భావస్వేచ్ఛ పేరుతో... ఇష్టం వచ్చినట్లు మాట్లాడడం సరికాదు అని కోర్టు తెలిపింది. సమాజ విలువలకు వ్యతిరేకంగా మాట్లాడే లైసెన్స్ ఎవరికీ లేదని పేర్కొంది. నీవు మాట్లాడిన తీరుతో కూతుళ్లు, సోదరీమణులు, పేరెంట్స్, సమాజం సిగ్గుతో తలదించుకుంటోందని అల్లాబదియాపై సుప్రీంకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. నువ్వు మాట్లాడిన మాటలు అసభ్యం, అశ్లీలం కాదా, ఎందుకు నీపై నమోదు అయిన ఎఫ్ఐఆర్‌లను ఒక్కటి చేయాలి, వాటిని ఎందుకు కొట్టివేయాలని సుప్రీంకోర్టు తీవ్ర స్థాయిలో యూట్యూబర్‌పై ప్రశ్నల వర్షం కురిపిం చింది. పాపులారిటీ కోసం ఇలాంటి వ్యాఖ్యలు చేస్తే, అప్పుడు నిన్న చూసి జనం పబ్లిసిటీ కోసం ఇతరులను బెదిరించే అవకాశం ఉందని చెప్పింది. ఓ యూట్యూబ్ షోలో... పేరెంట్స్ సెక్స్ గురించి రణ్‌వీర్ అల్లాబదియా జుగుప్సాకరమైన వ్యాఖ్యలు చేయడంతో అతడిపై సోషల్ మీడియాలో తీవ్ర విమర్శలు వస్తున్నాయి. అతడికి కానీ, అతడి కుటుంబానికి కానీ ప్రాణహాని బెదిరింపులు వస్తే, అప్పుడు పోలీసులను ఆశ్రయించవచ్చు అని కోర్టు చెప్పింది. అల్లాబదియాపై కొత్తగా ఎటువంటి కేసులు నమోదు చేయవద్దు అని కోర్టు స్పష్టం చేసింది.

# ఎస్ఎంఎఫ్‌జీ ఇండియా క్రెడిట్ గిన్నిస్ వరల్డ్ రికార్డ్

**విశాలాంధ్ర-కడప:** భారతదేశంలోని ఆరు వేదికలలో 517 మంది అభ్యర్థులు పాల్గొనగా 'అతిపెద్ద పశువుల సంక్షేమ పాఠం (బహుళ వేదికలు)' కోసం ఎస్ఎంఎఫ్‌జీ ఇండియా క్రెడిట్ గిన్నిస్ వరల్డ్ రికార్డు సాధించడం ద్వారా చరిత్ర సృష్టించిందని సంస్థ ప్రతినిధులు ఓ ప్రకటనలో తెలిపారు. భారతదేశంలో, గ్రామీణ ప్రాంత జనాభాలో దాదాపు 65-70 శాతం మంది తమ జీవనోపాధి కోసం వ్యవసాయం లేదా వ్యవసాయ సంబంధిత కార్యకలాపాలపై ఆధారపడుతున్నారన్నారు. అందువల్ల, వారి జీవనోపాధి ఉత్పత్తి కార్యకలాపాలు ఆర్థిక శ్రేయస్సులో పశువులు కీలక పాత్ర పోషిస్తాయన్నారు. ఈ విడదీయరాని బంధాన్ని గుర్తించి... ఎస్ఎంఎఫ్‌జీ ఇండియా క్రెడిట్ 7వ ఎడిషన్ పశు వికాస్ దినోత్సవాన్ని 'మేరా పశు మేరా పరివార్' జరుపుకుందని స్పష్టం చేశారు. ఇది గ్రామీణ కుటుంబాల జీవితాల్లో పశువుల ప్రాముఖ్యతను పునరుద్ఘాటించిందన్నారు. ఎస్ఎంఎఫ్‌జీ ఇండియా క్రెడిట్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్, మేనేజింగ్ డైరెక్టర్ శంతను మిత్రా మాట్లాడుతూ ఎస్ఎంఎఫ్‌జీ ఇండియా క్రెడిట్‌లో, అర్థవంతమైన ప్రభావాన్ని సృష్టించే సామాజిక కార్యక్రమాలను ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. ఎస్ఎంఎఫ్‌జీ ఇండియా క్రెడిట్ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ స్వామినాథన్ సుబ్రమణియన్ మాట్లాడుతూ పశు వికాస్ దినోత్సవాన్ని వరల్డ్ రికార్డ్స్ యూనియన్, లిమ్కా బుక్ ఆఫ్ రికార్డ్స్, బెస్ట్ ఆఫ్ ఇండియా రికార్డ్స్ వరల్డ్ బుక్స్ ఆఫ్ రికార్డ్స్ కూడా గుర్తించాయన్నారు.

**విశాలాంధ్ర హైదరాబాద్**

# తాగునీటి స్థిరీకరణకు నిధులు మంజూరు చేయండి

### కేంద్ర జలశక్తి సదస్సులో రాష్ట్ర అవసరాలపై మంత్రి సీతక్క ప్రజెంటేషన్

**విశాలాంధ్ర - హైదరాబాద్ :** తెలంగాణలోని తాగునీటి వ్యవస్థ స్థిరీకరణ కోసం అవసరమైన నిధులు మంజూరు చేయాలని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ దనసరి అనసూయ సీతక్క కేంద్ర ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు. తెలంగాణ తాగునీటి అవసరాలు తీర్చేందుకు నీతి ఆయోగ్ గతంలో సిఫార్సు చేసిన విధంగా కనీసం రూ.16 వేల కోట్లను మంజూరు చేయాలని కోరారు. ప్రతి ఏటా తాగు నీటి అవసరాల కోసం తెలంగాణ ప్రభుత్వం సుమారు రూ.5 వేల కోట్లను వెచ్చిస్తుందని గుర్తు చేశారు. కేంద్ర జలశక్తి మంత్రిత్వ శాఖ ఆద్వర్యంలో రాజస్థాన్‌లోని ఉదయ్‌పూర్‌లో రెండు రోజుల పాటు జరుగుతున్న అన్ని రాష్ట్రాల తాగు, సాగునీటి పారుదలశాఖ మంత్రుల రెండో సదస్సులో మంత్రి సీతక్క మంగళవారం పాల్గొని ప్రసంగించారు. కేంద్ర జలశక్తి శాఖమంత్రి సీఆర్ పాటిల్, పలు రాష్ట్రాల ముఖ్యమంత్రులు, అన్ని రాష్ట్రాల మంత్రులు పాల్గోన్న సదస్సులో, తెలంగాణ అమలవుతున్న మిషన్ భగీరథ, ఇతర తాగునీటి పథకాలను వివరించడంతో పాటు రాష్ట్ర అవసరాలపై ప్రజెంటేషన్ ఇచ్చారు. దేశ స్వాతంత్రం నుంచి నేటి వరకు దేశంలో, తెలంగాణ ప్రాంతంలో తాగునీటి సరఫరా కోసం ఆయా ప్రభుత్వాలు చేపట్టిన చర్యలను మంత్రి సీతక్క ప్రస్తావించారు. మారిన జీవన పరిస్థితులు, ప్రజల అవసరాల నేపథ్యంలో ఊరుమ్మడి బావి నుంచి ఇంటింటికి నల్లా ఏర్పాటు వరకు సాధించిన పురోగతిని వివరించారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వేయి కోట్ల ఖర్చుతో చేపట్టిన మిషన్ భగీరథ పనుల వివరాలను ప్రస్తావించారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ నీరు కేవలం ఒక వనరు మాత్రమే కాదని, అది మానవాళి మనుగడకు జీవనాధారమని పేర్కొన్నారు. స్వచ్ఛమైన, సురక్షితమైన తాగు నీటిని పొందడం ప్రజల ప్రాథమిక రాజ్యాంగ హక్కు అని, ఆ హక్కుని కాపాడాల్సిన భాద్యత ప్రభుత్వాలదే అన్నారు. వేగంగా మారుతున్న వాతావరణ పరిస్థితులు, పెరుగుతున్న అవసరాల నేపథ్యంలో తాగు నీటి కొరతను తీర్చేందుకు రాష్ట్రాలు, కేంద్ర ప్రభుత్వం సమన్వయంతో పనిచేయాలని సూచించారు. గ్రామీణ తాగునీటి సరఫరాను పెంపొందించడంలో పంచవర్ష ప్రణాళికలు ఎంతో దోహద పడ్డాయని మంత్రి సీతక్క గుర్తు చేశారు. కేంద్రంలో గత ప్రభుత్వాలు ముందు చూపుతో వ్యవహరించడం వల్ల 1980 నాటికే 83 శాతం గ్రామీణ ప్రాంతాలకు కనీసం ఒక తాగునీటి వనరు అందుబాటులోకి వచ్చిందని పేర్కొన్నారు. రాజీవ్ గాంధీ నేషనల్ డ్రింకింగ్ వాటర్ మిషన్, నేషనల్ రూరల్ డ్రింకింగ్ వాటర్ ప్రోగ్రాం వంటి కార్యక్రమాలు సురక్షితమైన మంచినీటిని అందించడానికి కృషి చేసాయని తెలిపారు. దానికి కొనసాగింపుగా కేంద్ర ప్రభుత్వం జల్ జీవన్ మిషన్ ద్వారా ఇంటింటి నల్లా నీళ్లిచ్చే పథకాన్ని అమలు పరుస్తోందన్నారు. ప్రతి వ్యక్తికి సురక్షిత మంచి నీరు అందించే లక్ష్యంతో తెలంగాణ ప్రాంతంలో గ్రామీణ నీటి సరఫరా వ్యవస్థను వేల కోట్ల ఖర్చుతో అప్పటి ప్రభుత్వాలు బలోపేతం చేశాయని గుర్తు చేశారు సీతక్క. ఇందులో బాగంగా 1,59,312 చేతి పంపులను, 14,054 సింగిల్ విలేజ్ స్కీమ్‌లు, 149 మల్టీ విలేజ్ స్కీమ్‌లు, వేలాది పైప్డ్ వాటర్ సప్లై స్కీంలు, ఓవర్ హెడ్ ట్యాంకులు, లక్షలాది నల్లా కనెక్షన్లతో ప్రజల తాగు నీటి అవసరాలు తీర్చాయన్నారు. అయితే గతంలో ఉన్న తాగు నీటి సరఫరా పథకాలు, మౌలిక సదుపాయాలను అనుసంధానం చేస్తూ ప్రతి మనిషికి రోజుకు సగటున వంద లీటర్ల నీటిని సరఫరా చేసే లక్ష్యంతో మిషన్ భగీరథ పథకం 2016లో మొదలయ్యిందని చెప్పారు. రూ.28 వేల కోట్ల రుణాలతో ప్రారంభమైన మిషన్ భగీరథ పథకంలో ఉన్న లోపాలను సరిదిద్ది, మరింత పటిష్ట పరిచేందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందని తెలిపారు. మరీ ముఖ్యంగా తమ ప్రభుత్వం తాగునీటి స్థిరీకరణ లక్ష్యంగా పనిచేస్తుందన్నారు.

సుదూర ప్రాంతాల నుంచి నీటిని సరఫరా చేసే క్రమంలో కొన్నిసార్లు సమస్యలు తలెత్తుతున్నాయని, ఆయా రిజర్వయర్లలో నీటి కొరత తలెత్తినప్పుడు మిషన్ భగీరథ వ్యవస్థ నిరూపయోగంగా మారే ప్రమాదం ఉందన్నారు.

## విద్యా విధానం మెరుగుపరచడమే ప్రభుత్వ ఉద్దేశం

**విశాలాంధ్ర - హైదరాబాద్ :** గత ప్రభుత్వం అలసత్వం వల్ల విద్యా వ్యవస్థ కుంటుపడిందని, ప్రభుత్వం విద్యా వ్యవస్థను మెరుగుపరిచేందుకే విద్యా కమిషన్‌ను ఏర్పాటు చేసిందని తెలంగాణ రాష్ట్ర విద్యా కమిషన్ చైర్ పర్సన్ ఆకునూరి మురళి అన్నారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో విద్యా విధానంపై ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాల, జూనియర్ కళాశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు పేరెంట్స్, ఎన్జీవోలు, ఎంఈఓలతో పబ్లిక్ హియరింగ్ నిర్వహించి విద్యా విధానంపై వారి సూచనలు, అభిప్రాయాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మానవ అభివృద్ధిలో ప్రపంచంలో మన దేశం 136 స్థానంలో ఉందని విద్యాభివృద్ధి చేస్తే తప్ప ముందుకు వెళ్లలేమని ఆయన తెలిపారు. రాష్ట్ర విద్యా కమిషన్ ఏర్పడిన తర్వాత తాను దాదాపు 260 విద్యా సంస్థలను పర్యటించి ప్రభుత్వ పాఠశాలలు, జూనియర్ కళాశాలలు, గురుకులాలలో అందరి సలహాలు అభిప్రాయాలను తీసుకున్నామని చెప్పారు. గత ప్రభుత్వ అలసత్వం వల్ల విద్య వ్యవస్థ ఉంటూ పడిందని, విద్యా వ్యవస్థను మెరుగుపరచాలని ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం విద్యా కమిషన్‌ను ఏర్పాటు చేసిందన్నారు. తాను, కమిషన్ సభ్యులు నిరంతరం కృషి ఉన్నామని ఒక మంచి విద్యా వ్యవస్థను తీసుకువచ్చి మంచి భవిష్యత్తును నిర్మించడానికి అందరం కలిసి ప్రయత్నం చేద్దామని అన్నారు. జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ రాష్ట్రంలో ఎడ్యుకేషన్ ఫౌండేషన్ లిటరసీ, విద్యా ప్రమాణాలు పెరగాలి అన్నారు. ప్రాథమిక నైపుణ్యాలు, చదవడం రాయడం మెరుగుపడాలన్నారు. జిల్లాలో అమ్మ ఆదర్శ పాఠశాలలో భాగంగా కోట్లాది రూపాయలు వెచ్చించి పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పించడం జరిగిందన్నారు. పాఠశాలల్లో ఏమైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని, సలహాలు సూచనలు ఇవ్వాలని విద్యా వ్యవస్థ బలోపేతం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కమిషన్ సభ్యులు ప్రొఫెసర్ పిఎల్ విశ్వేశ్వరరావు, డాక్టర్ చారకొండ వెంకటేష్, కె.జోష్ణ శివారెడ్డి, అదనపు కలెక్టర్ డాక్టర్ జి.ముకుంద రెడ్డి, డీఈవో ఆర్.రోహిణి, డిఐఓ ఒడ్డెన్న, డిప్యూటీ ఈవోలు, డిప్యూటీ ఐఓఎస్‌లు జూనియర్ లెక్చరర్లు, ఉపాధ్యాయులు, ఎన్జీవోలు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## రంజాన్ మాసంలో నైట్ షాపింగ్ ఏర్పాటు చేయాలి

### ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి

**విశాలాంధ్ర - మల్కాజిగిరి :** తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో జిల్లా ఇంచార్జీ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ ఆధ్వర్యంలో జరిగిన రంజాన్‌పై సమీక్ష సమావేశంలో మల్కాజిగిరి నియోజకవర్గ పరిధిలోని అన్ని మసీదులకు సంబంధించిన సదర్ల (ప్రెసిడెంట్)తో కలిసి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి పాల్గొన్నారు. ఈ నెలాఖరున ప్రారంభం కానున్న పవిత్ర రంజాన్ మాసంలో ఉపవాస దీక్ష చేసే ముస్లిం సోదరులకు ఇబ్బందులు కలగకుండా మసీదుల వద్ద తీసుకోవలసిన జాగ్రత్తలు, ఏర్పాటు చేయవలసిన సదుపాయాలు, ఇతర అంశాలపై నిర్వహించిన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ పవిత్ర రంజాన్ మాసంలో ముస్లిం సోదరుల కుటుంబాలు ఉపవాస దీక్షలు చేసే సమయంలో మంచినీటి సరఫరా, విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగకుండా అధికారులు కృషి చేయాలని, శానిటేషన్ సిబ్బంది రంజాన్ మాసంలో ప్రణాళిక బద్ధంగా పని చేయాలని కోరారు. పాత బస్తీలో ఏర్పాటు చేసిన విధంగా రాత్రి సమయాల్లో షాపింగ్‌కు మల్కాజిగిరిలో కూడా సముదాయాలు ఏర్పాటు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మల్కాజిగిరి నియోజకవర్గ ముస్లిం పెద్దలు, మసీదుల సదర్లు పాల్గొన్నారు.

## ఆరోగ్య సేవలను సమర్థవంతంగా అమలు చేయాలి

**విశాలాంధ్ర బ్యూరో, మేడ్చల్-మల్కాజిగిరి :** మేడ్చల్ -మల్కాజిగిరి జిల్లా వైద్య, ఆరోగ్య అధికారి డాక్టర్ సీ.ఉమా గౌరి తన కార్యాలయంలో జిల్లాలో పని చేస్తున్న పలువురు డాక్టర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కీసర, మల్కాజిగిరి డివిజన్ డిప్యూటీ జిల్లా వైద్య, ఆరోగ్య అధికారులు, జిల్లా ఆరోగ్య కార్యక్రమ అధికారులు, మేడ్చల్ -మల్కాజిగిరి జిల్లాలో పని చేస్తున్న డిప్యూటీ సివిల్ సర్జన్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వం అందించే ఆరోగ్య సేవలను మరింత సమర్థవంతంగా అమలు చేయడానికి, ప్రజలకు మరింత చేరువ అయ్యేలా అవసరమైన సూచనలు డాక్టర్ ఉమా గౌరి అందించారు.

## సీసీ రోడ్డు పనులను ప్రారంభం

**విశాలాంధ్ర - మల్కాజిగిరి :** ఈస్ట్ ఆనంద్ బాగ్ డివిజన్ పరిధిలోని వసంతపురి కాలనీలో రూ.10 లక్షలతో సిసి రోడ్ నిర్మాణ పనులను కార్పోరేటర్ వై.ప్రేమ్ కుమార్ కాలనీవాసులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు తీసుకోనున్నట్లు ఆయన తెలిపారు. అభివృద్ధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలను తప్పక పాటించాలని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ముత్తు శ్రీనివాసన్, వెంకటేష్, సంతోష్, కిషోర్, శోభారాణి, యాదమ్మ, సోమయ్య, రాము, శిరీష, యాదగిరి, శకుంతల, రోస్ మేరీ, రెడ్డి, భాగ్యమ్మ, ప్రేమలత, తదితరులు పాల్గొన్నారు.

## భూసేకరణ పనులను సత్వరమే పూర్తి చేయాలి

### కమిషనర్ ఇలంబర్తి

**విశాలాంధ్ర - హైదరాబాద్ :** జాతీయ రహదారులు రోడ్డు భావనాల శాఖ ఆధ్వర్యంలో గోల్నాక నుండి అంబర్ పేట్ వరకు సుమారు రూ. 335 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టిన ఫ్లైఓవర్‌కు అసంపూర్తిగా ఉన్న భూసేకరణ పనులను సత్వరమే పూర్తి చేయాలని జిహెచ్ఎంసి కమిషనర్ ఇలంబర్తి అధికారులను ఆదేశించారు. మంగళవారం ఉదయం కమిషనర్ ఆర్ అండ్ బి జాతీయ రహదారి శాఖ యస్‌ఈ, జిహెచ్ఎంసి అడిషనల్ జోనల్, ఇంజనీరింగ్ అధికారులతో కలిసి ఫ్లైఓవర్‌కు సంబంధించి అసంపూర్తిగా ఉన్న భూసేకరణ పనులను పరిశీలించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఎస్‌ఈ ధర్మారెడ్డి మాట్లాడుతూ ఫ్లైఓవర్‌కు సంబంధించిన సివిల్ పనులు పూర్తయ్యాయని సర్వీస్ రోడ్డు వేసేందుకు వివిధ ప్రాంతాల్లో భూసేకరణ ప్రక్రియ పూర్తి చేసిన తర్వాత పనులను కొనసాగించడం జరుగుతుందని ఈ సందర్భంగా కమిషనర్‌కు వివరించారు. ఈ సందర్భంగా కమిషనర్ గోల్నాక నుండి అంబర్ పేట్ వరకు అక్కడక్కడ అసంపూర్తిగా ఉన్న భూసేకరణ పనులను పరిశీలించారు. అసంపూర్తిగా ఉన్న భూసేకరణ పనులను పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ పర్యటనలో భాగంగా ముస్లిం కమ్యూనిటీ పెద్దలు ఈ ప్రాంతంలో అభివృద్ధికి జరిగేందుకు సహకరించడం జరుగుతుందని అధికారులకు పూర్తి సహకారం అందిస్తానని కమిషనర్‌కు వివరించారు. కొన్ని స్ట్రెచెస్‌ల నిర్మాణానికి కోర్టు అనుమతి ఇచ్చిన నేపథ్యంలో అట్టి పనులను కొనసాగించాలని కమిషనర్ ఆర్ అండ్ బి అధికారులను ఆదేశించారు. వివిధ స్ట్రెచ్చేస్‌లలో అసంపూర్తిగా ఉన్న భూసేకరణ పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

కమిషనర్ వెంట జాతీయ రహదారులు ఆర్ అండ్ బి ఎస్.ఈ ధర్మారెడ్డి, అడిషనల్ కమిషనర్లు శివకుమార్ నాయుడు, రఘుప్రసాద్, జోనల్ కమిషనర్ రవి కిరణ్, డిసి దివాకర్, జోనల్ ఎస్ ఈ రత్నాకర్, టౌన్ ప్లానింగ్ ఏసిపి దివాకర్, ఈ.ఈ తదితరులు పాల్గొన్నారు.

## బీఈడీ కళాశాలను అభివృద్ధి చేస్తాం : ఎమ్మెల్యే యెన్నం

**విశాలాంధ్ర - హైదరాబాద్ :** బిఇడి కళాశాలను అన్ని విధాలా అభివృద్ధి చేస్తామని మహబూబ్ నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. రూ.2 లక్షలు ఎస్డిఎఫ్ నిధుల ద్వారా విద్యార్థులకు నూతనంగా నిర్మించిన శౌచాలయాలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. మన కళాశాలను, పాఠశాలలను అభివృద్ధి చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని, ప్రభుత్వ విద్యా సంస్థల్లో ఎస్సీ ఎస్టీ, బీసీ మైనారిటీ పేద విద్యార్థులు చదువుకుంటారని వారికి వీలైనంత వరకు సౌకర్యాలు కల్పించాలని అది మనందరి బాధ్యత అని ఆయన స్పష్టం చేశారు. ఈ కళాశాల అతి పురాతనమైనదని అందుకే త్వరలో కళాశాలలకు పూర్తిస్థాయిలో నూతన భవనాన్ని నిర్మించేందుకు ప్రణాళికలు అందించమని కళాశాల సిబ్బందికి సూచించారు. మహబూబ్‌నగర్‌ను ఎడ్యుకేషనల్ హబ్‌గా అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నామని, ఒక్క వ్యక్తితో అది సాధ్యం కాదు కాబట్టి, ప్రతి ఒక్కరు కూడా తమ వంతు సహాయ సహకారాలు అందించాలని ఆయన ఆదేశించారు. మహబూబ్‌నగర్ విద్యా నిధి పారదర్శకంగా అధికారుల పర్యవేక్షణలో నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. కళాశాల విద్యార్థులు, విద్యార్థినిలు అధ్యాపకులు ఎమ్మెల్యేని ఘనంగా సన్మానించారు. ప్రిన్సిపల్ ఎం గోవిందరాజులు, ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహ్మారెడ్డి, డిసిసి ప్రధాన కార్యదర్శి సిరాజ్ ఖాద్రీ, నాయకులు సుధాకర్ రెడ్డి, రామచంద్రయ్య, రాజు గౌడ్, మోయిజ్, ప్రవీణ్ కుమార్, ఇమ్రాన్ పాల్గొన్నారు.

**విద్యార్థుల నైపుణ్యాలను వెలికితీసే బృహత్తరమైన కార్యక్రమం...**

విద్యార్థులలో దాగిన నైపుణ్యాలను వెలికితీసే బృహత్తరమైన కార్యక్రమం సైన్స్ ఫెయిర్ అని మహబూబ్ నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. మహబూబ్ నగర్ పట్టణంలోని హీరా మాండల్ స్కూల్‌లో ఏర్పాటు చేసిన సైన్స్ ఫెయిర్‌కు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. అనంతరం విద్యార్థులు తయారు చేసిన కొత్త కొత్త ఆవిష్కరణలు ఆయన చూసి విద్యార్థులను అభినందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మహబూబ్‌నగర్‌లో ట్యాలెంట్‌కు కొదవే లేదన్నారు. రాబోయే రోజుల్లో మన మహబూబ్‌నగర్ నుంచే సైంటిస్టులు తయారు కావాలని ఆయన ఆకాంక్షించారు. అనంతరం సైన్స్ ఫెయిర్‌లో పాల్గొన్న విద్యార్థులకు ప్రశంసాపత్రాలను, మెడల్స్‌ను అందజేసి అభినందించారు. ఫరీస ఆర్.బాషది, మహ్మద్ హమ్మిద్ రయీస్, ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, డిసిసి ప్రధాన కార్యదర్శి సిరాజ్ ఖాద్రీ, పాలమూరు యూనివర్సిటీ రిజిస్ట్రార్ మధుసూదన్ రెడ్డి, నాయకులు ఫయాజ్, గులాం జహీర్, అజ్మత్ అలి, పీర్ మహ్మద్ సాదిక్, ప్రవీణ్ కుమార్, ఇమ్రాన్ ఖురేషీ పాల్గొన్నారు.

## కీసరగుట్ట బ్రహ్మోత్సవాలు వైభవంగా నిర్వహించాలి

**విశాలాంధ్ర బ్యూరో, మేడ్చల్-మల్కాజిగిరి :** మహాశివరాత్రి పర్వదినోత్సవాన్ని పురస్కరించుకొని మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కీసర మండలంలోని కీసర గుట్ట (కేసరగిరి క్షేత్రం) శ్రీరామలింగేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలను వైభోవేతంగా నిర్వహించాలని ఈ విషయంలో భక్తులకు అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించడంతో పాటు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టరు విజయేందర్ రెడ్డి అన్నారు. మంగళవారం మహాశివరాత్రి సందర్భంగా ఈనెల 24వ తేదీ నుంచి మార్చి 1వ తేదీ వరకు జరిగే బ్రహ్మోత్సవాలకు సంబంధించిన ఏర్పాట్లపై ఆలయంలోని కార్యాలయంలో ఆలయ చైర్మన్ నారాయణ శర్మ, ఆలయఈఓ సుధాకర్ రెడ్డి, జిల్లా అధికారులు, ఆలయ కమిటీతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందరరేగా అదనపు కలెక్టరు మాట్లాడుతూ బ్రహ్మోత్సవాలకు వచ్చేసే భక్తులకు ఏలాంటి అసౌకర్యం కలుగకుండా ఏర్పాట్లు పూర్తి చేయాలని అన్నారు. అధికారులందరు సమన్వయంతో పనిచేసి భక్తులకు సౌకర్యం కల్పించాలని సూచించారు. మహాశివరాత్రితో పాటు అంతకు ముందు, తర్వాత రోజుల్లో సైతం భక్తులు ఎక్కువగానే వస్తారని దీనిని దృష్టిలో ఉంచుకొని ఆలయ సిబ్బంది సైతం ఎక్కువ మందికి స్వామి వారి దర్శనం కలిగేలా చూడాల్సిందిగా సూచించారు. బ్రహ్మోత్సవాలకు వచ్చే భక్తులకు సౌకర్యవంతంగా ఉండేందుకు అవసరమైన ప్రత్యేక ఏర్పాట్లు చేయాల్సిందిగా తెలిపారు. కీసర గుట్ట బ్రహ్మోత్సవాల జాతరలో పూజ సామాగ్రి, ఆహార పదార్థాల నుంచి మొదలుకొని అన్ని రకాల వస్తువుల విక్రయానికి సంబంధించి ధరలు భక్తులకు అందుబాటులో ఉండేలా చూడాలని, ఎక్కువ ధరలకు విక్రయించకుండా అవసరమైన చర్యలు తీసుకోవాల్సిందిగా సంబంధిత శాఖ అధికారులు వ్యాపారులకు తెలపాలన్నారు. జాతర రోజుల్లో క్యూలైన్‌లను పెంచాలన్నారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు ఎక్కువగా వచ్చే అవకాశం ఉన్నందున ఆర్టీసీ ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేయాలని, అదే విధంగా వృద్దులకు, దివ్యాంగుల కోసం ఆటోలను అందుబాటులో ఉంచాలన్నారు. భద్రతా లోపం తలెత్తకుండా పోలీస్ శాఖ పటిష్ట బందోబస్తు నిర్వహించాలన్నారు. భక్తులకు అత్యవసర చికిత్సకై అవసరమైన వైద్య సిబ్బంది, మందులు అందుబాటులో ఉండాలన్నారు. బ్యారీకేడ్, దర్శనం క్యూ లైన్, పార్కింగ్కు ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని, ప్రస్తుతం ఎండలు పెరుగుతున్నాయని అందుకు జాతరలో భక్తులకు అందుబాటులో అవసరమైన అన్ని చోట్ల త్రాగునీటిని అందుబాటులో ఉంచాలని వాటర్ వర్క్స్ వారికీ తెలిపారు. జాతరలో పరిశుభ్రమైన వాతావరణం ఉండేలా చూడాలని అందుకు సంబంధించి ఎప్పటికప్పుడు శానిటేషన్ చేయాలని ఈ విషయంలో మున్సిపాలిటి అధికారు ఆలయ పరిసరాల్లో అగ్నిమాపక సిబ్బందితో పాటు ఫైరింజన్ను అందుబాటులో ఉంచాలని అదనపు కలెక్టర్ తెలిపారు. అలాగే గుట్ట కింద ఉన్నచెరువు దగ్గర గజఈతగాళ్లను అందుబాటులో ఉంచాలని మత్స్య శాఖ అధికారులకు సూచించారు. కీసర ఆలయంకు సంబంధించి ఏమైనా ఇబ్బందులు, సమస్యలు ఉన్నట్లయితే తన దృష్టికి తీసుకురావాలని ఆలయ ఈవో, చైర్మన్‌కు తెలిపారు. ఆన్లైన్ వెబ్సైట్ను అదనపు కలెక్టరు విజయేందర్ రెడ్డి ప్రారంభించారు. ఈ సమావేశంలో ఆర్డిఓ ఉపేందర్ రెడ్డి, పోలీసు, విద్యా, వైద్య, ఆర్ అండ్ బి, పంచాయతీరాజ్, ట్రాఫిక్, సమాచార, మత్స్య, ఫైర్, సంబంధిత శాఖ అధికారులు పాల్గొన్నారు.

### బీఆర్ఎస్‌ను గద్దె దించడంలో

## యూత్ కాంగ్రెస్ పోరాటం మరువలేనిది

**విశాలాంధ్ర - హైదరాబాద్ :** పదేళ్ల బీఆర్ఎస్ పాలనను గద్దె దించడంలో యూత్ కాంగ్రెస్ పోరాటం మరువలేనిదని, ఎంతోమంది కార్యకర్తలు లాఠీ దెబ్బలు తిని జైలుకు వెళ్లి వచ్చారని టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్, మాజీ ఎంపీ మధుయాష్కి గౌడ్ పేర్కొన్నారు. మహేశ్వరంలో మూడు రోజుల నుంచి జరుగుతున్న యూత్ కాంగ్రెస్ శిక్షణ శిబిరం ముగింపు వేడుకలకు మంగళవారం మధుయాష్కీ గౌడ్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మధుయాష్కీ యూత్ కాంగ్రెస్ ప్రతినిధులతో ఇంటరాక్ట్ అయ్యారు. వారు చెప్పిన ఇబ్బందులు, సమస్యలను విన్నారు. మధుయాష్కీ మాట్లాడుతూ దేశంలో మత ప్రాతిపదిక రాజకీయాలు చేస్తున్న బిజెపి, ఆర్ఎస్ఎస్‌లను నిలువరించే శక్తి యూత్ కాంగ్రెస్ కు ఉంది అన్నారు. యూత్ కాంగ్రెస్ లో మరింతగా యువతను భాగస్వామ్యం చేయాలని, యువత సమస్యల పట్ల స్పందిస్తూ పని చేస్తూ వారికి కాంగ్రెస్ భావజాలాన్ని వివరించాల్సిన అవసరం ఉందన్నారు. యూత్ కాంగ్రెస్‌కు ప్రభుత్వంలో సముచిత స్థానం కల్పించేందుకు తాను సీఎం రేవంత్ రెడ్డి, పిసిసి అధ్యక్షులు, ఇతర పెద్దలతోనూ మాట్లాడుతానన్నారు. పొలిటికల్ అఫైర్స్ కమిటీ లోనూ యూత్ కాంగ్రెస్కు ఇవ్వాల్సిన ప్రాధాన్యతపై చర్చిస్తానన్నారు. బీఆర్ఎస్ పాలనపై పోరాటంలో ఎంతోమంది కేసులు ఎదుర్కొంటున్నారని, వాళ్లందరికీ టిపిసిసి లీగల్ సెల్ ద్వారా న్యాయ సహాయం అందించే బాధ్యత తీసుకుంటానన్నారు. అంతేకాకుండా ప్రైవేట్ రంగంలో వివిధ సాఫ్ట్వేర్ కంపెనీలు రాష్ట్రంలో నెలకొల్పబడుతున్నాయని, యూత్ కాంగ్రెస్ నాయకులు చొరవ చూపి యూత్ కాంగ్రెస్ ప్రతినిధులకు ఉద్యోగాలు, ఉపాధి కల్పించేందుకు కృషి చేయాలని సూచించారు. యూత్ కాంగ్రెస్ కిందిస్థాయి నుంచి బలోపేతం చేయాలని, సోషల్ మీడియాను, టెక్నాలజీని సద్వినియోగం చేసుకొని యువతకు దగ్గర కావాలని సూచించారు. ఈ సందర్భంగా శిక్షణ పూర్తి చేసుకున్న వారందరికీ సర్టిఫికెట్లను అందజేశారు. కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ నేషనల్ ఇన్చార్జి సురభి దివేది, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షులు జక్కిడి శివచరణ్ రెడ్డి తదితరులు ఉన్నారు.

## యుజీడీ పనులకు శంకుస్థాపన

**విశాలాంధ్ర - శేరిలింగంపల్లి:** కొండాపూర్ డివిజన్ పరిధిలోని ఓయూ ప్రొఫెసర్స్ కాలనీలో రూ.75.00 లక్షల రూపాయల అంచనా వ్యయంతో నూతనంగా చేపట్టబోయే భూగర్భ డ్రైనేజి (యుజీడీ) పైప్ లైన్ నిర్మాణ పనులకు కార్పొరేటర్ హమీద్ పటేల్, జలమండలి అధికారులతో కలిసి ముఖ్యఅతిథిగా పాల్గొన్న పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ శంకుస్థాపన చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ భూగర్భ డ్రైనేజి సమస్య పరిష్కారమే ధ్యేయంగా ముందుకు వెళుతున్నామని, పలు కాలనీలలో ప్రజల నుండి వచ్చిన వినతి మేరకు, మా కార్పొరేటర్లు, మా దృష్టికి వచ్చిన సమస్యలను పరిగణలోకి తీసుకొని ప్రత్యేక చొరవతో శంకుస్థాపన చేసుకోవడం చాలా సంతోషకరమైన విషయం అని తెలియచేసారు. అత్యవసరం ఉన్న చోట, నిత్యం పొంగుతున్న ప్రాంతాలలో ప్రథమ ప్రాధాన్యతగా పనులు పూర్తి చేస్తామని తెలియచేశారు. ఏ చిన్న సమస్య అయిన నా దృష్టికి వచ్చిన తప్పకుండా పరిష్కరిస్తామని, కాలనీలలో మౌలిక వసతుల కల్పనకు ప్రథమ ప్రాధాన్యత ఇస్తూ, కాలనీలను అన్ని రంగాలలో అభివృద్ధి పథంలో ముందుకు తీసుకువెళుతు సమస్య రహిత ఆదర్శవంతమైన కాలనీలుగా తీర్చిదిద్దడమే నా ప్రథమ లక్ష్యం అని తెలియజేశారు. ఓయూ ప్రొఫెసర్స్ కాలనీలో గల ఎన్నో ఏండ్ల సమస్య నేటితో తిరునని, నిత్యం పొంగుతుండటం వలన కాలనీ వాసులు, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని వాటిని దృష్టిలో పెట్టుకొని యుజీడీ పైప్‌లైన్ నిర్మాణం పనులకు శంకుస్థాపన చేయడం జరిగినది అని, అదేవిధంగా మౌలిక వసతుల కల్పనకు పెద్ద పీట వేస్తామని, యుజీడీ వంటి అభివృద్ధి పనులను నాణ్యత ప్రమాణాలతో చేపట్టాలని, నాణ్యత విషయంలో ఎక్కడ రాజి పడకూడదని, ప్రజలకు స్వచ్ఛమైన, చక్కటి ఆహ్లాదకరమైన వాతావరణం కలిపిస్తామని గాంధీ చెప్పడం జరిగినది. పనుల్లో జాప్యం లేకుండా త్వరిత గతిన పనులు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని గాంధీ అధికారులను ఆదేశించడం జరిగినది. నియోజకవర్గ అభివృద్ధికి శాయశక్తులా కృషి చేస్తానని, అన్నివేళలా ప్రజలకు అందుబాటులోకి ఉంటానని, మెరుగైన ప్రజా జీవనానికి అన్ని రకాల మౌలిక వసతుల కల్పనకు తనవంతు కృషి చేస్తానని, నియోజకవర్గాన్ని ఆదర్శవంతమైన నియోజకవర్గంగా తీర్చిదిద్దుతానన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ మాణిక్యం, జనప్రియ నగర్ ఫేస్ 1 ప్రెసిడెంట్ జయసూర్య, మల్లికార్జున్, సుధాకర్, దాసు, ప్రవీణ్, శ్రీనివాస్, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

# రంజాన్ మాసంలో ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టండి

## మంత్రి పొన్నం ప్రభాకర్

విశాలాంధ్ర - హైదరాబాద్ : మార్చ్ రెండవ తేదీ నుండి ప్రారంభమయ్యే రంజాన్ మాసంలో చేయాల్సిన ఏర్పాట్ల పై డా. బిఆర్ అంబేద్కర్ సచివాలయంలో ఆరవ ఫ్లోర్ కాన్ఫరెన్స్ హాల్‌లో మైనారిటీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. సమీక్షా సమావేశంలో హైదరాబాద్ ఇన్చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. సమావేశంలో రంజాన్ మాసంలో తీసుకోవాల్సిన చర్యలపై దిశా నిర్దేశం చేశారు. జీహెచ్ఎంసీ రంజాన్ నెలలో నగరంలో పరిశుభ్రత విషయంలో ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని జీహెచ్ఎంసీ కమిషనర్ ఇలంబర్తి తెలిపారు. మసీదు, ఈద్గాల వద్ద ప్రత్యేక శానిటేషన్ బృందాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. వీధి దీపాలు మరమత్తులు, తాత్కాలిక లైట్‌ల ఏర్పాటు చేస్తామని జీహెచ్ ఎంసీ కమిషనర్ తెలిపారు. రోడ్ల మరమత్తులు పూర్తి చేస్తామని వెల్లడించారు. మక్కా మసీద్, రాయల్ మాస్క్, మిరాలం ఈద్గా వద్ద ప్రత్యేక చర్యలు చేపడుతున్నామన్నారు. యుద్ధ ప్రాతిపదికన పనులు చేస్తున్నామని పేర్కొన్నారు. రాత్రి సమయంలో దోమల నివారణకు జిహెచ్ఎంసి ఎంటమాలజీ టీం ద్వారా ఫాగింగ్ చేస్తున్నట్లు పేర్కొన్నారు. మసీదుల వద్ద ప్లాస్టిక్ కవర్‌ల పంపిణీ చేస్తున్నామన్నారు. అన్ని డిపార్ట్మెంట్స్ కలిపి ఒక కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసి ప్రత్యేక అధికారులను నియమించి సమన్వయం చేస్తున్నామని తెలిపారు. వాటర్ వర్క్ మసీదులు, ఈద్గాల వద్ద వాటర్ ప్యాకెట్స్‌లో ఏర్పాటు, తాగునీటి అవసరాల దృశ్య ప్రత్యేక ట్యాంకర్లు ఏర్పాటు, మసీద్‌లకు వెళ్లే దారిలో డ్రైనేజీల రిపేర్ పూర్తి చేస్తున్నామని వాటర్ వర్క్స్ ఎండి అశోక్ రెడ్డి తెలిపారు. వేసవికాలం దృశ్య విద్యుత్ డిమాండ్ పెరుగుతున్న నేపథ్యంలో రంజాన్ నెలలో మొబైల్ ట్రాన్స్ఫార్మర్లు ఏర్పాటు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. డిమాండ్ తగ్గ సప్లై ఉండేలా ఎప్పటికప్పుడు చర్యలు చేపడుతున్నామని వెల్లడించారు. మసీదుల వద్ద ఈద్గల వద్ద విద్యుత్ ఎమర్జెన్సీ సిబ్బంది 24 గంటలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. మసీదుల వద్ద టెంట్లు ఏర్పాటు చేయడంతో పాటు క్యూలైన్‌ల కోసం బారికేట్లు ఏర్పాటు చేయడానికి ఆర్ అండ్ బి విభాగం సిద్ధంగా ఉందని అధికారులు వెల్లడించారు. రంజాన్ నెల నేపథ్యంలో ప్రజలకు పాల ఇబ్బందులు లేకుండా ఉండడానికి అవసరాలకు తగిన పాలను సరఫరా చేస్తామని డైరీ అధికారులు తెలిపారు.

ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ జిహెచ్ఎంసి మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, మైనారిటీ వెల్ఫేర్ స్పెషల్ సెక్రటరీ తౌసిఫ్ ఇక్బాల్, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఫహీం ఖురేషి మైనార్టీ రెసిడెన్షియల్ ఇన్స్టిట్యూషన్స్ వైస్ చైర్మన్, వక్ఫ్ చైర్మన్ సయ్యద్ అజ్మతుల్లా హుస్సేనీ, హజ్ కమిటీ చైర్మన్ సయ్యద్ గులాం అఫ్జల్ బియబని, మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఓబెతుల్లా కొత్వాల్, మైనార్టీ కమిషన్ చైర్మన్ తారిఖ్ అన్సారీ, ఉర్దూ అకాడమీ చైర్మన్ తహర్బిన్ హందాన్, బీసీ కార్పొరేషన్ చైర్మన్ నూతి శ్రీకాంత్ గౌడ్, కమిషనర్ ఇలంబర్తి, హైదరాబాద్ కలెక్టర్ అనుదీప్ దురిషెట్టి, వాటర్ వర్క్స్ ఎండి అశోక్ రెడ్డి వివిధ అధికారులు పాల్గొన్నారు.

## కుల గణన సర్వే అందరికీ ఉపయోగపడాలి

విశాలాంధ్ర -శేరిలింగంపల్లి: ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో దేశంలోనే ప్రథమంగా బీసీ కుల గణన సర్వే మొదలుపెట్టి రికార్డ్ సృష్టిస్తూ విజయవంతంగా పూర్తి చేసిన సందర్భంగా శేర్లింగంపల్లి కాంగ్రెస్ పార్టీ వైస్ ప్రెసిడెంట్ కూన సత్యం గౌడ్, శేర్లింగంపల్లి కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ శిరీష సత్తూర్ తెలంగాణ రాష్ట్ర బీసీ సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ని మర్యాదపూర్వకంగా కలవడం జరిగింది. సమగ్ర కుల సర్వే నిర్వహించి, ఓబీసీల సాధికారత కోసం డేటాను ఉపయోగించాలనే చారిత్రాత్మక నిర్ణయం తీసుకున్నందుకు తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన కుల గణన కార్యక్రమం దేశానికి దిశా నిర్దేశం అన్నారు. ఈ సందర్భంగా శిరీష సత్తూర్ మాట్లాడుతూ ఓబీసీల సాధికారత, అభివృద్ధి కోసం, 42 శాతం రిజర్వేషన్లు చట్టబద్ధత కల్పించేందుకు చర్యలు తీసుకోవటానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో బాలాగౌడ్, కిషోర్ పాల్గొన్నారు.

## ప్రమాదాల నివారణకు అండర్ పాస్ మార్గాల ఏర్పాటు

విశాలాంధ్ర - షాద్ నగర్,రూరల్: రోడ్డు ప్రమాద నివారణకు అండర్ పాస్ మార్గాల ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జాతీయ రహదారి ఉన్న ప్రాంతాలలో కొత్తూరు, పెంజర్ల, మేక గూడా, చటాన్ పల్లి, బూర్గుల గ్రామాల పరిధిలో అండర్ పాస్ మార్గాల అవసరం ఉందన్నారు. అయితే ప్రస్తుతం కేశంపేట్, చటాన్ పల్లి మార్గాలను కలిపేలా ఒక అండర్ పాస్ నిర్మాణం జరుగుతుందన్నారు. బూర్గుల, రాయికల్ మార్గాలను కలిపేలా మరో అండర్పాస్ నిర్మాణం జరుగుతుందన్నారు. ఇక జహంగీర్ పేరు దర్గా, నందిగామ మధ్యన ఈ రెండు మార్గాలను కలిపేలా మరో అండర్పాస్ నిర్మాణం జరుగుతుందని స్పష్టం చేశారు. రూ.100 కోట్లతో ఈ పనులు చేపడుతున్నట్లు వెల్లడించారు. మార్చి చివరిలో గాని, ఏప్రిల్ మొదటి వారంలో గాని పనులు పూర్తవుతాయని వెల్లడించారు. త్వరలో మిగతా చోట్ల కూడా అండర్ పాస్ నిర్మాణాలు చేపడతామని వెల్లడించారు. టెండర్ ప్రక్రియ కూడా పూర్తయిందని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్ రెడ్డి, మాజీ జెడ్పిటిసి శ్యాంసుందర్ రెడ్డి, చెన్నయ్య, శివశంకర్ గౌడ్, తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

## ఆసుపత్రులు, ల్యాబ్‌లు, వైద్య సంస్థలన్నీ
# చట్టబద్ధంగా రిజిస్ట్రేషన్ చేయించుకోవాలి

### జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

విశాలాంధ్ర - హైదరాబాద్ : హైదరాబాద్ జిల్లాలో వైద్య సేవలు అందించే అన్ని ప్రైవేటు ఆసుపత్రులు, క్లినిక్‌లు, ల్యాబ్‌లు చట్టబద్ధంగా అర్హత కలిగిన డాక్టర్లు, రిజిస్ట్రేషన్ చేసుకొని చట్టపరమైన నిబంధనలు పాటించాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. మంగళవారం హరిహర కళాభవన్ సికింద్రాబాద్‌లో ప్రైవేటు ఆసుపత్రులు, అల్ట్రా సౌండ్ స్కానింగ్ సెంటర్లు, డయాగ్నస్టిక్ సెంటర్లు, ఫిజియోథెరపీ, ఎక్స్రే, స్పీచ్ థెరపీ మరియు ఆయుష్ క్లినిక్‌లు మెడికల్ డైరెక్టర్లు యజమానులకు నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ విధిగా అర్హత కలిగిన డాక్టర్లు మాత్రమే వైద్యం నిర్వహించాలని, అర్హతకు మించి వైద్యం చేయరాదని, రోగులకు సరియైన వసతులు సదుపాయాలు కల్పించాలని, అర్హత కలిగిన సిబ్బంది మాత్రమే సేవలు పరిచర్యలు చేయాలని, రోగుల నుండి అధిక ఫీజులు వసూలు చేయరాదని, ప్రతి సంవత్సరం తమ సర్వీసు రేట్లు సమర్పించాలని, వాటి ప్రకారమే ఫీజులు వసూలు చేయాలని, ప్రతి ఒక్కరూ క్లినికల్ ఎస్టాబ్లిష్మెంట్ యాక్ట్, పిసి పిఎన్డిటి ఆక్ట్, ఎంటి పీ ఆక్ట్, సరోగసి చట్టంపై అవగాహన కలిగి, చట్ట పరిధిలోని నిబంధనలు పాటిస్తూ ఆసుపత్రులను నిర్వహించాలని తెలిపారు. ప్రభుత్వ విధానాలలో ప్రైవేటు ఆసుపత్రులు భాగస్వామ్యం వహించి ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలన్నారు. చట్టాలను, నిబంధనలను ఉల్లంఘించిన ప్రైవేటు ఆసుపత్రులపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామన్నారు. కొందరు ఆటిజం, వెల్నెస్ సెంటర్లు, బరువు తగ్గిస్తామని, స్పీచ్ థెరపీ పేరుతో అధిక ఫీజులు వసూలు చేస్తున్నారని, వీరందరూ కూడా రిజిస్టర్ చేసుకోవాలని పరిధి దాటి వైద్యం చేసినట్లయితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అన్ని ప్రైవేటు ఆసుపత్రులు ఆయుష్మాన్ భారత్ డిజిటల్ మిషన్‌లో రిజిస్టర్ కావాలని, ఆసుపత్రిలో పనిచేస్తున్న సిబ్బంది వివరాలు విధిగా నమోదు చేయాలని, విఫలమైనచో చట్టపరమైన చర్యలు ఉంటాయని తెలిపారు. ఈ సందర్భంగా క్లినికల్ ఎస్టాబ్లిష్మెంట్ యాక్ట్, పీసీ అండ్ పిఎన్ డిటి యాక్ట్, ఎంపీపీ యాక్ట్, సరగోసి యాక్ట్, ఆయుష్మాన్ భారత్, ఐహెచ్ఐపి యాక్ట్ వివరముల పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వెంకటి, ఐఎంఏ అధ్యక్ష కార్యదర్శులు జగన్ మోహన్ రెడ్డి, డాక్టర్ మినహాజ్ నస్రబాది, తానా అధ్యక్షు, కార్యదర్శులు డాక్టర్ సురేష్ గౌడ్, డాక్టర్ నౌ నిహాల్ సింగ్, డాక్టర్ మంజులరావు, నిరంజన్ రెడ్డి, డాక్టర్ సాయి కాంత్, డాక్టర్ తుకారం రాథోడ్, డాక్టర్ రవీందర్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## ఎల్లమ్మతల్లి దేవాలయం ఆర్చ్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే

విశాలాంధ్ర - షాద్ నగర్,రూరల్: రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ నియోజకవర్గం ఫరూఖ్ నగర్ మండలం రాయికల్ గ్రామంలో దూసుకల్ గ్రామానికి చెందిన నక్కల స్వరూప సత్యనారాయణ గౌడ్ తన కుమారుడు డా.నక్కల విక్రమా దిత్య గౌడ్ జ్ఞాపకార్థం ఏర్పాటు చేసిన దేవాలయం కమాన్‌ను ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్ రెడ్డి హాజరై రేణుక ఎల్లమ్మ తల్లి దేవాలయం కమాన్‌ను ప్రారంభించడం జరిగింది. దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ శ్యామ్ సుందర్‌రెడ్డి, శివ శంకర్ గౌడ్, అగ్గనూర్ బస్వం, చెంది తిరుపతి రెడ్డి, బాలరాజ్ గౌడ్, వెంకట్ రెడ్డి, బక్కన యాదవ్, ఆశన్న గౌడ్, రాములు గౌడ్, రాయికల్ శ్రీనివాస్, వేణు గౌడ్, మోహన్ రెడ్డి, ఖదీర్, తుపాల శేఖర్, కృష్ణ, చంటి, శ్రీనివాస్ గౌడ్, సుభాష్ గౌడ్, నీళ్ల రవీందర్ గౌడ్, మల్లేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## కేబీసీ గ్లోబల్ లిమిటెడ్ బోనస్ ఈక్విటీ షేరుకు ఆమోదం

విశాలాంధ్ర - శేరిలింగంపల్లి: నాసిక్ కు చెందిన కేబీసీ గ్లోబల్ లిమిటెడ్, బీఎస్ ఈ-541161 ఫిబ్రవరి 15న జరిగిన థీమ్ మీటింగ్‌లో నిర్మాణ, స్థిరాస్తి అభివృద్ధి వ్యాపారంలో పాల్గొన్న డైరెక్టర్ల బోర్డు 1:1 నిష్పత్తిలో బోనస్ ఇష్యూకు (రూ.1 చొప్పున పూర్తిగా చెల్లించే ప్రతి ఈక్విటీ షేరుకు ఒక బోనస్ ఈక్విటీ షేరు) కంపెనీ వాటాదారుల ఆమోదానికి లోబడి ఆమోదం తెలిపింది. సమీప భవిష్యత్తులో విస్తరణ ప్రణాళికలు, రుణ తగ్గింపులను వేగవంతం చేసే ప్రణాళికలతో వ్యాపార కార్యకలాపాలను పునరుద్ధరించాలని కంపెనీ లక్ష్యంగా పెట్టుకుంది. కేబీసీ గ్లోబల్ లిమిటెడ్ పేరును ధరన్ ఇన్ ఫ్రా-ఈపీసీ లిమిటెడ్‌గా లేదా ఆర్ వోసీ ఆమోదించిన మరో పేరుగా మార్చాలని డైరెక్టర్ల బోర్డు ప్రతిపాదించింది. యూకేకు చెందిన కేబీసీ ఇన్ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్ చైర్పర్సన్గా నరేశ్ కర్దా నియామకానికి కంపెనీ ఆమోదం తెలిపింది. రూ.260 కోట్లకు పైగా కంపెనీ ఆర్డర్ బుక్. మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.300 కోట్లు. బోనస్ ఈక్విటీ షేర్లను 2024 మార్చి 31 నాటికి ఫ్రీ రిజర్వ్, సెక్యూరిటీస్ ప్రీమియం అకౌంట్ మరియు క్యాపిటల్ రిడంప్షన్ రిజర్వ్తో సహా కంపెనీ అనుమతించబడిన నిల్వల నుండి జారీ చేస్తారు. బోనస్ ఇష్యూ కోసం మొత్తం రూ.261.43 కోట్లు ఉపయోగించబడతాయి, బోర్డు ఆమోదం పొందిన 60 రోజుల్లో షేర్లు జమ చేయబడతాయి.

# రైతుల గోడు పట్టదా...:కవిత

విశాలాంధ్ర - హైదరాబాద్ : ప్రభుత్వం సాగునీరు ఇవ్వక రాష్ట్రంలో పంటలు ఎండుతున్నాయని, అయినా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి రైతుల గోడు పట్టడం లేదని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ఆగ్రహం వ్యక్తం చేశారు. పంటలు ఎండి రైతులు ఆందోళన చెందుతుంటే, కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం ఇంకా మాటలు చెబుతూ మభ్యపెడుతోందని ధ్వజమెత్తారు. కాంగ్రెస్ పార్టీకి రైతుల ఉసురు తలుగుతుందని శపించారు. మంగళవారం పెద్దగట్టు లింగమంతుల స్వామివారి జాతరలో ఎమ్మెల్సీ కవిత పాల్గొని చౌడమ్మ తల్లికి బోనం సమర్పించారు. లింగమంతుల స్వామి వారిని దర్శించుకున్న అనంతరం సూర్యాపేట జిల్లా బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. ఎమ్మెల్సీ కవిత మాట్లాడుతూ ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం 199 టీఎంసీలతో బనకచర్లలో ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టిందని, అనుమతుల కోసం ఆ రాష్ట్ర సీఎం చంద్రబాబు నాయుడు ప్రయత్నాలు చేస్తున్నారని, కానీ మన ముఖ్యమంత్రి మాత్రం కనీసం నాగార్జునసాగర్ ను కూడా మన ఆధీనంలోకి తీసుకురాలేకపోయారని విమర్శించారు. కాళేశ్వరం ద్వారా సూర్యాపేట జిల్లాలో కేసీఆర్ గోదావరి జలాలను పారించారని, కృష్ణా పరివాహక ప్రాంతంలోనూ గోదావరి నుంచి నీళ్లు ఇచ్చిన ఘనత కేసీఆర్‌దని స్పష్టం చేశారు. కేసీఆర్ హయాంలో కోదాడ నియోజకవర్గానికి కాళేశ్వరం ద్వారా లక్షా 22 వేల ఎకరాలకు నీళ్లు అందించారని వివరించారు. ఇప్పుడు నీళ్లు ఎందుకు తేవడం లేదని ఇరిగేషన్ శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డిని ప్రశ్నించారు. 14 నెలల్లో 30 సార్లు రేవంత్ రెడ్డి ఢిల్లీ వెళ్లారు. ఎవరు ఏమనుకున్నా ఢిల్లీ వెళ్లి కాంగ్రెస్ పెద్దల కాళ్లు పట్టుకుంటా అన్నట్లుగా సీఎం వ్యవహరిస్తున్నారన్నారు. ఇప్పుడు రాష్ట్రంలో మతకల్లోలం లేని ప్రాంతమే లేదని, కాంగ్రెస్ పార్టీ పాలనలో శాంతి భద్రతల సన్నగిల్లాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఎస్సీ, ఎస్టీ, బీసీలతో పాటు ఏ వర్గానికి కాంగ్రెస్ చేసిందేమీ లేదని విమర్శించారు. ఎస్సీ వర్గీకరణ కోసం కేసీఆర్ అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి పంపారని, కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం ఎస్సీ, బీసీల జనాభాను తక్కువ చేసి చూపిస్తున్నదని ఎత్తిచూపారు. బీఆర్ఎస్ పార్టీ గల్లా పట్టుకొని అడిగితే రైతు రుణమాఫీని ప్రభుత్వం ప్రకటించిందని, కానీ ఎవరికీ సంపూర్ణంగా రుణ మాఫీ కాలేదని చెప్పారు. రైతుభరోసా ఒక్కో గ్రామంలో సగం మంది రైతులకు కూడా రాలేదని అన్నారు.

## దోమల బెడదకు శాశ్వత పరిష్కారం దిశగా చర్యలు

విశాలాంధ్ర- కుత్బుల్లాపూర్ : చెరువులో గుర్రపు డెక్కన్ తొలగించి దోమల బెడదకు శాశ్వత పరిష్కారం దిశగా చర్యలు చేపడతామని నిజాంపేట్ కార్పొరేషన్ కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ టేకుల ప్రవీణ్ రెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు మంగళవారం నిజాంపేట్ తురుక చెరువు గుర్రపు డెక్క తొలిగింపు కార్యక్రమంలో భాగంగా అధికారులతో చర్చించి, గుర్రపు డెక్క చెరువులో చేరి పరిసరాల ప్రజలకు దోమల బెడద ఎక్కువగా ఉందని, అట్టి సమస్యను శాశ్వతంగా తొలగించి ప్రజలకు దోమల వ్యాప్తి నుండి ఉపశమనం కలిగించాలని అధికారులతో మాట్లాడడం జరిగిందని ఆయన పేర్కొన్నారు. అందులో భాగంగానే మున్సిపల్ సిబ్బంది గుర్రపు డెక్క పిచికారీ మందు మొదటి దఫా పూర్తి చేయడం జరిగిందని ప్రవీణ్ రెడ్డి తెలిపారు. అలాగే గుర్రపు డెక్క సమస్యను శాశ్వతంగా పరిష్కరించే విధంగా అధికారులతో మాట్లాడి ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటామని, కుత్బుల్లాపూర్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కొలన్ హనుమంత్ రెడ్డి సహకారంతో నిజాంపేట్ కార్పొరేషన్‌లో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా వాటి పరిష్కారంలో ముందుంటామని అన్నారు.

## గిరీష్ కుమార్‌కి కొలను శుభాకాంక్షలు

విశాలాంధ్ర- దుండిగల్ : నియోజక వర్గం నిజాంపేట్ మున్సిపాల్ కార్పొరేషన్ పరిధి ఫేస్-2కు చెందిన గిరీష్ కుమార్ పుట్టినరోజు సందర్భంగా మంగళవారం తన అభిమాన నాయకుడు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కొలన్ శ్రీనివాస్‌రెడ్డిని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించారు. అనంతరం కొలను శ్రీనివాస్ గిరీష్‌కుమార్‌ని దీవించి శాలువాతో సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాస్ రాజు, బాలకృష్ణ, ప్రభాకర్, మహేష్ యాదవ్, సత్యవతి, ఎన్ సత్యవతి తదితరులు పాల్గొన్నారు.

# మహ్మద్ ముస్తాక్ అలీకి ఆమ్‌ఆద్మీ పార్టీ మద్దతు

విశాలాంధ్ర-బషీర్ బాగ్: విద్యావంతులు, మేధావులు రానున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు వేసే ముందుగా ఒక్కసారి ఆలోచించుకోవాలని మెదక్ నిజామాబాద్ ఆదిలాబాద్ కరీంనగర్ ఉమ్మడి జిల్లాల పట్టభద్రుల ఎం.ఎల్.సి నియోజకవర్గం స్వతంత్ర అభ్యర్థి డాక్టర్ మహ్మద్ ముస్తాక్ అలీ కోరారు. వందల కోట్లు డబ్బులు వెదజల్లి గెలిచిన తర్వాత కనీసం తమ ఫోన్ కాల్ కూడ ఎత్తని అభ్యర్థులు కావాలో, మన మధ్యనే ఉండి, తమ కోసం పని చేసే విద్యావంతుడు కావాలో మీరే నిర్ణయించుకోవాలన్నారు. బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మెదక్, నిజామాబాద్, ఆదిలాబాద్ కరీంనగర్ ఉమ్మడి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ నియోజకవర్గం స్వతంత్ర అభ్యర్థి డాక్టర్ మహ్మద్ ముస్తాక్ అలీ, ఆమ్ ఆద్మీ పార్టీ తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ దిడ్డి సుధాకర్, ఆప్ రాష్ట్ర నేతలు విజయ్ ముల్లంగి, నర్సింగ్ యమున గౌడ్, జావీద్ షరీఫ్, డాక్టర్ లక్ష్యా నాయక్ మాట్లాడారు. ఈ సందర్భంగా మహ్మద్ ముస్తాక్ అలీ మాట్లాడుతూ వందల కోట్లకు పడగలెత్తిన కోటీశ్వర్లు రాజకీయ పార్టీల ముసుగులు ధరించి పట్టభద్రులు ఎన్నికల్లో పోటీ చేసి అరచేతిలో స్వర్గం చూపుతూ గెలిచే ప్రయత్నం చేస్తున్నారని, విద్యావంతులైన ఓటరు లారా తమ ఓటు విద్యవంతుడికి వేసి గెలుపించుకోవాలని కోరారు. డాక్టర్ దిడ్డి సుధాకర్ మాట్లాడుతూ మెదక్ నిజామాబాద్ ఆదిలాబాద్ కరీంనగర్ ఉమ్మడి జిల్లాల పట్టభద్రుల ఎం.ఎల్.సి నియోజకవర్గం స్వతంత్ర అభ్యర్థి పోటీ చేస్తున్న మహ్మద్ ముస్తాక్ అలీకి ఆమ్ ఆద్మీ పార్టీ సంపూర్ణ మద్దతను ఇస్తుందని తెలిపారు. ఏ పదవి లేకపోయినా తన స్వంత నిధులతో నిస్వార్థంగా అనేక సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్న మీలో ఒక్కరైన మహ్మద్ ముస్తాక్ అలీని విద్యావంతులైన మీరంతా ఏకమై గెలుపించాలని కోరారు. మెదక్ నిజామాబాద్ ఆదిలాబాద్ కరీంనగర్ ఉమ్మడి జిల్లాల పట్టభద్రుల ఎం.ఎల్.సి నియోజకవర్గంలో ఆమ్ ఆద్మీ పార్టీ శ్రేణులు పట్టభద్రుల ఓటర్ల గడపగడపకు వెళ్లి సెక్యులర్ అభ్యర్థి మహ్మద్ ముస్తాక్ అలీ గెలిపించేందుకు కృషి చేస్తామని డాక్టర్ దిడ్డి సుధాకర్ తెలిపారు.

## నూతన సిఐ రాజేష్‌కి శుభాకాంక్షలు

విశాలాంధ్ర- కూకట్‌పల్లి : నూతన సిఐగా బాధ్యతలు చేపట్టిన సిఐ రాజేష్‌ను మంగళవారం భారతీయ జనతా పార్టీ వివేకానంద నగర్ డివిజన్ నాయకులు కలిసి శాలువతో సత్కరించి పుష్పగుచ్ఛాలని అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా నూతన ఇన్స్‌పెక్టర్ మాట్లాడుతూ నేరాల నియంత్రణకు సహకరించాలని, నేరాల పట్ల ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. అదే విధంగా నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఎస్సై సతీష్ రెడ్డిని శాలువతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేసారు. కార్యక్రమంలో బీజేపీ వివేకానంద నగర్ డివిజన్ అధ్యక్షుడు డాక్టర్ వంశీరెడ్డి, ప్రధాన కార్యదర్శి వై.భాస్కర్ రెడ్డి నేతలు మల్లికార్జున్ రెడ్డి, సిహెచ్.వేణుగోపాల్, బి.కరుణాకర్ పాల్గొన్నారు.

## పూర్తి స్థాయిలో కుల గణన సర్వే నిర్వహించాలి

విశాలాంధ్ర - మేడిపల్లి : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన కుల గణన సర్వేను పూర్తి స్థాయిలో నిర్వహించి, క్షేత్ర స్థాయిలో ఖచ్చితమైన వివరాలను పొందుపరచాలని రాష్ట్ర బీసీ కమిషన్ సభ్యురాలు బాల లక్ష్మీ సూచించారు. మంగళవారం మేడ్చల్ నియోజకవర్గం పీర్జాదిగూడ కార్పొరేషన్ కార్యాలయంలో జరిగిన సమీక్ష సమావేశంలో ఆమె మాట్లాడుతూ కులగణన సర్వేలో పాల్గొనని వారు సర్వేపై ఆసక్తి చూపని వారిని గుర్తించి వారికి అవగాహన కల్పించి మళ్లీ వారిని సర్వే చేయాలని సూచించారు, ఎనుమరేటర్లు సర్వేను సమగ్రంగా పూర్తి చేయడం అత్యంత అవసరమని పేర్కొన్నారు. మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కుల గణన సర్వే ప్రత్యేక కౌంటర్ ను సందర్శించి కుల గణన ప్రొఫార్మాలను పరిశీలించారు. ఈ సర్వే ద్వారా ప్రభుత్వం నిర్దిష్ట గణాంకాలను సేకరించి, భవిష్యత్తు అభివృద్ధి కార్యక్రమాలను రూపుదిద్దుకునే అవకాశం ఉంటుందని ఆమె వివరించారు. ఈ సమావేశంలో మేడ్చల్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ తోటకూర వజ్రేష్ యాదవ్, మున్సిపల్ కమిషనర్ త్రిశేశ్వర్‌రావు, మేడ్చల్ జిల్లా బీసీ డెవలప్మెంట్ అధికారి ఝాన్సీ, మున్సిపల్ అధికారులు, ఎనుమరేటర్లు, వార్డ్ అధికారులు పాల్గొన్నారు.

## డాక్టర్ రెడ్డిస్ లేబరేటరీస్‌లో కార్మికుల ఎన్నికలు

విశాలాంధ్ర-కుత్బుల్లాపూర్ : డాక్టర్ రెడ్డీస్ లేబరేటరీస్ ఎఫ్‌టీవో-3 బాచుపల్లి నందు సోమవారం కార్మికుల సంఘం లేబర్ డిపార్ట్మెంట్ ఎన్నికలు నిర్వహించారు. ఈ ఎన్నికల్లో ఏ-4122, ఏ-110 ఈ రెండు సంఘాల వారు ఎన్నికల బరిలో నిలవగా ఏ-4122 యూనియన్ నుండి ఈ సత్యనారాయణ, ఏ-110 యూనియన్ తరపున ఎంపి రఘునందన్ రావు పోటీ పడగా, ఇ.సత్యనారాయణ 167 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. మొత్తం ఓట్లు 243 కాగా, పోల్ అయిన ఓట్లు 177, ఇ.సత్యనారాయణకు (ఏ-4122) యూనియన్ 172 ఓట్లు రాగా ఎంపీ రఘునందన్ (ఏ-110) యూనియన్ కు 05 ఐదు ఓట్లు వచ్చాయి. 167 ఓట్ల మెజార్టీతో భారీ విజయం సాధించారు. ప్రెసిడెంట్ ఇ.సత్యనారయణ మాట్లాడుతు కార్మికులకి అండగా ఉంటానని ఉద్యోగ భద్రత కల్పిస్తానన్నారు. బిఎంఎస్ఆల్ ఇండియా వైస్ ప్రెసిడెంట్ మల్లేశం, ప్రధాన కార్యదర్శి సుభాష్, రాజు, నాగరాజు, రామ్మోహన్, బలరాంరాజు, రమేష్, కృష్ణమోహన్ తదితరులు పాల్గొన్నారు.

## స్నేహా చికెన్ పరిశ్రమపై ఫిర్యాదు

విశాలాంధ్ర-బషీర్ బాగ్: ప్రాథమిక హక్కులు, పర్యావరణ చట్టాలు, ప్రజారోగ్య భద్రత విషయం లో తీవ్ర ఉల్లంఘనలకు పాల్పడుతున్న స్నేహా చికెన్ పరిశ్రమ అరాచకాలపై తక్షణం జోక్యం చేసుకుని మానవ హక్కులను కాపాడాలని బీసీ పొలిటికల్ జెఎసి స్టేట్ చైర్మన్ రాచాల యుగంధర్ గౌడ్ జాతీయ మానవ హక్కుల కమిషన్‌కు విజ్ఞప్తి చేశారు. మంగళవారం న్యూఢిల్లీ మానవ్ అధికార్ భవన్‌లో జాతీయ మానవ హక్కుల కమిషన్‌కు స్నేహా చికెన్ పరిశ్రమ అరాచకాలపై ఆధారాలతో సహా ఫిర్యాదు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం మహబూబ్‌నగర్ జిల్లా, అడ్డాకులలో ఉన్న స్నేహ చికెన్ ఇండస్ట్రీస్ తీవ్రమైన మానవ హక్కుల ఉల్లంఘనలకు పాల్పడుతుం దని, అనధికారిక నీటి వెలికితీత, ప్రభుత్వ భూమి ఆక్రమణ, పర్యావరణ కాలుష్యంతో సహా ఈ పరిశ్రమ చట్టవిరుద్ధమైన కార్యకలాపాలు స్థానిక రైతులు, నివాసితులు, అట్టడుగు వర్గాలకు తీవ్ర కష్టాలను తెచ్చిపెట్టాయన్నారు. బాధిత వ్యక్తులు అనేకసార్లు ఫిర్యాదులు చేసినప్పటికీ, స్థానిక అధికారులు ఎటువంటి కఠినమైన చర్యలు తీసుకోలేదన్నారు. జాతీయ మానవ హక్కుల కమిషన్ తక్షణమే జోక్యం చేసుకుని, విచారణ జరిపి, బాధిత వ్యక్తుల హక్కులను పరిరక్షించడానికి తగిన చర్య తీసుకోవాలని కోరారు.

## ఆదిభట్ల నిర్మాణాల్లో అనుమతొకటి... నిర్మాణమొకటి..

విశాలాంధ్ర - తుర్కయంజాల్ : రంగారెడ్డి జిల్లా ఆదిభట్ల మున్సిపాలిటీలో నిర్మాణదారులు ప్రభుత్వం నుండి తీసుకొన్న అనుమతికి నిర్మించే నిర్మాణానికి పొంతనే లేదు. కేవలం 200 గజాల్లో జి ప్లస్ 2కు నివాస అనుమతులు తీసుకొని ఎలాంటి సెట్ బ్యాకులు లేకుండా వ్యాపార సముదాయాలు నిర్మిస్తున్నారు. ప్రభుత్వ నిబంధనలు అమలు చేయాల్సిన మున్సిపల్ అధికారులు ఇదే అదునుగా కంచే చేను మేసిన చందంగా అక్రమ నిర్మాణదారుల వద్ద వసూళ్లకు పాల్పడుతూ అక్రమ నిర్మాణాలకు అండగా నిలుస్తున్నారు. ఆదిభట్ల మున్సిపాలిటీ టిసిఎస్ ఎదురుగా శ్రీ మిత్ర వెంచర్‌లో పదుల సంఖ్యలో ప్రభుత్వ అనుమతులు లేకుండా ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతూ నిర్మాణాలు చేపడుతున్నారు. ఆదిలోనే అడ్డుకోవాల్సిన మున్సిపల్ అధికారులు నిర్మాణాలు పూర్తయ్యే వరకు వేచిచూసి నిర్మాణం చివరి దశలో ఉండగా అక్రమ నిర్మాణం అంటూ నోటీసులతో భయభ్రాంతులకు గురి చేస్తూ నిర్మాణదారుల వద్ద బేరాలు కుదుర్చుకొని అందినకాడికి దండుకుంటున్నారు. ఓవైపు రాష్ట్ర ప్రభుత్వం అక్రమ నిర్మాణాలను సహించేది లేదంటూ ప్రతేక సంస్థలను ఏర్పాటు చేసి చర్యలకు ఉపక్రమిస్తుంటే రంగారెడ్డి జిల్లా ఆదిభట్ల మున్సిపాలిటీలో మాత్రం సపరేటుగా పాలన కొనసాగుతుందని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. అక్రమ నిర్మాణాల అవినీతిపై స్థానికులు జిల్లా కలెక్టర్, సిడిఎంఎ, అధికారులకు ఫిర్యాదు చేసి ప్రభుత్వ ఆదాయానికి గండీ కొడుతున్న మున్సిపల్ అధికారులపై చర్యలు తీసుకోవాలని ఆధారాలతో సహా వినతిపత్రాలు అందజేయడం జరిగింది. సదరు నిర్మాణాలపై వివరణ కోరిన ఉన్నతాధికారులకు కమిషనర్ తప్పుడు సమాచారం అందిస్తూ యధావిధిగా అక్రమ కట్టడాలకు అండగా నిలుస్తున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

## ఎస్ఆర్‌డిజి పాఠశాల వ్యాన్ క్లీనర్ మృతి

### మృతదేహంతో రోడ్డుపై ధర్నా

విశాలాంధ్ర - కొత్తగూడెం క్రైమ్ : కొత్తగూడెం జిల్లా కేంద్రానికి అనుకుని ఉన్న చుంచుపల్లి మండల పరిధిలో ఉన్న ఎస్ఆర్‌డిజి స్కూల్ బస్‌లో క్లీనర్‌గా దేశబోయిన శ్రీనివాస్ (45) మంగళవారం మృతి చెందాడు. ఇతను విధులు నిర్వహిస్తున్న క్రమంలో ఐదు రోజుల క్రితం స్కూల్ పిల్లల్ని జూలూరుపాడులో బస్సు నుంచి దింపే క్రమంలో వేరే వ్యాన్ వచ్చి శ్రీనివాసును ఢీకొందని ప్రత్యక్ష సాక్షులు చెప్తున్నారు. తీవ్ర గాయాల పాలైన శ్రీనివాసును ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించారు. పరిస్థితి విషమించడంతో కొత్తగూడెంలోని ప్రైవేటు హాస్పిటల్ లో మెరుగైన చికిత్స కోసం చేర్పించారు. చికిత్స పొందుతూ మంగళవారం తెల్లవారుజామున మృతి చెందడంతో, పోస్టుమార్టం కోసం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కనీసం పాఠశాల యాజమాన్యం ఆర్థిక సహాయం చేయకపోగా ఏమాత్రం పట్టించుకోలేదని కుటుంబ సభ్యులు ఆరోపించారు. యాజమాన్యం నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ మృతదేహాన్ని తీసుకెళ్లి స్కూల్ ముందు ధర్నా చేసేందుకు ప్రయత్నించారు. విషయం తెలుసుకున్న పోలీసులు అడ్డగించారు. దీంతో కుటుంబ సభ్యులు జాతీయ రహదారిపైనే ర్యాలీలో ఉన్న శవంతో ఆందోళనకు దిగారు. తమ కుటుంబానికి జరిగిన అన్యాయాన్ని స్థానిక ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు విచారించి న్యాయం చేయాలని వేడుకుంటున్నారు.

# యథేచ్ఛగా జామాయిల్ అక్రమ రవాణా

- ప్రశ్నించిన 'అగ్రిగోల్డ్' నాయకులపై స్మగ్లర్ల దాడి
- నెల్లూరు జిల్లాలో ఘటన... తీవ్రంగా ఖండించిన ముప్పాళ్ల
- సీఎం దృష్టికి తీసుకెళతామని వెల్లడి

విశాలాంధ్ర బ్యూరో-నెల్లూరు: అగ్రిగోల్డ్ ఏజెంట్స్ కస్టమర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు, అగ్రిగోల్డ్ బాధితులపై మంగళవారం జామాయిల్ స్మగ్లర్లు దాడికి పాల్పడ్డారు. నెల్లూరు జిల్లా ఉదయగిరి నియోజకవర్గం వరికుంటపాడు మండలం కనియంపాడు గ్రామంలోని అగ్రిగోల్డ్‌కు సంబంధించిన జామాయిల్ తోటల్లో స్మగ్లింగ్ జరుగుతున్నట్లు తెలియడంతో అగ్రిగోల్డ్ ఏజెంట్స్ కస్టమర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ గౌరవాధ్యక్షులు, సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు, అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి తిరుపతిరావు, సీపీఐ జిల్లా కార్యదర్శి దామా అంకయ్య అధ్వర్యంలో పెద్ద ఎత్తున అగ్రిగోల్డ్ బాధితులు, ఏజెంట్లు అక్కడికి వెళ్లి పరిశీలించారు. అనంతరం మండల కార్యాలయానికి వెళ్లి తహసీల్దార్‌ను కలిసి జామాయిల్ తోటల నరికివేత, కర్ర తరలింపుపై వివరించారు. ఈ విషయమై తాము ఈ నెల 5వ తేదీ ఇచ్చిన ఫిర్యాదుపై ఏం చర్యలు తీసుకున్నారని ప్రశ్నించారు. తహసీల్దారు పొంతనలేని సమాధానాలు చెప్పడంతో ఎంఆర్ఓ కార్యాలయం ముందు బైఠాయించారు. అనంతరం పోలీస్ స్టేషన్‌కి వెళ్లి అగ్రిగోల్డ్ జామాయిల్ తోటల నరికివేత, జామాయిల్ కర్ర అక్రమ రవాణాపై ఫిర్యాదు చేశారు. ఆ తర్వాత కొంతమంది అగ్రిగోల్డ్ బాధితులు, అసోసియేషన్ నాయకులు నెల్లూరు తిరిగి వెళ్తుండగా జామాయిల్ కలపను దొంగ రవాణా చేస్తున్నవారికి సంబంధించిన దుండగులు ఐదు వాహనాలలో బాధితులు వెళుతున్న వాహనాన్ని వెంబడించి అడ్డగించారు. మాటల్లో చెప్పలేని విధంగా దుర్భాషలాడారు. మా నాయకుడిని తప్పుబడతారా అంటూ దాడి చేశారు. స్మగ్లర్ల దాడిని ముప్పాళ్ల నాగేశ్వరరావు, తిరుపతిరావు, దామా అంకయ్య తీవ్రంగా ఖండించారు. ఈ విషయం ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లి... జామాయిల్ కర్ర దొంగ రవాణా వెనుక ఎవరు చేయిస్తున్నారనే దానిపై విచారణ జరిపి... తరలిపోయిన కలప మొత్తాన్ని రికవరీ చేసేలా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేస్తామని తెలిపారు. కాగా దాడి ఘటనను చిత్రీకరించిన విలేకరుల నుంచి ఫోన్లు తీసుకున్న స్థానిక ఎస్ఐ దాడి దృశ్యాలను డిలీట్ చేశారని ముప్పాళ్ల నాగేశ్వరరావు పేర్కొన్నారు. తొలుత నరికివేతకు గురైన జామాయిల్ తోటల్ని పరిశీలించిన ముప్పాళ్ల మాట్లాడుతూ పేద, సామాన్య, మధ్యతరగతి ప్రజలను మోసం చేసి అగ్రిగోల్డ్ సంస్థ భారీగా దోపిడీ చేసి చేతులెత్తేసిందన్నారు. ప్రభుత్వం ఆ ఆస్తులను స్వాధీనంచేసుకుందని, అవి ప్రభుత్వం, ప్రజలకు చెందినవన్నారు. సందట్లో సడేమియా అన్నట్లు కొందరు రాజకీయనేతలు, అధికారులు వాటిపై కన్నేశారని, ఇప్పటికే టన్నులకొద్దీ కలపను దొంగ రవాణా చేశారని తెలిపారు. కాగా, కనియంపాడు గ్రామంలో జరుగుతున్న ఈ వ్యవహారంలో అధికారులు చోద్యం చూస్తున్నారు. ఒక్క ఉదయగిరి నియోజకవర్గంలో 450 ఎకరాల వరకు అగ్రిగోల్డ్ సంస్థ భూములు కొనుగోలు చేసినట్లు సమాచారం. ఇప్పటి వరకు 250 ఎకరాల్లో జామాయిల్ కర్రలు నరికి వేసినట్లు తెలిసింది. కొన్ని రోజులుగా జామాయిల్ కర్ర నరికివేత సాగుతోంది. మార్కెట్లో పై పొట్టు తీయని జామాయిల్ కర్ర టన్నుకు రూ.6500, పైపొట్టు తీస్తే రూ.7500 ధర పలుకుతున్నట్లు తెలుస్తోంది. పది టైర్ల లారీకి 20 టన్నులు, 12 టైర్ల లారీకి 30 టన్నుల లోడ్‌తో ప్రతినిత్యం 20 నుంచి 40 లారీలు జామాయిల్ కర్రతో తరలివెళ్తుంటే అధికారులు చోద్యం చూస్తున్నారు. ప్రస్తుత ధర ప్రకారం ఎకరానికి ఎనిమిదిన్నర లక్షల రూపాయల ఆదాయం ఉండగా... అక్కడ ఉన్న సంపద ఇప్పటివరకు సుమారు రూ.30 కోట్లు కొల్లగొట్టినట్లు అగ్రిగోల్డ్ బాధితులు చెబుతున్నారు. ఈ కార్యక్రమంలో నెల్లూరు జిల్లా అగ్రిగోల్డ్ ఏజెంట్స్ అండ్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు రామదాసు, సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

## ఇకపై వ్యూహాత్మక భాగస్వామ్యం

### భారత్, ఖతార్ ఒప్పందం

న్యూఢిల్లీ: తమ భాగస్వామ్యాన్ని వ్యూహాత్మక బంధం స్థాయికి తీసుకెళ్లాలని భారత్, ఖతార్ నిర్ణయించాయి. రెండు దేశాల అధినేతలు ఈ మేరకు ఒప్పందం చేసుకున్నారు. ఖతార్ షేక్ తమీమ్ బిన్ హమాద్ అల్ థానీ భారత్ పర్యటనలో భాగంగా ఆయన మంగళవారం ప్రధాని నరేంద్ర మోదీతో భేటీ అయ్యారు. వివిధ అంశాలపై విస్తృతంగా చర్చించారు. వాణిజ్యం, పెట్టుబడులు, సాంకేతికత, ఇంధనం తదితర రంగాల్లో తమ మధ్య సహకారాన్ని, సంప్రదాయ భాగస్వామ్యాన్ని పెంచుకోవాలని నిర్ణయించారు. రెండు దేశాల ప్రయోజనాల దృష్ట్యా ప్రాదేశిక, అంతర్జాతీయ అంశాలపై చర్చించారు. ఈ మేరకు విదేశీ వ్యవహారాల శాఖ ఒక ప్రకటన చేసింది. 'మోదీ ఆహ్వానంతో భారత్‌లో ఖతార్ అమీర్ రెండు రోజులు పర్యటిస్తారు. 2015 మార్చిలో మొదటిసారి భారత్‌కు వచ్చిన అమీర్‌కు ఇది రెండవ పర్యటన' అని పేర్కొంది. తాజా పర్యటనతో రెండు దేశాల మధ్య బహుపాక్షిక భాగస్వామ్యం వృద్ధికి చోదకశక్తి లభిస్తుందని తెలిపింది. తొలుత రాష్ట్రపతి దౌపది ముర్ము స్వాగతం పలుకగా... రాష్ట్రపతి భవన్ వద్ద గౌరవ వందనాన్ని ఖతార్ అమీర్ స్వీకరించారు. ఆపై హైదరాబాద్ హౌస్‌లో ప్రధాని మోదీతో ద్వైపాక్షిక అంశాలపై చర్చించారు. తమ మధ్య వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని ఏర్పాటు చేసుకోవాలని నిర్ణయించారు. సంబంధిత ఒప్పందాలు పునరుద్ధరించుకున్నారు. రెట్టింపు పన్నుల నిరోధానికి, ఆదాయంపై పన్నుల దృష్ట్యా ఆర్థిక ఎగవేతలు అరికట్టడానికి ఒప్పందాలు చేసుకున్నారు. సోమవారం ఢిల్లీకి చేరుకున్న ఖతార్ అమీర్ షేక్ తమీమ్ బిన్ హమద్ అల్ థానీకి ఎయిర్‌పోర్టులో మోదీ స్వాగతం పలికారు. ఆయన భారత్ పర్యటన ఫలప్రదం కావాలని ఆకాంక్షిస్తూ మోదీ ఓ ట్వీట్ చేశారు.

## అర్జీలన్నీ పరిశీలించి ఇంటి పట్టాలివ్వాలి

### రాష్ట్ర బడ్జెట్‌లో బాపట్లకు నిధులు ఇవ్వాలి: జల్లి విల్సన్

విశాలాంధ్ర బ్యూరో-బాపట్ల: అర్జీలన్నీ పరిశీలించి అర్హులైన పేదలకు ఇళ్ల పట్టాలు మంజూరు చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు, మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్ అన్నారు. ఇళ్ల స్థలాలు కేటాయించే ప్రాంతాల్లో అన్ని మౌలిక వసతులు కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ఇంటి నిర్మాణ సమాగ్రి ధరల దృష్ట్యా నిర్మాణ ఖర్చుగా రూ.5 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. జల్లి విల్సన్ మంగళవారం సీపీఐ బాపట్ల జిల్లా కార్యవర్గ సమావేశంలో పాల్గొన్నారు. స్థానిక కార్యాలయంలో జిల్లా కార్యవర్గ సభ్యుడు ఏటగిరి శ్రీనివాసులు అధ్యక్షతన సమావేశం జరిగింది. ఇంటి పట్టాల కోసం ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నా పేదల సమస్య నేటికీ పరిష్కారం కాలేదని జల్లి విల్సన్ ఆందోళన వ్యక్తంచేశారు. ఇచ్చిన హామీకి కట్టుబడాలని సీఎం చంద్రబాబుకు హితవు పలికారు. గ్రామాల్లో మూడు సెంట్లు, పట్టణాల్లో రెండు సెంట్ల చొప్పు ఇళ్ల స్థలాలకు పట్టాలు, నిర్మాణ ఖర్చుగా రూ.5 లక్షలు ఇవ్వాలని జల్లి విల్సన్ డిమాండ్ చేశారు. అలాగే, రాష్ట్ర బడ్జెట్‌లో బాపట్ల జిల్లా సమగ్రాభివృద్ధికి నిధులు కేటాయించాలని జల్లి విల్సన్ డిమాండ్ చేశారు. టిడ్కో ఇళ్ల కేటాయింపులపై మార్చి 15వ తేదీ వరకు సీపీఐ కార్యక్రమాలు కొనసాగుతాయని, కేంద్ర బడ్జెట్‌కు నిరసనగా ఈనెల 20వ తేదీ వరకు ధర్నాలు, ఆందోళనలు జరుగుతాయన్నారు. రాజ్యాంగం, ప్రజాస్వామ్యం, లౌకికవాదం పరిరక్షణ, సామాజిక న్యాయం కోసం మార్చి 23 నుంచి ఏప్రిల్ 14 వరకు జిల్లాలో జాతాలు, ర్యాలీలు, సెమినార్లు, బహిరంగ సభలు నిర్వహించాలని జల్లి విల్సన్ పిలుపునిచ్చారు. రాష్ట్రంలో సమగ్ర కులగణన జరపాలన్నారు. అన్నీ పార్టీలు, బీసీ, ప్రజా సంఘాల ప్రతినిధులతో జిల్లా స్థాయి రౌండ్ టేబుల్ నిర్వహించాలని సూచించారు. జిల్లాలో వలసలు నివారించాలని, గ్రామీణ పేదలకు ఉపాధి హామీ పనులు కల్పించాలని సీపీఐ వ్యవసాయ కార్మిక సంఘాలు చేసిన విజ్ఞప్తులకు స్పందించినందుకు కలెక్టర్ జె.వెంకట మురళిని జిల్లా కార్యదర్శి తన్నీరు సింగరకొండ, కార్యవర్గ సభ్యులతో కలిసి జల్లి విల్సన్ అభినందించారు. కార్యక్రమంలో సీపీఐ కార్యవర్గ సభ్యులు బక్కా వెంకట రామకృష్ణారెడ్డి, చిరమల ప్రకాశ్‌బాబు, బత్తుల శామ్యూల్, జె.రత్నకుమారి, మేడా వెంకట్రావు, జేబీ శ్రీధర్ పాల్గొన్నారు.

స్వామినాథర్ సిఫార్సులు అమలు చేస్తేనే

## రైతాంగ సమస్యలకు పరిష్కారం

జేవీ సత్యనారాయణమూర్తి

విశాలాంధ్రబ్యూరో-అనకాపల్లి: ఏ పార్టీ అధికారంలో ఉన్నప్పటికీ రైతుల సమస్యలపై చిత్తశుద్ధి లేకుండా వ్యవహరిస్తున్నాయని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీ సత్యనారాయణమూర్తి అన్నారు. సీపీఐ శత వార్షికోత్సవాల సందర్భంగా స్వాతంత్ర్య సమరయోధులు, సీపీఐ మాజీ శాసనసభ్యులు కోడుగంటి గోవిందరావు 11వ వర్ధంతిని పురస్కరించుకుని పార్టీ జిల్లా కార్యదర్శి బారేపల్లి వెంకటరమణ అధ్యక్షతన అనకాపల్లిలోని వై విజయ్ కుమార్ హాల్ లో 'వ్యవసాయరంగం-పెనుసవాళ్లు' అనే అంశంపై జరిగిన సదస్సులో సత్యనారాయణమూర్తి మాట్లాడుతూ... గోవిందరావుకి విజయనగరం మహారాజా కాలేజీలో చదువుతున్నప్పుడే కమ్యూనిస్టు భావజాలం వంట పట్టిందన్నారు. అనకాపల్లి పరిసర ప్రాంతాల్లో రైతు సంఘం, వన సంరక్షణ సమితి నిర్మాణం, రైతు సమస్యల పరిష్కారం కోసం, ఉత్తరాంధ్ర సుజల స్రవంతి కోసం ఆయన అహర్నిశలు కృషి చేశారన్నారు. విశాఖ స్టీల్ ప్లాంట్ కోసం పదవిని తృణప్రాయంగా వదులుకున్న వ్యక్తి గోవిందరావు అని కొనియాడారు. ప్రస్తుతం వ్యవసాయ రంగం ప్రపంచవ్యాప్తంగా సంక్షోభంలో ఉందన్నారు. నేడు ఏ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పటికీ రైతు సమస్యలు పట్టించుకోవడం లేదని ధ్వజమెత్తారు. ఉమ్మడి విశాఖ జిల్లాలో 4 ఫ్యాక్టరీలు మూతపడ్డాయి. ఆనాడు భాక్రానంగల్ నుండి నాగార్జునసాగర్ వరకు భారీ నీటి పారుదల ప్రాజెక్టుల వల్ల, హరిత విప్లవం వల్ల రైతులు సుభిక్షంగా ఉండి ఆహార ఉత్పత్తులు విదేశాలకు ఎగుమతి చేసే స్థితిలో ఉండేవారు. నేడు సరళీకృత ఆర్థిక విధానాల వల్ల పారిశ్రామికీకరణ వల్ల వ్యవసాయ రంగం బాగా దెబ్బతిన్నది. పారిశ్రామిక అవసరాల కోసం రియల్ ఎస్టేట్ వ్యాపారాల కోసం భూమిని వాడుకోవడం వల్ల వ్యవసాయ భూమి కనుమరుగైపోతోంది. ఈరోజు రైతు దయనీయ పరిస్థితి వల్లే క్రాప్ హాలిడే పరిస్థితి వచ్చిందన్నారు. మహారాష్ట్రలో రైతు ఆత్మహత్యల్లో మొదటి స్థానంలో ఉందన్నారు. ఈ పరిస్థితుల నుండి రైతు బయట పడాలన్నా, వ్యవసాయ రంగం అభివృద్ధి చెందాలన్నా జస్టిస్ స్వామినాథన్ కమిషన్ సిఫార్సులు కచ్చితంగా అమలు చేసి తీరాల్సిందేనని సత్యనారాయణమూర్తి స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ అనకాపల్లి జిల్లా సహాయ కార్యదర్శులు రాజాన దొరబాబు, మాకి రెడ్డి రామునాయుడు, జిల్లా కార్యవర్గ సభ్యులు కేవీఎస్ సన్యాసిరావు, రెడ్డి పల్లి అప్పలరాజు, భూసి పరమేశ్వరి, వియ్యపు రాజు, బాబ్జి, ఫణేంద్ర, పోతురాజు, మాధవరావు , శంకర రావు , దేముడుబాబు వివిధ గ్రామాల నుండి రైతులు పాల్గొన్నారు.

## బ్యాంకు సిబ్బందికి రక్షణ ఏది?

### ఉద్యోగులపై దాడులు గర్హనీయం: ఏఐబీఈఏ

చెన్నై: బ్యాంకు సిబ్బందికి పని ప్రదేశాల్లో రక్షణ కరువైందని అఖిలభారత బ్యాంకు ఉద్యోగుల సమాఖ్య (ఏఐబీఈఏ) ఆగ్రహం వ్యక్తం చేసింది. బీహార్, నవాడాలో యూనియన్ బ్యాంకు మేనేజర్ అభయ్ కుమార్‌పై దాడిని తీవ్రంగా ఖండించింది. పనివేళల్లో సిబ్బందికి రక్షణ లేదని మరోమారు రుజువు అయిందని ఏఐబీఈఏ ప్రధాన కార్యదర్శి సీహెచ్ వెంకటాచలం మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సిబ్బందిపై దాడి గర్హనీయమన్నారు. చాలా బ్యాంకుల్లో భద్రతా సిబ్బంది లేకపోవడం వల్ల దాడులకు ఆస్కారం ఉంటోందని పేర్కొన్నారు. ఇలాంటివి పునరావృతం కాకుండా పటిష్ఠ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రతి బ్యాంకు శాఖలో సాయుధ గార్డు ఉండాలని, కాల్పులు వంటివి జరిగినప్పుడు ప్రతిఘటించేందుకు సర్వాధికారులు భద్రతా సిబ్బందికి ఉండాలని డిమాండ్ చేశారు. డబ్బు, విలువైన వస్తువులకు రక్షణ కల్పిస్తే సరిపోదని... మానవ సంపదను పరిరక్షించుకోవాలని సూచించారు. 'ఉద్యోగులపై దాడులు జరుగుతుంటే ఆర్బీఐ మౌనం వహిస్తోంది. డీఎఫ్ఎస్ కూడా పట్టించుకోవడంలేదు. ఏం చేయాలో యాజమాన్యాలకు తెలియడం లేదు. నిరుద్యోగం అత్యధికంగా ఉన్న మన దేశంలో బ్యాంకు శాఖల్లో సముచిత సిబ్బందిని నియమించడానికి ఉన్న సమస్య ఏమిటి? శాఖలో సాయుధ గార్డు వుంటే మేనేజర్‌పై దాడి జరిగేదే కాదు. యాజమాన్యాలు, ఆర్బీఐ, డీఎఫ్ఎస్ ఈ విషయాలపై దృష్టి పెట్టాలి. బ్యాంకు సిబ్బంది తమ ప్రాణాలను పణంగా పెట్టి విధుల్లో నిర్వర్తించే పరిస్థితి ఏర్పడింది' అని వెంకటాచలం అసహనం వ్యక్తంచేశారు. సిబ్బందిపై దాడులకు, నియామక సమస్యలకు నిరసనగా మార్చి 24, 25 తేదీల్లో సమ్మెకు బ్యాంకు సంఘాల ఐక్యఫోరం ఇప్పటికే పిలుపునిచ్చింది కానీ దీనిని వాయిదా వేయాల్సి రావచ్చన్నారు. అన్ని యూనియన్లతో చర్చించిన తర్వాత తదుపరి కార్యాచరణను ప్రకటిస్తామని వెంకటాచలం వెల్లడించారు.

## జగన్ బెదిరింపులు సరికాదు

పోలీసు అధికారుల సంఘ నేత శ్రీనివాసరావు

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పోలీసులను బెదిరించడం మానుకోవాలని ఏపీ పోలీసు అధికారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జనకుల శ్రీనివాసరావు హితవు పలికారు. పోలీసులనుద్దేశించి జగన్ తరచూ చేస్తున్న వ్యాఖ్యలను ఆయన మంగళవారం ఒక ప్రకటనలో ఖండించారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు దిగజారిపోయాయని, పోలీసు అధికారులు రిటైర్ అయిన తర్వాత కూడా తీసుకొచ్చి బట్టలూడదీసి నిలబెడతామని మాట్లాడటం సరికాదని ఆగ్రహం వ్యక్తం చేశారు. పోలీసుల మనోభావాలు, ఆత్మస్థైర్యం దెబ్బతినే విధంగా జగన్ వ్యాఖ్యలు ఉన్నాయని తెలిపారు. రాష్ట్రంలో విధులు నిర్వహిస్తున్న పోలీసులు ఎనిమిది నెలల క్రితం వైసీపీ ప్రభుత్వంలో పని చేసిన వారేననే విషయాన్ని జగన్ గుర్తుంచుకోవాలన్నారు.

## కుంభమేళాలో పవన్ పుణ్యస్నానం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఉత్తరప్రదేశ్‌లో జరుగుతున్న కుంభమేళాకు హాజరయ్యారు. ప్రయాగ్‌రాజ్ త్రివేణి సంగమంలో కుటుంబ సమేతంగా పుణ్యస్నానాలు చేశారు. మంగళవారం ఉదయం హైదరాబాద్ నుంచి ప్రయాగరాజ్ చేరుకున్నారు. పవన్ వెంట భార్య అన్నా లెజినోవా, కుమారుడు అకిరానందన్ ఉన్నారు. అనంతరం పితృదేవతలకు తర్పణాలు వదిలి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. 144 ఏళ్లకు ఒకసారి జరిగే మహాకుంభమేళాకు హాజరు కావడం తన అదృష్టమని పవన్ అన్నారు. పవన్‌తో కలిసి ప్రముఖ సినీ దర్శకుడు తివిక్రమ్ శ్రీనివాస్ కూడా కుంభమేళాలో పాల్గొన్నారు.

# తునిలో ఉద్రిక్తత

నాలుగోసారి మున్సిపల్ వైస్ చైర్మన్ ఎన్నిక వాయిదా

విశాలాంధ్ర-కాకినాడ, అన్నవరం: కాకినాడ జిల్లా తుని మున్సిపల్ కార్యాలయం ఎదుట ఉద్రిక్తత నెలకొంది. నాటకీయ పరిణామాల నడుమ వైస్ చైర్మన్ ఎన్నిక నాల్గోసారి వాయిదా పడింది. ఈ మేరకు ఎన్నికల అధికారి రవికుమార్ ప్రకటించారు. ఎన్నికకు 29 మంది సభ్యులు అవసరం కాగా 10 మంది మాత్రమే హాజరయ్యారు. దీంతో వాయిదా తప్పలేదు. ఈ వ్యవహారాన్ని ఎన్నికల సంఘం దృష్టికి తీసుకెళతామని అధికారి తెలిపారు. వైసీపీ, టీడీపీ కౌన్సిలర్ల ఘర్షణతో మున్సిపల్ కార్యాలయం వద్ద పరిస్థితి ఉద్రిక్తమైంది. వైసీపీ కౌన్సిలర్లు లోపలికి వెళ్లకుండా టీడీపీ సభ్యులు అడ్డుకున్నారు. మున్సిపల్ చైర్మన్ ఇంటి వద్ద వైసీపీ కౌన్సిలర్లను కట్టడి చేయడంతో వివాదం ముదిరింది. పోటీ చేయకుండా తమ కౌన్సిలర్లను వైసీపీ అడ్డుకుంటున్నట్లు టీడీపీ ఆరోపించింది. తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని వైసీపీ నేతలు ప్రత్యారోపణలకు దిగారు. ఉద్రిక్తత దృష్ట్యా సెక్షన్ 163(2) విధిస్తూ కలెక్టర్ ఆదేశాలిచ్చారు. తుని మున్సిపాలిటీ పరిధిలో ఆంక్షలు విధించారు. ఐదుగురికి మించి ఒక చోట ఉండరాదన్నారు. కర్రలు, రాళ్లు, ఆయుధాలను నిషేధించారు. పోలీసులు భద్రతను కట్టుదిట్టం చేశారు. తొలుత టీడీపీ కౌన్సిలర్లకు మద్దతివ్వాలని 10 మంది వైసీపీ కౌన్సిలర్లు నిర్ణయించారు కానీ ఎన్నిక సమయానికి వారు రాలేదు. తమ కౌన్సిలర్లపై ఒత్తిడి తెచ్చారంటూ టీడీపీపై వైసీపీ నేత దాడిశెట్టి రాజా ఆరోపణ చేశారు. వైసీపీ కౌన్సిలర్లను నిర్బంధించిన ఆరోపణలతో టీడీపీ సభ్యులతో సహా 10 మందిపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇదిలావుంటే దాడిశెట్టి రాజా పిలుపు మేరకు వైసీపీ ప్రత్తిపాడు నియోజకవర్గ నాయకుడు ముదునూరి మురళీకృష్ణ రాజు, ఉత్తరాంధ్ర ప్రాంతీయ సమన్వయకర్త కురసాల కన్నబాబు, మాజీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర రెడ్డి, వైసీపీ మహిళా నేత నాగమణి, ఎమ్మెల్సీ అనంతబాబు, నేతలు పిల్లి సూర్యప్రకాశ్, సుంకర శివ ప్రసన్న బయలుదేరగా... 'ఛలో తుని'కి అనుమతులు లేవని గొల్లప్రోలు టోల్ గేటు దగ్గర ఆపేశారు. ముద్రగడ పద్మనాభం తనయుడు గిరిని తుని పొలిమేరల్లో పోలీసులు నిలిపివేశారు. కాకినాడ జిల్లా హద్దుల్లోకి వైసీపీ శ్రేణులు రాకుండా బందోబస్తు పెట్టారు. తాజా పరిస్థితులు గత 'వైస్రాయ్ హోటల్' ఘటనను గుర్తుచేస్తోందని రాజకీయ పరిశీలకులు అంటున్నారు.

## నదుల అనుసంధానంతోనే సిరిసంపదలు

అఖిల భారత జలవనరుల మంత్రుల సమావేశంలో నిమ్మల

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: నదుల అనుసంధానం, నీటి వనరుల సమర్థ సద్వినియోగంతో రాష్ట్రంలో సిరిసంపదలు సృష్టించవచ్చనే ప్రగాఢ విశ్వాసంతో తమ ప్రభుత్వం ముందుకు వెళ్తున్నట్లు రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు చెప్పారు. రాజస్థాన్‌లోని ఉదయపూర్‌లో రెండవ అఖిల భారత నీటిపారుదల మంత్రుల సమావేశం మంగళవారం జరిగింది. నిమ్మల మాట్లాడుతూ నదుల అనుసంధాన ప్రక్రియకు ప్రధాని మోదీ, చంద్రబాబు సమర్థ నాయకత్వంలో ఆంధ్ర రాష్ట్రంలో శ్రీకారం చుట్టామన్నారు. నాలుగు కోట్ల ఎకరాలు భూ విస్తీర్ణం ఉండగా, అందులో రెండు కోట్ల ఎకరాలు వ్యవసాయ యోగ్యంగా ఉందన్నారు. కోటి ఎకరాలకు ఇంకా నీటి వసతి కల్పించాల్సి ఉందని వివరించారు. ప్రతి ఎకరాకు నీరు అందించి రాష్ట్రాన్ని కరవురహిత ప్రాంతంగా చేయాలనే లక్ష్యంగా పెట్టుకున్నటు చెప్పారు. నీటి వనరులు, సాగు నీటి ప్రాజెక్టులు, జరుగుతున్న పనులను పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. దేశంలోనే మొదటి సారిగా 2017లో ఏపీ వారీమ్స్ టెక్నాలజీని ప్రవేశపెట్టి, రియల్ టైం గవర్నెన్స్ ద్వారా వాటర్ మేనేజ్‌మెంట్ చేసి సమర్థ నీటి వినియోగాన్ని చంద్రబాబు తీసుకొచ్చారని పేర్కొన్నారు. దీని ద్వారా గతంలో కంటే ఈ ఏడాది రిజర్వాయర్లలో అదనంగా 53శాతం నీటి నిల్వ చేయగలిగామని వివరించారు. ప్రపంచంలోనే ఎక్కువ సామర్థ్యంతో అనగా 50లక్షల క్యూసెక్కుల వరద డిశ్చార్జి సామర్థ్యంతో 1128 మీటర్ల పొడవైన స్పిల్‌వే నిర్మించినట్లు మంత్రి స్పష్టంచేశారు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణం పూర్తైతే కృష్ణా, గోదావరి డెల్టాల స్థిరీకరణ జరుగుతుందని, సుస్థిర వ్యవసాయం సాధ్యపడుతుందని, తద్వారా రాష్ట్ర దశ, దిశ మారగలదని చెప్పారు. సాగు, తాగు, పారిశ్రామిక అవసరాల కోసం మరో 85 ప్రాజెక్టులు వివిధ దశల్లో ఉన్నాయని వివరించారు. భూగర్భ జలాల్ని కొలిచేందుకు 1810జియో మీటర్లు ఏర్పాటు చేశామని, దేశంలోనే తొలిసారిగా బోర్ వెల్స్‌కు జియో ట్యాగ్ చేసి వినియోగిస్తున్నట్లు తెలిపారు. వికసిత భారత్-2047లో భాగంగా కరవు రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దడమే చంద్రబాబు లక్ష్యమని చెప్పారు. ఏపీలో ఉన్న ఐదు ప్రధాన నదులు, 35 మైనర్ నదులు నుంచి జలాలని గరిష్టంగా వినియోగించి రాయలసీమ వంటి కరవ ప్రాంతాలకు నీటిని తరలించేలా కార్యాచరణ చేపడుతున్నట్లు వెల్లడించారు. పోలవరం-బనకచర్ల లింక్ ప్రాజెక్టు, రాష్ట్రానికి సంబంధించిన మరి కొన్ని ప్రతిపాదిత నీటిపారుదల ప్రాజెక్టులకు పూర్తి స్థాయిలో ఆర్థిక సహకారంతో పాటు, అన్ని రకాల అనుమతులు ఇవ్వాలని వేదికపైనున్న కేంద్ర జలశక్తి మంత్రి సీఆర్ పాటిల్‌ను, ఉన్నతాధికారులను మంత్రి నిమ్మల కోరారు.

## వక్ఫ్ బోర్డు సీఈఓగా మహమ్మద్ అలీ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఏపీ వక్ఫ్ బోర్డు సీఈఓగా షేక్ మహమ్మద్ అలీ నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. మహమ్మద్ అలీ... గుంటూరు జిల్లా తాడికొండ నియోజకవర్గం వేమూలూరిపాడుకు చెందిన వారు. 1992 నుంచి వక్ఫ్ బోర్డులో సేవలు అందించారు. ప్రాథమిక స్థాయి నుంచి ఉన్నత స్థాయికి ఎదిగారు. సీఈఓగా బాధ్యతలు తీసుకోనున్న అలీకి అభినందనలు వెల్లువెత్తాయి.

## వంశీని పరామర్శించినందుకు సిగ్గుపడాలి

### జగన్‌పై కొల్లు, అనగాని ధ్వజం

విశాలాంధ్ర బ్యూరో - అమరావతి: దళితులు, యువకులు, మహిళలపై దాడి చేసి, టీడీపీ కార్యాలయాన్ని అక్కడ ఉన్న కార్లను తగలబెట్టి, పలువురిని గాయపరిచిన వ్యక్తి వంశీకి వత్తాసు పలకడానికి జగన్‌కు సిగ్గుగాలేదా అని మంత్రులు కొల్లు రవీంద్ర, అనగాని సత్యప్రసాద్ ధ్వజమెత్తారు. గన్నవరం మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీని విజయవాడ జిల్లా జైలులో వైసీపీ అధినేత, మాజీ సీఎం జగన్ పరామర్శించడాన్ని వీరు తప్పుబట్టారు. మంగళగిరి టీడీపీ కేంద్ర కార్యాలయంలో మంగళవారం విలేకరుల సమావేశంలో రవీంద్ర మాట్లాడుతూ దేశ చరిత్రలోనే ఒక రాజకీయ పార్టీ కార్యాలయాలపైనా దాడి చేసిన ఘటనలు లేవని అన్నారు. దాడి గురించి ఫిర్యాదు చేసిన వ్యక్తిని కిడ్నాప్ చేయించిన వ్యక్తిని వెనకేసుకు రావడం దుర్మార్గం అన్నారు. వంశీని పరామర్శించిన తర్వాత జగన్ తప్పుడు మాటలు మాట్లాడుతున్నారన్నారు. ప్రశాంతంగా ఉన్న కృష్ణా జిల్లాలో పులివెందుల ఫ్యాక్షనిజాన్ని తీసుకురావడానికి జగన్ గూండాలు ప్రయత్నించారని మండిపడ్డారు. నిష్పక్షపాతంగా విచారణ చేపడుతున్న అధికారుల్ని అసభ్యపదజాలంతో దూషిస్తున్నారని, ఇదేనా జగన్ నీ సంస్కారం అని నిలదీశారు. క్యాసినోలు, కబ్జాలు, భూములు కొట్టేయడం, దాడులు మరెన్నో బయటకు వస్తున్నాయన్నారు. వంశీ, కొడాలి నాని, జోగి రమేశ్, పేర్ని నాని చేసిన అరాచకాలు ఒక్కొక్కటిగా వెలుగు చూస్తున్నాయన్నారు. చట్టం నుంచి ఎవరూ తప్పించుకోలేరని అన్నారు. అనగాని మాట్లాడుతూ... గతంలో అధికారం కోసం బూటకపు ఓదార్పు యాత్ర చేసిన జగన్... నేడు మరో బూటకపు జైలు యాత్ర నిర్వహించాడని విమర్శించారు. రౌడీజయిం, దౌర్జన్యం చేసిన వంశీ జైలు కెళితే ... ప్రజల తరపున పోరాటం చేసిన వ్యక్తిలా అతడిని పరామర్శించడం జగన్‌కే సిగ్గు చేటన్నారు. కేసు పెట్టిన దళితుడిని కిడ్నాప్ చేసి ... నానా హింసలు పెట్టి అతడితో తప్పుడు ప్రకటన ఇప్పించాడని అన్నారు.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No.148108 (TEL TEL/2017/75553), Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.